




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

28-12-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 327 పేజీలు: 8+4 వెల: 8.00







# వేల కోట్లతో రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి పనులు



శనివారం హిందూపురంలో వందేభారత్‌కు పచ్చ జెండా ఊపిన రైల్వేమంత్రి సోమన్న, తదితరులు

'అమృత్' కింద 73 స్టేషన్ల ఆధునీకరణ

రైల్వే సహాయ మంత్రి సోమన్న వెల్లడి

**హిందూపురం , డిసెంబరు 27 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ లో వేలాది కోట్ల రూపాయల వ్యయంతో రైల్వేఅభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న వెల్లడించారు. కాచిగూడ- యశ్వంత్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను హిందూపూర్‌లో నిలుపుదల చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హిందూపురం ఎంపీ పార్థసారథి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఇక్కడ వందే భారత్ రైలు ఆపాలని తనను కోరారని చెప్పారు. వారిద్దరి కృషితోనే ఈ సౌకర్యం ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రైల్వే స్టేషన్‌లో ఆధునికరణ కొత్త లైన్ల ఏర్పాటు మొదలైన చేస్తున్నామని చెప్పారు. గతంలో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు ఇంతకుముందు రూ. 886 కోట్లు మంజూరు చేయగా, 2024-25లోనే రూ. 9,470 కోట్ల విలువైన రైల్వేప్రాజెక్టులకు ఆమోదం లభించిందని మంత్రి తెలియజేశారు. 1,560 కి.మీ కొత్త రైల్వే లైన్లు అభివృద్ధిలో ఉన్నాయని, 717 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబి), రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యుబి) నిర్మించామని ఆయన తెలిపారు. ప్రస్తుతంరాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నం మరియు రాజమండ్రి వంటి ప్రధాన స్టేషన్‌లతో సహా ఆంధ్రప్రదేశ్‌లోని 73 రైల్వే స్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద తిరిగి అభివృద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే

# జిల్లాల పునర్విభజన

31న తుది నోటిఫికేషన్ జారీ

పునర్విభజనలో కొద్ది మార్పు,చేర్పులు

927 అభ్యంతరాలు, సూచనలపై సుదీర్ఘ చర్చ

నెల్లూరు జిల్లాకే గూడూరు, నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్

మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు

సమీక్షలో సిఎం చంద్రబాబు



శనివారం జిల్లాల పునర్విభజపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 27, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాభిప్రాయానికే అనుగుణంగానే జిల్లాల పునర్విభజన జరుగుతుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఈ విషయంలో ప్రజల సౌలభ్యతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చినట్లు వివరించారు. జిల్లాల పునర్విభజనపై స్వల్ప మార్పుచేర్పులతో ముందుకువెళ్లాలని ముఖ్య మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వ్యక్తమైన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. గత నెల 27న జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా 3 జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో సహా వివిధ మార్పులపై నోటిఫికేషన్ విడుదల అయింది.. దీనిపై నెల రోజుల పాటు ప్రభుత్వం అభ్యంతరాలను స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. వాటిపై క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రులు, అధికారులతో ముఖ్య మంత్రి సమీక్ష నిర్వహించారు. కొన్ని మండలాలు గతంలోనే ఉన్న జిల్లాల్లోకి మార్చాలన్న ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్నట్లు ముఖ్య మంత్రి తెలిపారు. కొన్ని మండలాలపై ఇంకా నిర్ణయం తీసుకునే దిశలోను ఆలోచన జరుగుతుందన్నారు. జిల్లాల పునర్విభజనపై ఈ నెల 31న తుది నోటిఫికేషన్ జారీ చేసే దిశలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. **నెల్లూరు జిల్లాలోకే తిరిగి 5 మండలాలు:** గూడూరు ప్రజల అభిప్రాయం మేరకు గూడూరు నియోజక వర్గంలోని 5మండలాలలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కలపాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అలాగే రైల్వే కోడూ రును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో, రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్టను కడప జిల్లాలో విలీనం చేయాలన్న అంశంపైనా చర్చ జరిగింది. అయితే దీనిపై తుది నిర్ణయం తీసు కోవాల్సి ఉంది. విస్తీర్ణపరంగా పెద్దదైన ఆదోనిని రెండు >>2



శనివారం శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిపై సమీక్షలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కేంద్ర నిధులతో శ్రీకాకుళం

# సత్వర అభివృద్ధి చర్యలు

వ్యవసాయ పారిశ్రామిక వృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఆరోగ్యం, విద్య, తాగునీరుపై సమీక్ష జరిపిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, డిసెంబరు 27 ప్రభాతవార్త:** కేంద్ర నిధులను వినియోగించుకుంటూ శ్రీకాకుళం జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, పారిశ్రామిక వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ సమావేశం రామ్మోహన్‌నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రోడ్ సేఫ్టీ, వ్యవసాయం, పౌర సరఫరాలు, నాబార్డ్, డ్వామా, రూరల్, వాటర్ స్కీం, ఆరోగ్య, మైనింగ్, విద్య, సమగ్ర శిక్ష, మున్సిపాలిటీ శాఖల అధికారులతో జిల్లాలో అభివృద్ధి నివేదికలపై సమగ్రంగా చర్చించారు. ఇంత వరకు చేసిన పనుల ప్రస్తుత స్థితిని భవిష్యత్తు పురోగతని సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలు కేంద్ర మంత్రి చేశారు. తొలుత రవాణాశాఖకు సంబంధించి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అందరిలో కూడా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. నవభారత్ కూడలి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి ఆవశ్యకతను గుర్తు చేశారు. జాతీయ రహదారులను ఆనుకుని బ్లాక్ స్పాట్స్‌ను నిర్ధారణ చేయడం, భవిష్యత్తులో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. వ్యవసాయశాఖపై సమీక్షిస్తూ పంటమార్పిడి విధానంపై రైతులు అవగాహన తెచ్చుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. >>2

# ఇక కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు



రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా అందజేత

తప్పులు తొలగించిన పాస్‌పుస్తకాలే పంపిణి

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** నూతన సంవత్సరంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు ఏపీ ప్రభుత్వం ఇవ్వనున్నంది. ఇందుకోసం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో 2026 జనవరి 2 నుంచి 9 వరకు ప్రతి గ్రామంలో సభలు నిర్వహించనున్నారు. పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు ఇప్పటికే రెవెన్యూ శాఖ చర్యలు ప్రారంభించింది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం జగన్ బొమ్మలతో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చింది. దీనిపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఇది ఒక రకంగా గత ప్రభుత్వం పరాజయం పాలు కావడానికి కారణమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఇచ్చిన 21.86 లక్షల భూహక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ.22.50 కోట్లు నిధులను కూడా విడుదల చేసింది. కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ పూర్తయినా పంపిణీ కార్యక్రమం 8 నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. దీంతో రైతులు అనేక భూసంబంధిత లావాదేవీల విషయంలో ఇబ్బందులు పడ్డారు. జాప్యాన్ని నియంత్రించాలని ప్రభుత్వానికి విజప్తి చేసారు. ఈ క్రమంలో ముద్రణ పూర్తైన పట్టాదారు పాస్‌పుస్తకాల్ని సత్వరమే రైతులకు అందించాలని ఇటీవల కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ మేరకు రెవెన్యూ శాఖ గ్రామ సభల ద్వారా పంపిణీకి కార్యాచరణ రూపొందించింది. పట్టాదారు పాసుపుస్తకాలను జనవరి 2 నుంచి 9 వరకు పంపిణీ చేయనున్నారు. ఇందుకుగానూ రెవెన్యూ శాఖ గ్రామ సభలు నిర్వహించాలి. పట్టాదారుల వివరాల్ని వెబ్‌ల్యాండ్‌లోని వివరాల ప్రకారం సరిపోల్చి చూసి ఎలాంటి తప్పులు లేని పాస్‌పుస్తకాలు అందజేయాలి. వేలిముద్ర ద్వారా సంబంధిత పట్టాదారుకు కొత్త పుస్తకాలు అందించేలా చూడాలి. ఇందుకోసం అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలి. పంపిణీ ప్రక్రియ వీఆర్వో ఆన్‌లైన్ ఈకేవైసీ ద్వారా నిర్వహించాలి. పుస్తకాలు అందాయంటూ లబ్ధిదారులతో సంతకాలు తీసుకోవాలి. ఇది ఒక రిజిస్టర్‌లో తప్పని సరిగా నమోదు చేయాలి. పాత భూహక్కు పత్రాలు వెనక్కి తీసుకోవాలి. రీసర్వే చేసిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి. పారదర్శక పంపిణీలో భాగంగా నిర్ణయించిన తేదీ వివరాలు, సమయాలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ఇతర భాగస్వాములకు ముందే తెలియజేయాలి. జిల్లాల వారీ షెడ్యూల్ కార్యక్రమాల వివరాల్ని డిసెంబరు 30లోగా సీసీఎల్ఏ కార్యాలయానికి పంపాలి. ముద్రణ పూర్తైన పట్టా దారు పాస్‌పుస్తకాల్లో చాలా తప్పులు దొర్లాయనే అంశాలు ఇటీవల వెలుగులోకి >>2

నేడు అయోధ్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు 2లో




గమనిక

**ఆదివారం అనుబంధం బదులుగా నేటి సంచికతో 2026 కొత్త కేలండర్ అందుకోండి..**

\- సర్క్యులేషన్ మేనేజర్

స్త్రీశక్తి బస్సుల్లో కండక్టర్లకు

## పవర్ బ్యాంకులు

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** స్త్రీ శక్తి బస్సుల్లో విధులకు వెళ్ళే కండక్టర్ల ఈపోస్ యంత్రాలతో పాటు,అదనంగా పవర్ బ్యాంకులు ఇవ్వనునానరు. ఈ మేరకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న ఈపోస్ యంత్రాల బ్యాటరీ సామర్థ్యం 3,300 ఎంఏహెచ్‌గా ఉంది. స్త్రీ శక్తి పథకం అమలు చేస్తున్న ఐదు రకాల బస్సుల్లో ప్రయాణీకుల రద్దీ అధికంగా ఉంటోంది. దీనివల్ల టికెట్ల జారీకే బ్యాటరీ సామర్థ్యం సరిపోతోంది. రియల్‌టైమ్ జీపీఎస్ ట్రాకింగ్ చేయలేకపోతున్నారు. ఈ >>2

లింకు డాక్యుమెంట్లు లేకుండానే

# అమరావతి రైతులకు రుణాలు

కేంద్రమంత్రి పెమ్మసాని



**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు 30 ఏళ్ళ పాటు లింక్ డాక్యుమెంట్‌లు అడగకుండా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి సీఆర్‌డీఏ ఇచ్చే డాక్యుమెంట్ ఆధారంగానే రుణాలు ఇచ్చేందుకు సమ్మతించారని పేర్కొన్నారు. రాజధాని రైతుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసి త్రిసభ్య కమిటీ సభ్యులైన పెమ్మసాని చంద్రశేఖర్,ఎంఎల్ఏ తాడికొండ శ్రవణ్‌కుమార్,సీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమై దాదాపు 3 గంటల పాటు వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాలో మాట్లాడిన పెమ్మసాని భేటీలో చర్చించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. భూవి వాదాలకు సంబంధించిన అంశాలను త్వరలోనే ఒక కొలిక్కి తీసుకొస్తామన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో అమరావతి ప్రాంతానికి చెందిన దాదాపు 10 వేల మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జరీబు భూముల సమస్యపై సర్వే పూర్తి చేశామని,కమిటీ నివేదిక ఆధారంగా జరీబు రైతులకు న్యాయం చేస్తామన్నారు. లంకభూములు రిజిస్ట్రేషన్‌కు 277 మంది నమోదు చేసుకోవాల్సి ఉందని, వారంతా త్వరగా ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. అసైన్ట్ భూముల నా య్యయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఐదుగురు ఐఎఎస్‌లకు

# ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో 2010 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించింది. సూపర్ టైమ్ స్కేల్ (పే మ్యాట్రిక్స్ లెవల్-14)కు, క్యాడర్‌కు సమానంగా, 2026 జనవరి 1నుండి అమలులోకి వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ప్రభుత్వ కార్యదర్శులు గా పదోన్నతి పొందిన అధికారులలో చదలవాడ నాగరాణి, డా. నారాయణ భరత్ గుప్తా, అమ్రపాలి కటా, జె.నివాస్, గంధం చంద్రుడు ఉన్నారు. పదోన్నతుల అనంతరం డా.నారాయణ భరత్ గుప్తాను అదే పదవిలో కొనసాగిస్తూ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, ఆర్‌యూఎస్ఏ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. అమ్రపాలి కటా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా >>2







శనివారం హైదరాబాద్‌లో సిఎం చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న నారా భువనేశ్వరి తదితరులు

# నా చొరవ వల్లే ఉన్నత విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్

## ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్ చిన్న మొక్క నుంచి పెద్ద వృక్షంగా మారింది

### సంస్థ వార్షికోత్సవంలో సిఎం చంద్రబాబునాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్27:** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గండిపేటలో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. "గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదేనని అభినందించారు.గ్రూప్1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు అని చెప్పారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగిందని పేర్కొన్నారు. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారిందన్నారు. 'రాజకీయాల ద్వారా కాకుండా వ్యవ సాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసు కునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు' అని చెప్పారు. 'ఆరోజు హైటెక్ సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ,క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ. స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు. 'మన సంస్కృతి సంప్రదాయాలను ఎప్పుడూ మరిచి పోవద్దు.ఆధునాతన విధానాల్ని అందిపుచ్చుకోవాలి విలువలను కాపాడుకోవాలి. విద్యార్థులందరూ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి, టెక్నలాజీని అందిపుచ్చుకోవాలి.ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.అడిషనల్ కోర్సులు చేపట్టండి...నిరంతరం నేర్చుకునే అంశంపై ఫోకస్ పెట్టండి.విద్యార్థులు కెరీర్ మీద దృష్టి పెట్టండి.విద్యతో పేదరికాన్ని జయించవచ్చు, అప్పుడు సంపద ఆటోమేటిగ్గా వస్తుంది ప్రాణత్యాగాలు చేసిన కార్యకర్తల కుటుంబాల పిల్లలకు ఈ విద్యా సంస్థల ద్వారా విద్యను అందిస్తున్నాం. దేశం మెచ్చే విధంగా విద్యా సంస్థలను రన్ చేయాలి. విద్యార్థులు చక్కగా చదువుకుని సమాజంలో గుర్తింపు దక్కించుకోవాలి, ఎన్టీఆర్ విద్యా సంస్థలకు విద్యార్థులే బ్రాండ్ అని ఏపీ సిఎం పేర్కొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ ట్రస్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిప్రారంభించారు. తర్వాత యాన్యువల్ రిపోర్టులను ఎన్టీఆర్ విద్యా సంస్థలకు చెందిన స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్స్ జోజి రెడ్డి, రామారావు సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల ఆశలకు అనుగుణంగా వారి భవిష్యత్తును రూపుదిద్దుతున్నాం.మానవ సేవే మాధవ సేవ అని ఎన్టీఆర్ నమ్మారు. దానికి అనుగుణంగానే ఎన్టీఆర్ ట్రస్ట్ పని చేస్తోందని చెప్పారు.ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి హెల్త్ కేర్ సర్వీసులు, తలసేమియా సెంటర్, ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు పని చేస్తున్నాయన్నారు.పేద, అనాథ పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్నాం.సివిల్ సర్వీసెస్ అకాడెమీ ద్వారా యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి శిక్షణ ఇప్పిస్తున్నాం.ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు,ప్రకృతి వైపరీత్యాల్లో ఉన్నప్పుడు వారిని అన్ని విధాలా ఆదుకుంటున్నామన్నారు.స్త్రీశక్తి ద్వారా పేద మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. ఎన్టీఆర్ సుజల ద్వారా రక్షి త తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పేదల జీవితాల్ని బాగుపరిచేలా, విద్యార్థులకు అండగా నిలిచేలా, కుటుంబాలను ఆదుకునేలా ఎన్టీఆర్ ట్రస్ట్ పని చేస్తాం దన్నారు. ఇదే ఎన్టీఆర్‌కు మేం ఇచ్చే నివాళి.ఎన్టీఆర్ విద్యా సంస్థల ద్వారా చదువుకున్న వారు వివిధ ప్రాధాన్యత రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే టీచర్లు ఎన్టీఆర్ విద్యా సంస్థల్లో ఉన్నారు. బాహ్య ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది... దానికి ఇక్కడి నుంచే సంసిద్ధమవ్వండి సూచించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో.. ఆయన చూపిన దారిలో ఎన్టీఆర్ విద్యా సంస్థలను, ఎన్టీఆర్ ట్రస్టును నడుపుతున్నాం. విద్యార్థులే ఎన్టీఆర్ విద్యా సంస్థలకు అంబా సిడర్లు అని నారా భువనేశ్వరి తెలిపారు.

# గాంధీజీ పేరు తొలగింపు సహించం

## ఎంజిఎన్‌రేగా చట్టాన్ని రక్షించుకొంటా: ఖర్గే, రాహుల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమూలంగా మార్చివేసి పేదల కడుపు కొడుతున్న ఎన్డీయే సర్కారుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే వెల్లడించారు. ఎంజిఎన్‌రేగా స్థానంలో ప్రభుత్వం విబిజి రామ్‌జి చట్టాన్ని తీసుకురావడం నిరుపేదలకు భృతిని కరువుచేయడమేనని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో గాంధీపేరును చెరిపివేయడం చూస్తుంటే బాపూజీని జాతిపిత గాంధీని అవమానించడమేనని అన్నారు. వర్కింగ్‌కమిటీ సమావేశంలోనే తాము దేశవ్యాప్తంగా విస్తృత అందోళన నిర్వహించాలని ప్రతిజ్ఞచేసినట్లు



చెప్పారు. ఎంఎన్‌రేగా స్కీంనే కేంద్ర బిందువుగాచేసుకుని ఈ ఆందోలన కొనసాగుతుందన్నారు. వచ్చేనెల ఐదవ తేదీనుంచి ఎంఎన్‌రేగా పై ప్రచారం జరుగుతుందని ఖర్గే వెల్లడించారు. ఎంఎన్‌రేగా చట్టాన్ని ఎలాంటిపరిస్థితులు ఎదురైనా పరిరక్షించుకుంటామని, ఇది ఒక పథకం మాత్రమే కాదని, రాజ్యాంగం పనిహక్కులను ప్రసాదించిందని అన్నారు. అలాగే ఎంఎన్‌రేగాలో గాంధీజీ పేరును తొలగించడంపై ప్రజాస్వామ్య బద్ధంగానే తాము ఆందోళన చేస్తామన్నారు. ఎంఎన్‌రేగా రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉనాననరని, ఎన్డీయే సర్కారు అందుకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కేంద్ర కేబినెట్‌లోనిసంబంధిత మంత్రులను కూడా సంప్రదించకుండా ప్రధానిమోడీ ఎంఎన్‌రేగా చట్టాన్ని రద్దుచేసారని ఆరోపించారు. పనిహక్కు వ్యవస్థలకు ఇపుడువిఘాతం కలిగిస్తున్నారని ఈనిర్ణయాన్ని నేరుగా ప్రధానమంత్రి కార్యాల యమే తీసుకున్నదని తనకు చెప్పారని, కేబినెట్‌లో సంబంధిత మంత్రులను కూడా సంప్రదించలేదని తెలియవచ్చిందనానరు. సుపరిపాలన అనేది వన్‌మాన్‌షోగా మారిపోయిందని, నరేంద్రమోడీ ఇష్టానికి అనుగుణంగా అన్నీ ఏకపక్షంగానే అమలవుతున్నాయని విమర్శించారు. ఖర్గేజీ చెప్పినట్లుగా దేశవ్యాప్తంగా ఈచట్టం రద్దును ఉద్యమరూపంలో వ్యతిరేకిస్తామన్నారు. మొత్తం ప్రతిపక్షం ఇందుకు కలిసివస్తుందన్న ధీమా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఎలాంటిపరిస్థితులు ఎదురయినా మేం ఎంజిఎన్‌రేగా పథకాన్ని పరిరక్షించుకుంటామని ఆ పథకం యధావిధిగా కొనసాగాల్సిందేనని పేర్కొన్నారు. గ్రామీణులకు పనిహక్కును రాజ్యాం గపరంగా కల్పించిన చట్టం రద్దుచేయడం ఎంతమాత్రం అంగీకరించేదిలేదన్నారు. జనవరి ఐదునుంచి సేవ్ ఎంఎన్‌రేగా ప్రచారాన్ని ప్రారంభించేందుకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలని కోరారు.

# జిల్లాల పునర్విభజన

>> మండలాలుగా విభజించాలనే అభిప్రాయానికి వచ్చారు. మరోవైపు, అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మునగపాకను అనకాపల్లి డివిజన్‌లోనూ, అచ్యుతాపురంను అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటుకానున్న పోలవరం జిల్లాలో ఎటువంటి మార్పు చేయలేదు...ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా యథాతథంగా కొనసాగించాలని సీఎం సూచించారు.ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ఈ ప్రాంతాలు యథావిధిగానే.శ్రీకాకుళం జిల్లాలోని నందిగాం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చడం,అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌కు మార్చడం.కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌కు మార్చడం,అద్దంకి రెవెన్యూ డివిజన్‌లోని అద్దంకి, బల్లి కురవ, సంతమాగులూరు, జె. పంగులూరు, కొరిసపాడును ప్రకాశం జిల్లాలోకి మార్పు చేయడంతోపాటు రెవెన్యూ డివిజన్‌లోని మర్రి పూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు. **ప్రకాశం జిల్లాలో విలీనం** కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలను ప్రకాశం జిల్లాకు మార్చడంతో పాటు,కందుకూరు డివిజన్‌లోని మిగిలిన రెండు మండలాలను అయిన వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లోకి మార్పు. పల మనేరు డివిజన్‌లో బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు మార్పు చిత్తూరు జిల్లా పల మనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరును మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు మార్చడంచిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమలను మదనపల్లి జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పుశ్రీ సత్య సాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకదిరి రెవెన్యూ డివిజన్‌లోని అమడగురు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం.పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మార్పుచేర్పుల తర్వాత ఈ డిసెంబర్ 31న తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. సమీక్షా సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రాజధాని రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు..**

ఎన్ఆర్ రహదారి విషయమై నిన్న తుళ్లూరు మండలం, మందడంలో రైతులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న సమయంలోనే దొండపాటి రామారావు అనే రైతు ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయారు.అతన్ని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు.ఈ క్రమంలో శనివారం దొండపాటి రామారావు కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించిన సీఎం చంద్రబాబు పరామర్శించారు.వారికి ధైర్యం చెప్పారు.వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వాగ్దానం చేశారు.రామారావు కుటుంబానికి అండగా ఉండా లని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు సీఎం చంద్రబాబు సూచించారు.

# దుర్గగుడికి విద్యుత్ సరఫరా నిలిపివేత

## రూ.3.08 కోట్ల విద్యుత్తు బకాయిలు

### మంత్రి గొట్టిపాటి జోక్యంతో సమస్య పరిష్కారం



**విజయవాడ,డిసెంబరు 27.ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ దుర్గగుడికి విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.3.08 కోట్లుగా ఉన్నాయంటూ ఏపీసీపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. 2023 ఫిబ్రవరి నుంచి బిల్లులు చెల్లించలేదని విద్యుత్ శాఖ చెబుతుండగా, బకాయిలపై పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో హెచ్‌టీ లైన్ నుంచి విద్యుత్‌ను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యపై దేవస్థానం భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. అయితే భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సేవలకు అంతరాయం లేకుండా జనరేటర్ల సాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. అలాగే తమ సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను వినియోగిస్తున్నామని పేర్కొంటూ, నెట్ మీటరింగ్ కోసం విద్యుత్ శాఖను పలుమార్లు కోరినప్పటికీ సాంకేతిక కారణాలంటూ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఏపీసీపీడీసీఎల్ నమోదు చేయలేదని దేవస్థానం ఆరోపించింది. విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని నిన్న సాయంత్రమే దుర్గగుడి ఈవోకు సమాచారం ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎట్టకేలకు సోలార్‌ప్లాంట్ నుంచి ఉత్పత్తి అవుతోన్న విద్యుత్తును నున్నకు సమీపంలోని గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. దేవస్థానానికి సర్కిల్ 01 పరిధిలో ఒక హెచ్‌టీ , 10 ఎల్‌టీ సర్వీసులున్నాయి. ఈ సర్వీసుల ద్వారా విద్యుత్తు వినియోగిం చుకుం టున్నారు. ఈ సమస్యపై అధికారులు చర్చలు జరుపుతున్నారనీ, సాయంత్రంలోగా ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి తాజాగా ప్రకటన జారీ చేశారు. విజయవాడ దుర్గగుడికి విద్యుత్ సరఫరా నిలిపివేతపై మంత్రి గొట్టిపాటి తీవ్రంగా స్పందించారు. ఏపీసీపీడీసీఎల్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎలాంటి తొందరపాటు చర్యలు వద్దని అధికారులను ఆదేశించారు. భక్తుల మనోభావాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ బిల్లు బకాయిల సమస్యపై మాట్లాడి పరిష్కరించుకోవాలన్న మంత్రి సూచించారు. దాంతో సమస్య పరిష్కారమైంది,

# సత్వర అభివృద్ధి చర్యలు

>> యంత్రాల వినియోగాన్ని విస్తృతం చేయాలని, వ్యవసాయం శ్రీకాకుళం జిల్లాలో వృద్ధి చెందడం ద్వారా జిల్లా జీడీపీ పెరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేశారు. పొలంబడి కార్యక్రమం ప్రతి నియోజకవర్గంలో ఓ మండలం మోడల్ మండలంగా ఎంచుకుని రెండు వందల మంది రైతులతో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా పొలంబడి కార్యక్రమాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. వరి కోతల సమయంలో ఉపయుక్తంగా ఉండే డ్రైన్ల నిర్వహణపై కూడా ప్రత్యేకంగా సమీక్షించారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు వ్యవసాయ సంబంధ సమస్యలను ప్రస్తావించారు.ఉపాధిహామీ పథకంపై సమీక్షిస్తూ గ్రామాల వారీగా నివేదిక కావాలని రామ్మోహన్‌నాయుడు కోరారు. చెల్లింపు జరగాల్సిన బిల్లులపై కూడా అధికారుల వివరణ అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని, ప్రతి ఇంటికి కుళాయిని అందించే వరకూ అధికారులు అందరూ నిమగ్నమై ఉండాలని అన్నారు. ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ అనస్తీషియా వైద్యులు తక్కువగా అందుబాటులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎనీమియా రహిత జిల్లాగా శ్రీకాకుళంను తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖపై సమీక్షిస్తూ పీఎంశ్రీ పథకం జిల్లాలో అమలవుతున్న తీరును తెలుసుకున్నారు. పాఠశాలల వారీగా పీఎం శ్రీ పథకం అమలవుతున్న తీరును నివేదికల రూపంలో కావాలని కోరారు. అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. కేంద్ర నిధుల వినియోగంతో జిల్లాను అభివృద్ధి పథకంలో పయనింపజేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల నుంచి బయటకు తీసుకు రావడానికి ముఖ్యంత్రి చంద్రబాబునాయుడు విశేష పోరాటం చేసి ఇప్పుడు మళ్లీ పాలనను గాడిలో పెట్టారని కితాబు ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకూ తొమ్మిది జిల్లాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష ద్వారా జిల్లాలో వ్యవసాయ వృద్ధి, ఉపాధ్షిఅవకాశాల సృష్టిపై ప్రత్యేకంగా సమీక్షించినట్లు తెలిపారు. రవాణా అవకాశాలు వృద్ధి చేయడం ద్వారా జిల్లా అన్నిరంగాల్లో ఉన్నత స్థానాలను చేరుకుంటుందని స్పష్టం చేశారు. భోగా పురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్టుల ద్వారా ఉపాధి విప్లవం సృష్టిస్తున్నామని, దానికి తోడు నూతన జాతీయ రహదారి,కార్గో ఎయిర్‌పోర్ట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా కొత్త సిక్కోలును చూస్తామని స్పష్టం చేశారు.ఈసమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు గొండుశంకర్, బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వ ప్నిల్‌దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి,జిల్లాస్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆస్తుల వివరాలు ఇవ్వకుంటే కఠిన చర్యలు

## ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 31 డెడ్ లైన్

### ఐఏఎస్‌లకు కేంద్రం హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** తాము విధించిన గడువు లోపల ఆస్తుల వివరాలు సమర్పించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. లేకపోయినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. నిర్దేశిత గడువు లోపల తమ ఆస్తుల వివరాలు సమర్పించాల్సిన బాధ్యత నిర్వర్తించాలని, తమ ఆదేశాలను సకాలంలో అమలు చేయకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఐఏఎస్ అధికారులకు కేంద్రం నోటీసులు జారీ చేసింది. ప్రస్తుత 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించి తప్పనిసరిగా వచ్చే జనవరి నెలాఖరు లోపు ఐఏఎస్ అధికారులు స్పారో సాఫ్ట్‌వేర్ ద్వారా తమ ఆస్తి వివరాలను ఆన్‌లైన్ మాడ్యూల్లో అందించాలని పేర్కొంది. ఇందుకు గాను ఈ నెల 23 న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) విడుదల చేసిన సర్క్యులర్ పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం సమర్పించాలని సూచించింది. గడువు తర్వాత ఆన్లైన్ మాడ్యూల్ ఆటోమేటిక్‌గా మూసివేయ బడుతుందని తేల్చిచెప్పింది. కాగా ఐఏఎస్ అధికారులకు వారి స్థిర మరియు చరాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో అందించడానికి స్పారో అప్ పోర్టల్‌ను కేంద్రం రూపొందించింది. దీనికి సంబంధించి అన్ని రాష్ట్రాల ఐఏఎస్ అధికారులకు లాగిన్ మరియు పాస్‌వర్డ్ కూడా ఇవ్వబడింది. డిఒపిటి మార్గర్శకాల ప్రకారం రాష్ట్రాలోని అందరు ఐఏఎస్ అధికారులు ప్రతి సంవత్సరం జనవరి 1 మరియు 21 మధ్య వారి ఆస్తులకు సంబంధించిన లెక్కలు విధిగా ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకపోతే, శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయి. అలాగే ప్రతి ఐఏఎస్ అధికారి ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో గత ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్‌లో స్వీయ అంచనాను ఇవ్వాలి. ఆ విధంగా వివరాలు ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకునే హక్కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగానికి ఉంటుంది. అటు వంటి ఐఏఎస్ అధికారుల వార్షిక ఎంట్రీని నిలిపివేసే అవకాశాలు ఉన్నాయి. ఇది జరిగితే వారి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లను కూడా ప్రభావితం అవుతాయి.

# ఘోర ప్రమాదం.. ముగ్గురు యువకులు మృతి

**ఏలూరు జిల్లా ప్రతినిధి, డిసెంబరు 27:** ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడెం ఫ్లైఓవర్ వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, అతివేగంతో ప్రయాణిస్తున్న బైక్ నియంత్రణ కోల్పోయి ఫ్లైఓవర్‌పై ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మృతి చెందిన యువకులు ద్వారకా తిరుమల మరియు తిమ్మాపురం గ్రామాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

# కల్తీనెయ్యికేసులో సిట్ విచారణకు భూమన



**తిరుపతి,డిసెంబరు 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు కల్తీనెయ్యిసరఫరా చేసిన కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. గత రెండువారాలుగా స్తబ్దుగా ఉంటున్న సిబిఐ సిట్ అధికారులు శనివారం టిటిడి మాజీఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని సిట్‌కార్యాలయంకు పిలిపించుకుని సుమారు రెండు గ్నరగంటలపైగా పలు అంశాలపై విచారణ చేశారని తెలిసింది. 2023లో భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా రెండవసారి బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన వైవి సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా కొనసాగిన బోర్డులో సభ్యుడుగా కూడా ఉన్నారు. ఈ నేపధ్యంలో 2020-23మధ్యకాలం లో కల్తీనెయ్యి సరఫరా జరగడం, ఆ వివరాలు ఏమైనా తెలుసా?కల్తీనెయ్యి సరఫరా అయ్యిందని తెలిసినా ఎందుకు అడ్డుకోలేకపోయారు?దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది,అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారనేది తెలుస్తోంది. నెయ్యికొనుగోలు టెండర్లు, నాణ్యత పరిశీలన తదితర అంశాలపై సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు అప్పటి అధికారులే అంతా చూసుకోవడం జరిగిందనేది సమాధానంగా తెలిసింది. అంతేగాక తన హయాంలో కల్తీనెయ్యి అనేది రాలేదని,ఆపై నెయ్యిసరఫరాలో టెండర్లు అప్పటికే ఉన్నవాటినే కొనసాగించామనేది సమాచారం ఇచ్చారని తెలిసింది. సుదీర్ఘవిచారణఅనంతరంభూమన బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా ఇప్పటికే మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఢిల్లీహైకోర్టు కల్తీనెయ్యి బాగోతం కేసులో కోర్టును ఆశ్రయించడం, ఆధారా లులేని వార్తలు రాస్తే విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయవాది చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపధ్యంలో శనివారం కీలకమైన మరో నేత భూమననను విచారణ చేయడం మాత్రం ప్రత్యేకత.

# ఇక కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు

>> వచ్చాయి. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వాటినే ముద్రించారు. చనిపోయిన రైతుల పేర్లతోనూ పుస్తకాలు వచ్చాయి. ఫోన్, ఆధార్ నంబర్లతో పాటు రైతుల పేర్లు, తల్లిదండ్రులు, భర్త పేర్లలోనూ అక్షర దోషాలు ఉన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో అయితే పంపిణీ చేయాల్సిన మొత్తం పుస్తకాల్లో సగానికి పైగా తప్పులే ఉన్నట్లు ప్రజాప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్ళారు.ఆయన వెంటనే స్పందించి తప్పులు గుర్తించి సరిదిద్దాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వీటిపైనా అధికారులకు దిశానిర్దేశం చేసింది.లబ్ధిదారుల ఆధార్, ఇతర వివరాల్ని పరిశీలించి పుస్తకాల్లోని తప్పుల్ని అక్కడికక్కడే సరిదిద్దేలా తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చారు.. ఎల్‌పీ (ల్యాండ్ పార్సెల్), విస్తీర్ణం, చనిపోయిన పట్టాదారుల స్థానంలో వారసులకు పంపిణీకి సంబంధించిన ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చూడాలనని స్పష్టం చేసింది. గతంలో రెవెన్యూ రికార్డులను వెబ్‌ల్యాం డ్‌లోకి నమోదు చేసే సమయంలో రైతులకు ఒక పత్రం ఇచ్చారు. అందులో భూ యజమానుల పేర్లు, సర్వే నంబరు, సబ్ డివిజన్, విస్తీర్ణం, ఎలా సంక్రమించింది? భూ స్వభావం తదితర వివరాలు అన్నింటిని ముద్రించారు. తప్పులు ఉంటే సరిచేసి ఇవ్వాలని కోరారు. పత్రాలపై రైతుల సంతకాలు తీసుకున్నాకే వెబ్‌ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. అయితే అధికారుల వద్ద ఉన్న రీసర్వే రికార్డులు, సమాచారం ప్రకారమే పట్టాదారు పాస్‌పుస్తకాలు ముద్రించారు. అందుకే పెద్ద ఎత్తున తప్పులు దొర్లాయని అధికారులు అంటున్నారు.గ్రామసభల్లో ఎటువంటి తప్పులున్నా అక్కడిక్కడ సరిచేసి ఇస్తామని.ఇప్పటికే అనేక పాస్‌పుస్తకాలల్లో తప్పులను దిద్దామని వివరించారు.

## ఐదుగురు ఐఎఎస్‌లకు ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి

>> కొనసాగనున్నారు. గంధం చంద్రుడిని కార్మిక శాఖ కమిషనర్‌గా నియమిస్తూ, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.వి. శేషగిరి బాబును రిలీవ్ చేశారు. చదలవాడ నాగరాణి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా అదే పదవిలో కొనసాగనున్నారు. అవసరమైన చోట్ల పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్, క్యాడర్ సమానత్వానికి సంబంధించిన ఉత్తర్వులు వేరుగా జారీ చేస్తామని ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు.

## స్త్రీశక్తి బస్సుల్లో కండక్టర్లకు పవర్ బ్యాంకులు

>> రెండింటికీ కలిపి వినియోగిస్తూ బ్యాటరీ ఛార్జింగ్ త్వరగా అయిపోతోంది. దీంతో జీపీఎస్ ట్రాకింగ్ కూడా ఉండేలా చూసేందుకు 20 వేల ఎంఏహెచ్ సామర్థ్యంతో ఉన్న 17,880 పవర్ బ్యాంక్స్ కొని, కండక్టర్లకు అందచేయాలని నిర్ణ యించారు. గుంటూరు-1డిపోలో వీటిని ప్రయో గాత్మకంగా అమలు చేయగా,ఆ బ్యాటరీ బ్యాకప్ బాగున్నట్లు గుర్తించారు. దీంతో అన్ని డిపోల్లోని స్త్రీశక్తి పథకం అమలవుతున్న బస్సుల్లో కం డక్టర్లకు ఈ పవర్ బ్యాంకులు ఇవ్వనున్నారు.

### ప్రపంచ తెలుగు మహా సభలకు

## సిఎం చంద్రబాబు: గజల్ శ్రీనివాస్



**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 3 వ ప్రపంచ తెలుగు మహా సభలకు సీఎం చంద్ర బాబు హాజరవు తున్నారు. గుంటూరులో జనవరి నెల 3,4,5 తేదీల్లో శ్రీసత్యసాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో జరుగను న్నాయి.ఈ సభలో భాగంగా మూడవరోజు జనవరి 5వ తేదీ సా యంత్రం5 గంటలకు జరిగే సమాపనోత్సవానికి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నట్లు పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు తెలుగు మహా సభల ప్రత్యేక సంచిక ఆంధ్ర మేవ జయతే, అలాగే 3 వ ప్రపంచ తెలుగు మహా సభల పోస్టల్ కవర్‌ను నారా చంద్ర బాబు నాయుడు విడుదల చేస్తారని సమన్వయ కర్తలు పి. రామచంద్ర రాజు, వాసిరెడ్డి విద్యా సాగర్ లు తెలిపారు.

## అయోధ్యకు సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్27:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదివారం అయోధ్యలో పర్యటించ నున్నారు. శ్రీరామ జన్మభూమిలో కొలువుదీరిన బాలరాముడిని ఆయన దర్శించుకోనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ముఖ్యమంత్రి కార్యాలయం అధికారిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయ లుదేరి ఉదయం 11 గంటలకు అయోధ్య చేరు కుంటారు. అనంతరం నేరుగా శ్రీరామ జన్మ భూమి కాంప్లెక్స్‌కు వెళతారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు, ఆయన ఆలయ ప్రాంగణంలోనే గడపనున్నారు.

## వారం - వర్జ్యం

**28-12-2025, ఆదివారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**పుష్యమాసం, దక్షిణాయణం**
**హేమంత ఋతువు, శుక్లపక్షం**
అష్టమి ఉ.11.56, మూల కార్తె
ఉత్తరభాద్ర ఉ.8.41, రేవతి ఉ.7.41
వర్జ్యం : రా.8.11-9.42
దు.సా.4.11-4.56
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వస్తులాభం.సోదరుల కలయిక.

**వృషభం:** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.సభలలో పాల్గొంటారు.

**మిథునం:** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకొనే పనులు పూర్తిచేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**కర్కాటకం:** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. క్రమశిక్షణను పాటించడం వలన లాభపడతారు.

**సింహం:** మీలోని ప్రతిభా పాటవాలు వెలుగుచూసే దిశగా ప్రయాణం సాగిస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య:** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. జీవిత భగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**తుల :** విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఆరాధనలు, యాత్రలు సంభవము.

**వృశ్చికం:** దూరప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**ధనుస్సు:** మాటపట్టింపులతో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసు కుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం:** ముఖ్యకార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. వస్త్రాలాభం.

**కుంభం:** సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. స్వల్పధన లాభం. వాహన సౌలభ్యం.

**మీనం:** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమా చారం తెలుసుకుంటారు. రాజకీయ పరపతి పెరుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ముగ్గురు పట్టణ ప్రణాళికాధికారుల సస్పెన్షన్ కొనసాగింపు

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** గాజువాక ఎంఎల్ఏ పల్లా శ్రీనివాసరావుకు చెందిన వాణిజ్య సముదాయ భవనాన్ని అక్రమంగా కూల్చివేసిన ఘటనలో ముగ్గురు పట్టణ ప్రణాళిక అధికారలు సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టౌన్ సర్వే నెంబరు 5/1,5/3లో నిర్మాణంలో భవనాన్ని నిబంధనలకు విరుద్దంగా,సంబంధిత పోర్టల్‌లో నోటీసు కూడా పెట్టకుండా 2021 ఏప్రిల్ 25న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధ్వర్యంలో కూల్చివేశారు. ఎంఎల్ఏ ఫిర్యాదుపై విచారణ చేయించిన ప్రభుత్వం జీవీఎంసీ జోన్-6, డిప్యూటీ సిటీ ప్లానర్ (డిసీపీ),టి.నరేంద్రరెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) ఎస్.వరప్రసాద్,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) ఎస్.వినయ్‌ప్రసాద్‌ని ఇప్పటికే సస్పెండ్ చేసింది. దీనిపై తాజాగా సమీక్షించిన ప్రభుత్వం ముగ్గురు అధికారుల సస్పెన్షన్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రాజకీయాలు అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు

### - హోం మంత్రి అనిత



**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కల్గించేందుకు వైకాపా నేతలు ఎంతకైనా దిగజారుతున్నారని మంత్రి అనిత విమర్శించారు. జంతు బలులు చేసి...ఉన్మాదుల్లా తయారవుతున్నారని మండిపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి చేయడం నేరమని, వచ్చే ఎన్నికల్లో మేం గెలిస్తే మీ పరిస్థితి ఇదేంటూ నినాదాలు ఇవ్వడం దారుణమని అన్నారు. వైకాపా శ్రేణులు ఏం చేసినా ఆ పార్టీ నాయకుడు నోరు తెరచి తప్పని చెప్పడం లేదన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.'రాజకీయాలను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు. జగన్ ప్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా? రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కల్గించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లల్ని కూడా సైకోలు,ఉన్మాదుల్లా తయారుచేస్తున్నారు. టీనేజ్ పిల్లల జివితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిద ండ్రులు ఆలోచించాలి.ఆస్థి గురించి సొంత తల్లి,చెల్లిలిపై కేసులు పెట్టిన వారు మీ పిల్లల్ని రక్షిస్తారా? పిల్లలు రోడ్డుపైకి వచ్చి... నరుకుతాం.... చంపుతాం అంటు న్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని జగన్ చెప్పలేదా? వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా' అని అనిత మండిపడ్డారు.

### విజయవాడలో విషాదం.. వృద్దుడి ప్రాణాలు తీసిన చపాతీ ముక్క

**విజయవాడ, డిసెంబర్ 27:** చపాతీ ముక్క వృద్దుడి ప్రాణాలు తీసింది...ఈ ఘటన విజయవాడ చిట్టినగర్‌లో జరిగింది. కెఎల్‌రావు నగర్‌కు చెందిన తోట ప్రసాద్ రోజు మాదిరిగా శుక్రవారం సాయంత్రం చపాతీ తినేందుకు రెడీ అయ్యారు. అయితే తినడం ప్రారంభించిన కొద్దిసేపటికే చిన్న చపాతీ ముక్క గొంతులో ఇరుక్కుంది. బయటకు తీసేందుకు ప్రసాద్ చాలా ప్రయత్నం చేశారు. ఇంతలో ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిందపడిపోయి గిలగిలా కొట్టుకుంటున్నారు. కుటుంబ సభ్యులు గమనించి నీళ్ళు తాగించారు. అయితే ఫలితం లేకపోవడంతో వెంటనే 108ని పిలిపించి ఆస్పత్రికి తరలించారు. ఈలోపే వృద్దుడు తోట ప్రసాద్ మృతి చెందారు.వైద్యులు పరీక్షించి ప్రసాద్ చనిపోయారని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

## గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి నిర్ణయం వాయిదా

### : మంత్రి నారాయణ

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాత వార్తప్రతి నిధి:**గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టింది. విజయవాడ,తిరుపతికి గ్రేటర్ హోదాకు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. జనగణన పూర్తయ్యే వరకు డీ లిమిటేషన్ చేయకూడదని కేంద్రం ఆదేశాలున్నాయని, అందుకే ఈ ప్రక్రియను వాయిదా వేయాలన నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. 'జనగణనకు ముందు విలీనానికి ఇబ్బందులు ఉన్నాయని సిఎం చంద్రబాబు చెప్పారు. జన గణన పూర్తయిన తర్వాతే గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనపై నిర్ణయం ఉంటుంది' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని మంత్రి నారాయణ తెలిపారు. రెండు నగరాలకు మహర్దశ ఉందన్నారు.విజయవాడ నగరాన్ని అద్భుతనగరంగా తీర్చిదిద్దేదిశలో ఇప్పటికే ఎన్నో నిధులు కేటాయింపుతో పాటు. పర్యాటక హంగులు కల్పించామన్నారు.

## మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత అవసరం

### - రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ



మీడియా సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ

**విజయవాడ డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత అవసరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. రాజకీయ పార్టీలు, వృత్తి పరమైన సంస్థలలో "పోష్ చట్టం" అమలు అవసరం అనే అంశంపై మహిళా కమిషన్ కార్యాలయంలో న్యాయవాదుల సౌజన్యంతో అభిప్రాయ వ్యక్తీకరణ జరిగింది. అనంతరం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ మాట్లాడుతూ సుప్రీమ్ కోర్టు పని ప్రదేశాల్లో మహిళల రక్షణ, భద్రతపై అనేక తీర్పులు వెలువరించిందన్నారు. చట్టం అమలులో ఇంకా పూర్తి స్థాయి శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అన్నారు. పని ప్రదేశంలో రక్షణ లేదనే భావన ఇప్పటికీ ఉందని, ఇది రాజకీయ పార్టీలలోనూ, బార్ అసోసియేషన్ లలోను, విద్యా సంస్థలు తదితర అన్ని ప్రదేశాల్లో అమలు జరగాలని చర్చించడం జరిగిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. అసంఘటిత రంగంలో పరిస్థితులు కూడా అంచనా వేయవచ్చన్నారు. చట్టాలను ఒక్కొక్కరు ఒక్కో విధంగా విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, అయినా కేసులు తక్కువ నమోదు అవుతున్నాయని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, బార్ అసోసియేషన్ లు కూడా వర్క్ ప్లేస్ గా వస్తుందని చెప్పారు. లైంగిక వేధింపులు పెరగటం, మహిళల రక్షణ, భద్రత అంశాలపై ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలలో పోష్ చట్టం అమలుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. విద్యా సంస్థలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్, విద్యార్థుల ఆత్మహత్యలు వంటి వాటి పట్ల ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళమని, విద్యా సంస్కరణలను ప్రభుత్వం చేపట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో బాగా జరుగుతుందని అన్నారు. చిన్నతనం నుండే సరైన ఆలోచన కల్పించడం వలన లైంగిక వేధింపులు వంటి సమస్యలు ఉత్పన్నం కావని అభిప్రాయపడ్డారు. సామాజిక కళంకం కలుగుతుందనే ఆలోచనతో బయటకు చెప్పకుండా ఉండటం కూడా జరుగుతుందని చెప్పారు. కుటుంబాల్లో ఆలోచన విధానం మరాలన్నారు. సీనియర్ న్యాయవాది రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణకు సుప్రీం కోర్టు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. మహిళా చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయనే నెపంతో ఆ చట్టాలను నిర్వీర్యం చేయకూడదన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా చట్టాలను మార్పు చేసి అమలు చేయాలని అన్నారు. పని ప్రదేశం నిర్వచనం విస్తృతం చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, క్యాంటీన్, బార్ అసోసియేషన్ లు, డిజిటల్ ప్లాట్ ఫామ్ లు తదితర అన్ని ప్రదేశాలు పని ప్రదేశంగా ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీలు, బార్ అసోసియేషన్ లు ప్రజల కంటే దూర దృష్టి కలిగి ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికే పాటిస్తున్నాయని పేర్కొన్నారు. 20 శాతం మహిళలు న్యాయ వ్యవస్థ లో ఉన్నారని, క్రింద స్థాయి కోర్టులలో 50 శాతం వరకు ఉన్నారని తెలిపారు. పని ప్రదేశంలో మహిళలకు రక్షణపై విశ్వాసం కలిగించాలన్నారు. "చదువుకున్న వారమే, విజ్ఞాన వంతులమే" అయినా ఎందుకు వేధింపులు జరుగుతున్నాయి.

## మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసిన అయేషా మీరా తల్లిదండ్రులు

### - తమ కుమార్తె పేరుతో విద్యాసంస్థ, ట్రస్టు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిది** అయేషా మీరా హత్య కేసులో ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అయేషా మీరా తల్లిదండ్రులు శంషాద్ బేగం, బాషా మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2007 డిసెంబర్ 27న 19 సంవత్సరాల బీ.ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా అత్యంత దారుణంగా హత్యకు గురైంది. ఈ ఘటన జరిగి నేటికి 18 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు అసలు నేరస్తులకు శిక్ష పడకపోవడం బాధాకరమని వారు తెలిపారు. సీబీఐ నివేదిక ప్రకారం కీలక సాక్షాలను ధ్వంసం చేసి, తప్పుడు దర్యాప్తు ద్వారా అమాయకుడైన పిడతల సత్యం బాబును కేసులో ఇరికించారని పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన అనంతరం సత్యం బాబు నిర్దోషిగా విడుదలై, సత్యమేవ జయతే అని లోకానికి చాటిచెప్పారని గుర్తు చేశారు. అయితే అమాయకుడు విడుదల కావడం సరిపోదని, అసలు నేరస్తులకు కఠిన శిక్ష పడాలని మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, అయేషా మీరా తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ న్యాయపోరాటం ఫలితంగా 2018లో ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు ప్రారంభమైందన్నారు. సీబీఐ దర్యాప్తులో రాజకీయ నాయకుల కుటుంబాలకు సంబంధించిన కీలక సాక్షాలు మాయం చేసినట్టు వెలుగులోకి వచ్చిందని, నేరస్తులను కాపాడేందుకు కొందరు అధికారులు ప్రయత్నించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే 2025 జూన్ 25న హైకోర్టులో సీబీఐ సమర్పించిన సీల్డ్ కవర్ నివేదిక తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపారు. అప్పటి నుంచి న్యాయం కోసం ఎదురుచూస్తున్న తమకు ఇది తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. అయేషా మీరా హత్య జరిగిన సమయంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నారని, ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ అయేషా మీరా తల్లిదండ్రులకు అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా సభలు, ధర్నాలు, నిరసనలు నిర్వహించిందని గుర్తు చేశారు. అయేషా మీరా చనిపోయిన రోజును స్మరణ దినంగా ప్రకటించాలని, ఆమె పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొని అయేషా మీరా కుటుంబానికి మద్దతు ప్రకటించాయి.

# భారీగా ప్రచార ఆర్భాటం!

### - తొలి మూడురోజులు తిరుమలలో భక్తుల్ని కట్టడి చేస్తాయా?

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** యేడాదికి ఆఖరు రోజులు...కొత్తసంవత్సరంలో కలియుగ వైకుంఠ వాసుడి దివ్యమంగళస్వరూపాన్ని దర్శనం చేసుకుంటే అంతా శుభాలు కలుగుతాయనే ప్రగాఢ విశ్వాసం,దానికంటే ముందే డిసెంబర్ 30 వైకుంఠ ఏకాదశి, 31 వైకుంఠద్వాదశి ఘడియల్లో వైకుంఠవాకిలి ప్రవేశంతో మోక్షం కలుగుతుందనే భక్తకోటి ఆశలు. వైకుంఠద్వార దర్శనాలకు ముందుగానే మూడురోజులకు ఆన్‌లైన్‌లో జారీచేసిన 1.76లక్షలు టోకెన్లు అందుకున్న భక్తులకు మాత్రమే ఆలయం లోపలకు అనుమతినిస్తామని, లేకుంటే కొండపై ఉండవచ్చునేది టిటిడి వర్గాలు హోరెత్తిస్తున్న ప్రచారం. ఈ ప్రచారానికే లక్షలాదిరూపాయలు మంచినీళ్ళలా వ్యయం చేసేశారు. భారీ ఎత్తున ప్రచార ఆర్భాటాలు జోరుగా చేపట్టిన టిటిడి పాలకమండలి, అధికారులు ఎంతవరకు భక్తుల్ని చైతన్యంచేసి తిరుమలపైకి చేరుకుంటే కట్టడిచేయగలరనేది వీడని అంతర్మథనం భయం. పైగా తిరుమలేశుని ఆలయంలో పవిత్రమైన వైకుంఠవాకిలి దర్శనాలకు గోవిందమాలలు ధరించిన భక్తులతోబాటు తమిళనాడు,కర్నాటక, తెలుగురాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతి ఏడాది రావడం పరిపాటి. 2021 సంవత్సరం వరకు కేవలం రెండురోజులు వైకుంఠవాకిలి తెరచి ఉంచి దర్శనాలు చేయించే సందర్భంలోనే లక్షలసంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుంటే ఔటర్‌రింగురోడ్డునుండి నారాయణగిరి ఉద్యావనాల షెడ్డుల మీదుగా వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా 1.70లక్షల మంది వరకు భక్తులకు ప్రశాంతంగా, ప్రణాళికా బద్దంగా మోక్షమార్గం దర్శనం చేయించేవారు. అదీ పూర్తిగా ఆ 48గంటలు టిటిడి అధికార గణం, జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తే సకల సదుపాయాలతో చిన్నపాటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేసేవారు. గత నాలుగేళ్ళ తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేసిన అప్పటి టిటిడి పాలకమండలి, అధికారులు ఏరోజుకారోజు దర్శన టోకెన్లు ఉన్న భక్తులనే తిరుమలకు అనుమతించారు. పైగా టోకెన్‌లేని భక్తులను తిరుపతి అలిపిరి వద్ద కట్టడిచేయగలిగారు. అయితే ఈ ఏడాది జనవరిలో వైకుంఠవాకిలి దర్శనాలు చేయించేందుకు అదే విధానం అమలుచేసి చివరకు అటు టిటిడి వర్గాలు, ఇటు పోలీసువర్గాల క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడటంతో పెద్ద తప్పిదాలతో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలిసిందే. ప్రస్తుతం పదిరోజుల వైకుంఠద్వార దర్శనం విధానం అమలుచేస్తుండటంతో భక్తులను కొండకు రమ్మని పిలుస్తున్నా ,అత్యంతపవిత్రమైన తొలిమూడురోజులు 30,31,జనవరి 1 మాత్రం ఆన్‌లైన్‌లో టోకెన్లు ఉన్న వారికి మాత్రమే ఆలయంలోనికి ప్రవేశం కల్పిస్తామని టిటిడి ప్రకటనలు సామాన్యభక్తుల్లో, మరీ ముఖ్యంగా స్థానిక భక్తుల్లో ఒకింత ఆశ్చర్యపరుస్తోంది. పైగా చేసిన అభిప్రాయ బేధాల పొరబాట్లకు వెరసి ఒకింత పెద్ద ఎత్తున లక్షలాదిరూపాయలు ఖర్చుచేసి అవగాహన లేని ప్రచార ఆర్భాటంతో టిటిడి వర్గాలుచేతులుదులుపుకునే ప్రయత్నం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికే తిరుమలలో భక్తజనసంద్రం కొనసాగుతోంది. పైగా ఈ రద్దీ నెలాఖరు వరకు ఇలానే ఉంటుందనేది టిటిడి ఉద్యోగుల వాదన.




ఇ డిప్ టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం అని జోరుగా ఫ్లెక్సీలు, ఆటోలకు పోస్టర్లు అంటించిన టిటిడి



విజయవాడలో మీడియా సమావేశంలో మాట్లాడిన జగ్గారెడ్డి

## రాష్ట్ర విభజన వద్దని చెప్పాను : జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన దురదృష్టకరమని కాంగ్రెస్ సీనియర్ నేత,పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన జగ్గారెడ్డి...తాను రాష్ట్ర విభజనను వ్యతిరేకించినట్లు పేర్కొన్నారు. అప్పుడు రాష్ట్ర విభజనకు చంద్రబాబు, జగన్ కూడ అనుకూల లేఖలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడుతూ...సిఎం చంద్రబాబునాయుడు, మాజీ సిఎం జగన్,పవన్ కళ్యాణ్ ప్రతి ఒక్కరూ ప్రధాని మోడీ ఆడమన్నట్లు ఆడుతున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని మరోసారి గుర్తు చేశారు జగ్గారెడ్డి, పార్లమెంటులో మాకు 20 మంది ఎంపీలను ఇస్తే..స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ ,టీజీ రాష్ట్రాలు కీలకంశాల్లో ఏకీభవంతో వ్యవహరించాలని,ఉభయ రాష్ట్రాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టుకోవాలన్నారు.

## గిరిజనుల కోసం అన్ని ఐటిడిఎలకు ట్రైకార్ ద్వారా రూ.13.70 కోట్లు విడుదల: మంత్రి సంధ్యారాణి



**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:..**గిరిజన రైతుల కోసం అన్ని ఐటిడీఏలకు ట్రైకార్ ద్వారా రూ.13.70 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు.ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేసారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.తాజాగా మరల ఐటిడీఏ ద్వారా 90 సబ్సిడీ తో పరికరాలు మంజూరుచేసారన్నారు. గత జగన్ ప్రభుత్వం ట్రైకార్ రుణాలు ఆపి గిరిజనులకు అన్యాయం చేసిందన్నారు. గిరిజన కుటుంబాల జీవనోపాధి బలోపేతం కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాల అమలు చేస్తున్నామన్నారు.,.లబ్ధిదారులకు వ్యవసాయ జీవనోపాధి పరికరాల పంపిణీ ద్వారా రైతులకు మేల జరుగుతున్నారు. గిరిజన రైతులకు అందజేత రైతుల శ్రమ తగ్గించి ఉత్పాదకత పెంచేందుకు .ట్రాక్టర్లు మినీ ట్రాక్టర్ల.. మంజూరు చేస్తున్నామన్నారు. గిరిజనుల ఉత్పత్తులు మార్కెట్‌కి సులభంగా చేరేందుకు రవాణా కోసం ట్రక్కులు.అందజేస్తున్నామన్నారు. పంటలు మరియు నిల్వ సామగ్రి రక్షణ కోసం టారపాలిన్‌లు పంపిణీ జరుగుతుందన్నారు. వ్యవసాయ పనులు వేగంగా సాగేందుకు .ఆయిల్ ఇంజిన్లు మంజూరు చేసామన్నారు. గిరిజన కుటుంబాల అదనపు ఆదాయం కోసం పెద్ద ఎత్తున ..గోకులాలు.. మంజూరు చేసినట్లు తెలిపారు.

## కైలాసగిరి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన ఇఒ

### శివరాత్రి లోపు పూర్తి చేయాలంటూ ఆదేశాలు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలంటే అభివృద్ధి పనులు పరుగులు తీస్తాయి. యుద్ధ ప్రాతిపదికపై పనులు సాగుతాయి. గత ఏడాది శివరాత్రి సందర్భంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి అమలు చేసారు.

కాగా కొన్ని పెద్ద పనులు వివిధ కారణాలతో జాప్యం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఈ పనులకు సంబంధించి ఆలయ ఇఒ బాపిరెడ్డితో సమీక్షించారు. శివరాత్రి వస్తుంది కాబట్టి పనులు సత్వరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దాంతో ఇఒ ఇంజనీరింగ్ అధికారులను పరుగులు తీయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన పలుప నులను పరిశీలించారు.

# తిరుమల సమాచారం

## 'వైకుంఠ' వాకిలి దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు

### - నేటి నుండి ఎస్ఎస్‌డి టోకెన్లు రద్దు
### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,డిసెంబర్ 27 ప్రభాతవార్తప్రతినిధి:** మరో 48 గంటల్లో తిరుమల ఆలయంలో ప్రారంభం కానున్న పదిరోజుల వైకుంఠ వాకిలి దర్శనాలకు విచ్చేసే భక్తలకు విస్తృత ఏర్పాట్లుచేపట్టినట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో తాగునీటికొళాయిలు, నీళ్ళడ్రమ్ములు, అన్నప్రసాదం పంపిణీకి మొబైల్‌వ్యాన్ల సౌకర్యాలు కల్పించామన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వైకుంఠద్వార దర్శనాలకు తరలివచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాలు, ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం అన్ని విభాగాల అధికారులు ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఇఇ శ్రీనివాసులు, డిఇ చంద్రశేఖర్, ఐటి డిప్యూటీ జిఎం వెంకటేశ్వర్లునాయుడు,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి శిలాతోరణం వద్దనుండి వైకుంఠమ్ 2 వరకు క్యూలైన్లను తనిఖీ చేశారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టామన్నారు. క్యూలైన్లకు అనుసంధానంగా అదనపుమరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. భక్తుల కోసం టిటిడి అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించుకునేందుకు వీలుగా వివిధ భాషల్లో సూచికబోర్డులను కూడా క్యూలైన్లలో,ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. కాగా నేటి నుండి జనవరి 7వతేదీ వరకు ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు రద్దు చేశామన్నారు. భక్తులు టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇ డిప్ టోకెన్ పొందిన భక్తులు నిర్దేశిత సమయం ప్రకారం,ఆరోజుల్లోనే ,ఆయా ప్రాంతాల్లో క్యూలైన్ వద్దకు రావాలని ,క్యూలైన్‌ద్వారా వైకుంఠద్వార దర్శనం పొందడానికి ప్రణాళికను రూపొందించుకోవాలని కోరారు.

## అంతా మంచి జరగాలని వేడుకున్నా

### శ్రీవారి దర్శనంలో మాజీ గవర్నర్ నరసింహన్



**తిరుమల,డిసెంబర్ 27పభాత వార్తప్రతి నిధి:** అదే భక్తిభావం...భగవంతునిపై తదేక ధ్యాస వెరసి సాంప్రదాయ దుస్తుల్లో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని మాజీ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ దంపతులు దర్శించుకున్నారు. ధనుర్మాసంలో ,నూతన ఆంగ్లసంవత్సరం ఆరంభానికి ముందు తిరుమలకు రావడం, స్వామివారిని దర్శించుకోవడం శుభకరమని, అంతా మంచిజరగాలని ఆకాంక్షించినట్లు నరసింహన్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం స్వామివారి నైవేద్యవిరామసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు.తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కు ు తీర్చుకున్నారు. ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అది కారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో ఏర్పాట్లు, దర్శన సౌకర్యం బావుందన్నారు.

## భగవంతుని ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 27పభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో శనివారం కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం కేంద్ర మంత్రి కృష్ణపాల్‌గురుజార్, డిఆర్‌డిఎ మాజీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి, క్రికెటర్ కిరణ్‌శర్మ, సినీనటుడు ఆకాశ్‌దాస్‌నాయక్‌లు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అదనపు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్వచ్ఛంద పరిశుభ్రతకు కోల్‌కతా ఐటిసి సిబ్బంది



**తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకొండను మరింత స్వచ్ఛతగా పరిశుభ్రంగా ఉంచడంలో తమవంతుగా స్వచ్ఛందంగా సేవచేసేందుకు కోల్‌కత్తా ఐటిసి కార్పొరేషన్ సిబ్బంది తిరుమలకు వచ్చారు. వందమంది కార్మికులు తిరుమలలో ఆలయం ముందు, మాఢ వీధులు, వైకుంఠం క్యూలైన్లలో స్వచ్ఛందంగా శుభ్రత చేస్తున్నారు.తిరుమల పరిశుభ్రతకు మారుపేరు. మరీ ఈ వందమంది సిబ్బందితో టిటిడికి సేవలందించి మరింత శుభ్రతను పాటించేలా, వైకుంఠ ద్వారదర్శనాల సమయంలో ఈ అదనపు సిబ్బంది సేవలు మరింతగా ఉపయోగకరంగా మారాయి.

## ఎర్రచందనం స్మగ్లర్ల మూలాలు కదిలించాం

### - 52మంది పరారీ స్మగ్లర్లనుపట్టుకున్నాం -1,872 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు



**తిరుపతి,డిసెంబర్ 27ప్రభాత వార్తప్రతినిధి:** శేషాచలం అడవుల నుండి జాతీయ సంపద ఎర్రచందనం అక్రమరవాణా జరగకుండా పటిష్టవ్యూహంతో... పోలీసు,టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ సిబ్బంది సమిష్టి కృషి అద్భుత ఫలితాలనిచ్చిందని తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడే స్మగ్లర్ల మూలాలను కదిలించామని, పరారీలో ఉన్న 52మంది స్మగ్లర్లను పట్టుకోగలిగామని వెల్లడించారు. పటిష్టమైన నిఘాతో పలురకాలుగా కేసుల్లో, అక్రమంగా రవాణా చేస్తూ 1,872 ఎర్రచందనం దుంగలు, 35,476 కిలోల బరువున్నవి సీజ్‌చేయడం జరిగిందన్నారు. శనివారం తిరుపతి కపిలతీర్థంలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆ విభాగం ఎస్పీ శ్రీనివాసులు,అదనపు ఎస్పీ కులశేఖర్, సిసిఎఫ్ ఎస్.శెల్వం, డిఎఫ్ఒ వి.సాయిబాబా, ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఒ రామకొండారెడ్డి, ఆర్ఎస్ఎఎస్‌టిఎఫ్ జె.కులశేఖర్, డిఎస్పీ వి.శ్రీనివాసరెడ్డి, షరీఫ్, ఎసిఎఫ్ శ్రీనివాస్‌తో కలసి ఎర్రచందనం అక్రమరవాణాకు తీసుకున్న చర్యలు గురించి వివరించారు. ఏడాది వార్షిక ప్రణాళికను వివరించారు. 2025లో ఎర్రచందనం పరిరక్షణ, సమర్థవంతమైన అమలు చర్యలు,అన్ని శాఖల మధ్య అంతర్‌రాష్ట్ర సమన్వయం,బలమైన గూఢాచారి వ్యవస్థ కఠిన న్యాయ అనుసరణ ద్వారా ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకోగలిగామన్నారు. రికార్డుస్థాయిలో సీజ్‌లు,అరెస్ట్‌లు,వారెంట్ల అమలు,అత్యధిక శిక్షలు, పిడి యాక్టు నమోదు చేయడం జరిగిందన్నారు. 2025లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. కర్నాటకప్రాంతాల్లో భారీగా పట్టుబడిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంలో టాస్క్‌ఫోర్స్ అద్భుతమైన ప్రతిభ చూపిందని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు, ఆశయాల మేరకు శేషాచలంలో పూర్తిస్థాయిలో ఎర్రచందనం పరిరక్షణకు మరింతగా అంకితభావంతో పనితీరుసాగిస్తామని చెప్పారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు, దేశ వ్యాప్తంగా రబీ సీజను ముమ్మరంగా సాగుతోంది. ప్రస్తుత యాసంగి సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 68.67 లక్షలఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయనున్నారు. ఈ సీజనులో వరి 51.48 లక్షల ఎకరాల్లో వేస్తారని అంచనా. ఇందుకుగాను కేంద్రం 20.10 లక్షల టన్నుల ఎరువులు రాష్ట్రానికి కేటాయించింది. ఇందులో 10.25లక్షల టన్నుల యూరియా, 1.45 లక్షల టన్నుల డిఎపి, 7 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 65 వేల టన్నుల ఎమ్ఒపి, 60వేల టన్నుల ఎస్ఎస్పి ఎరువులు ఉన్నాయి. ఇక సకాలంలో పంటలకు సరిపడ ఎరువులను సరఫరా చేయడం కేంద్రానికి భారంగా మారింది. పంటఅధికంగా దిగుబడి రావాలని ఎకరానికి రెండు బస్తాలు వినియోగించాల్సి ఉంటే నాలుగు బస్తాలు చల్లుతున్నారు. దీంతో వ్యవసాయ శాఖ భావించి నేరుగా బస్తాలు పంపిణీ చేయకుండా యాప్ ద్వారా బస్తాలు బుకింగ్ చేసుకుంటే ఇస్తామనే విధానం తీసుకొచ్చింది. అదే విధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఒప్పందాల్లో భాగంగా దేశవ్యాప్తంగా రానున్న నాలుగైదు ఏళ్లలో యూరియా వాడకం తగ్గిస్తామని ఒప్పందం చేసుకుంది. దీంతో ఆయా రాష్ట్రాలు దశలవారీగా యూరియా వినియోగం తగ్గేలా ప్రయత్నాలు మొదలు పెట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని ఆదిలాబాద్, జనగామ, మహబూబ్‌నగర్, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వ్యవసాయ శాఖ యాప్ విధానాన్ని అమలు చేస్తోంది. అయితే నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేనివారు, అవగాహన లేని పలువురు రైతులు యూరియా యాప్ తెలియక తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. యూరియా కోసం కొందరు స్మార్ట్ ఫోన్ కొంటున్నా, దాన్ని వినియోగించే సాంకేతిక పరిజ్ఞానం రెతులకు ఉండటం లేదు. ఒటిపి విధానంతో ఎక్కడ అక్రమాలు జరుగుతాయనేది సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

# రబీలోనూ యూరియా కష్టాలు!

**సిహెచ్ వి వి రఘుబాబు**

ప్రస్తుత రబీ (యాసంగి) పంటలు సాగు చేస్తున్న రైతులకు మళ్లీ యూరియా కష్టాలు మొదలయ్యాయి. కేంద్రం సకాలంలో, సరిపడా సరఫరా చేయకపోవడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా లోపం, డిమాండ్ ఉన్న జిల్లాలకు కాకుండా, అవసరం లేని జిల్లాలకు సరఫరా చేయడం, అవసరం లేని రాష్ట్రాలకు కేటాయించిన యూరియా తదితర ఎరువుల విషయంలో కేంద్రంపై వత్తిడి తెచ్చి తెలంగాణకు తెప్పించుకోవడంలో కార్యాచరణ లేకపోవడం వంటి కారణాలతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. దీనికి తోడు రాష్ట్రానికి వచ్చిన తర్వాత జిల్లాల అవసరాలను బట్టి పంపించే బాధ్యత వ్యవసాయ శాఖపైఉంది. అలా కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు బలాన్ని బట్టి తరలిస్తున్నారు. ఖరీఫ్ (వానాకాలం) పంటలు సాగు చేసిన రైతులకు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు యాసంగిలోనూ అవే పరిస్థితులు పునరావృతం అవుతున్నాయి. ఈ రబీ సీజన్‌లో 10.25 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని ఇండెంట్ ఇచ్చింది. ఇప్పటివరకు 5 లక్షల మెట్రిక్ టన్నులు కూడా సరఫరా కాలేదు. రాష్ట్రానికి కేటాయించిన 10.40 లక్షల టన్నుల యూరియాలో 6 లక్షల టన్నులను అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్ర సర్కార్ కోరింది. కాని కేంద్రం మాత్రం కేటాయింపులకు అనుగుణంగా సరఫరా చేయడం లేదు. ఇటీవల వరకూ1.88 లక్షల టన్నుల యూరియా సరఫరా అయింది. అయితే యూరియా విషయంలో కేంద్రంపై వత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపడం లేదనే అభిప్రాయం రైతుల్లో ఉంది. ఇదే సమయంలో యూరియా వినియోగం రాష్ట్రంలో వ్యవసాయేతర వాటికి కూడా మళ్లిస్తున్నారు. ప్రధానంగా పారిశ్రామిక అవసరాలు డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డిఇఎఫ్)ప్లాయ్వుడ్, పార్టికల్ బోర్డ్ వంటి వాటి తయారీలో యూరియా ముడి పదార్థంగా వాడడంతో దీనికి డిమాండ్ పెరుగుతోంది. అలాగే నల్లబజారు, అధిక ధరలు కూడా ఒక కారణం. సబ్సిడీ ధరల కంటే ఎక్కువకు అమ్మడానికి కొందరు డీలర్లు, సిండికేట్లు యూరియాను అక్రమంగా నిల్వ చేసి, పక్క రాష్ట్రాలకు లేదా పరిశ్రమలకు మళ్లిస్తున్నారు. దీనివల్ల రాష్ట్రంలో పంటలు పండిస్తున్న రైతులకు కొరత ఏర్పడుతుంది. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో యూరియా వినియోగం అంతంత మాత్రంగానే ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుంటే యూరియా వినియోగంలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. ఖరీఫ్‌లో యూరియా, డిఏపి,



ఎంఒపి, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పిని అత్యధికంగా కర్ణాటక 26.75 లక్షల టన్నులు వినియోగిస్తుండగా, అందులో ఒక్కయూరియా 11.17 లక్షల టన్నులు ఉంది. కర్ణాటక తర్వాత రెండో స్థానంలో ఉన్న తెలంగాణలో ఒక సీజన్‌లో మొత్తం 23.75 లక్షల టన్నుల ఎరువులు వినియోగిస్తుండగా, అందులో 9.80లక్షల టన్నులు యూరియా ఉంది. అదే కేరళలో వినియోగించే యూరియా కేవలం 52 వేల టన్నులు మాత్రమే. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 6.22 లక్షల టన్నులు, తమిళనాడులో 4.37లక్షల టన్నులు, పాండిచ్చేరిలో 6 వేల టన్నుల యూరియా వినియోగిస్తున్నారు. ఇలా దేశంలో సౌత్ జోన్‌లో 32.15 లక్షల టన్నులు, వెస్ట్‌లో 61.71 లక్షల టన్నులు, నార్త్‌లో 67.13 లక్షల టన్నులు, ఈస్ట్‌లో 22.42 లక్షల టన్నులు, నార్త్‌ఈస్ట్ జోన్‌లో 1.98 లక్షల టన్నుల యూరియా వినియోగం జరుగుతోంది. ఎరువుల పరంగా ఎంత కావాలనే దానిపై రాష్ట్రాల నుంచి ఇండెంట్ కేంద్రానికి వెళ్తుంది. దాని ప్రకారం కేంద్రం ప్రణాళిక రూపొందించి రాష్ట్రాలకు ఎరువులు సరఫరా చేస్తుంది. కొన్నిరాష్ట్రాల్లో యూరియా వినియోగం అంతంత మాత్రంగా ఉన్నా, వాటికి కేటాయింపులు జరపడం సర్వసాధారణం. కేంద్రం యూరియా కేటాయించిన సమయంలో తెలంగాణలో కొరత ఏర్పడినప్పుడు మిగులు రాష్ట్రాల నుండి మళ్లించేలా రాష్ట్ర సర్కార్ ప్రయత్నించాల్సి ఉంది. ఇందుకు వ్యవసాయ మంత్రితో సహా, ఆశాఖ అధికారులు కేంద్రంపై వత్తిడితేవాల్సి ఉండగా, ఆ దిశగా ప్రయత్నాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కేంద్రానికి యూరియా కోసం లేఖలు రాయడం తప్ప వత్తిడి తేవడంలో తగినంత శ్రద్ధ చూపడం లేదు. గత రాష్ట్రప్రభుత్వ హయంలో మిగులు రాష్ట్రాల్లోని యూరియా తెలంగాణకు సరఫరా అయ్యేలా కేంద్రంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చిన సంఘటనలు ఉన్నాయి. అప్పటి వ్యవసాయ మంత్రి సైతం ఢిల్లీ మకాం వేసి యూరియా రాష్ట్రానికి సరఫరా చేసేలా ప్రయత్నాలు చేసి సఫలీకృతులయ్యారు. కాని ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. కాగా యాసంగి రైతులకు యూరియా ఇబ్బందులు ఉండవని రాష్ట్ర వ్యవసాయ శాఖ చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందు కు భిన్నంగా ఉన్నాయి. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని ప్రభుత్వం ప్రచారం చేసినా అది అందుబాటు లోకి రాకపోవడంతో చాలా చోట్ల మళ్లీ పాత పద్ధతి ద్వారానే సొసైటీల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నారు. దీంతో యాసంగి సాగు చేసిన రైతులు సొసైటీల వద్దకు వెళ్లినా నిల్వలు లేకపో వడంతో పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి బ్లాక్ మార్కెట్ లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే ఇక్కడి రైతుల అవసరాన్ని గమనించిన అక్కడి వ్యాపారులు ధర పెంచి మరీ విక్రయిస్తున్నారు. అదనంగా రూ.500 వెచ్చించి కొనుగోలు చేస్తుండడంతో రైతులపై ఆర్థిక పడుతోంది. మరోపక్క రాష్ట్రంలో యూరియా కోసం రైతులు ఆందోళన బాట పడుతున్నారు. రైతు దినోత్సవం రోజున కూడా రైతులు యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొన్నది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని రైతు వేదిక వద్ద రైతులు యూరియా కోసం అధికారులతో గొడవకు దిగారు. వరంగల్ జిల్లా నెక్కొండలోని సొసైటీ వద్ద రైతులు బారులు తీరారు. క్యూలో తోపులాట జరిగింది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సొసైటీ వద్ద యాప్ నమోదు ఇబ్బందిగా మారడంతోఆధార్‌పై పంపిణీ చేశారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులోని సగం మందికే పంపిణీ చేశారు. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి రైతులువేదిక వద్ద రైతులు కూపన్ల కోసంఎదురుచూశారు. నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రం ఎదుట ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలోని పీఏసీఎస్ వద్ద రైతులు బారులు తీరారు. యూరియా లోడ్ వచ్చిందన్న విషయం తెలియడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు వందలాదిగా ఉదయమే తరలివచ్చారు. 900బస్తాలు రాగా 350మందికి రెండు నుంచి ఐదు బస్తాల వరకు అందజేశారు. చాలామందికి అందకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు. ఈ నెల 25న యూరియా పంపిణీలో జాప్యంపై రైతులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. మహబూబాబాద్-తొర్రూర్ ప్రధాన రహదారిని దిగ్బంధించి ట్రాఫిక్ పూర్తిగా స్థంభించింది. రాత్రి నుండి సహకార సంఘం వద్ద గుమిగూడి, యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. పంపిణీపై స్పష్టత లేకపోవడంతో, వారు కార్యాలయం వెలుపల చలితో గడిపారు. తమవంతు గుర్తుగా తమ పాదరక్షలను క్యూలో ఉంచి, రాత్రంతా మంటలు వేసుకుని చలి తీవ్రతనుండి కాపాడుకునే ప్రయత్నం చేశారు. కామారెడ్డి జిల్లా కాచాపూర్‌లో యూరియా కొరత ఏర్పడింది. సొసైటీ గోదాంకు 444బస్తాల యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు వేకువజాము నుంచే చెప్పులను క్యూలో పెట్టి నిల్చున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయ శాఖ యూరియా తదితర ఎరువులను కేటాయింపులకు మించి సాధించడంలో కేంద్రంపై పెద్ద ఎత్తున వత్తిడి తేవాల్సి ఉంది. ●

మహారాష్ట్ర

# 'బాహుబలి' ఎవరో!

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నికలు వచ్చినపుడే పార్టీల అసలు స్వరూపాలు బయట పడతాయి. పార్టీల అసలు రంగు లేమిటో కూడా అప్పుడే తెలుస్తాయి. మహారాష్ట్రలో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం అటువంటిదే. తాజాగా జరిగిన మునిసిపల్ కౌన్సిల్, నగర పంచాయతీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయ కేతనం ఎగురవేసింది. అదే సమయంలో విపక్ష మహావికాస్ అఘాడి ( ఎమ్వీఎ)కి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లయింది. మహాయుతి కూటమిలో బిజెపి ఎక్కువ ఆనందోత్సాహాల్లో తేలియాడుతోంది. ఇక తమను ఎదిరించే వారే లేరనీ, మిత్ర పక్షాలను ఓ పట్టు పట్టాలనీ భావించింది. మహాయుతిలో మరో రెండు ప్రధాన పక్షాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి షిండే నాయకత్వం లోని శివసేన, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నాయకత్వం లోని ఎన్సీపి. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించడంతో ఆ కూటమికి పట్టపగ్గాలు లేకపోయాయి. అంతకు ముందు సిఎంగా ఉన్న షిండే డి.సిఎంగా ఉన్న ఫడ్నవిస్ స్థానాలు తారుమారై ఎన్నికల అనంతరం ఫడ్నవీస్ సిఎం అయ్యారు. వ్యూహచతురుడైన ఫడ్నవీస్ సారథ్యంలో ఇప్పుడు స్థానిక ఎన్నికలు కూడా విజయ ఢంకా మోగించాయి. అయితే సమస్యలు అక్కడి నుంచే మొదలయ్యాయి. అంతకు ముందు సిఎంగా అధికారం చెలాయించిన షిండే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కలుగులో ఎలుకలా ఉండిపోవలసి వచ్చింది. తనకు మళ్లీ సిఎం సీటే కావాలని పట్టుపట్టినా నెరవేరకపోవడంతో మళ్లీ అవకాశం కోసం ఆయన ఎదురు చూస్తున్నారు. కూటమిలోని మరో మిత్రపక్షమైన అజిత్ ఎన్సీపి కూడా పెద్ద డిమాండ్లే చేసినా వాటికి భారీగానే కోతలు పడ్డాయి. తన కుమారునిపై గల అవినీతి ఆరోపణల కారణంగా అజిత్ బిజెపి చెప్పినట్లు వినవలసి వచ్చింది. కానీ షిండేతో పాటు అజిత్ లో కూడా ఇటీవల అసంతృప్తి సెగలు రగులుతున్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో మొత్తం 288 సీట్లలో బిజెపికి అత్యధికంగా 132, షిండే శివసేనకు 57, అజిత్ ఎన్సీపీకి 41 లభించాయి. అంటే మహాయుతికి మొత్తం అత్యధికంగా 235 సీట్లు దక్కాయి. అదే ఎన్నికల్లో ఎమ్వీఎలోని ఉద్ధవ్ శివసేనకు 20 సీట్లు మాత్రమే రాగా, కాంగ్రెస్‌కు 16, పవార్ ఎన్సీపీకి 10 సీట్లు మాత్రం లభించాయి. అంటే మహారాష్ట్రలో కూడా ప్రతిపక్షమన్నది సోదిలోకి లేకుండా పోయింది. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మహాయుతి కూటమి మూడింట రెండు వంతుల మెజారిటీని కైవసం చేసుకుంది. బిజెపి సొంతంగా 207 సీట్లలో నెగ్గిందని సిఎం ఫడ్నవీస్ ప్రకటించారు. అధికార కూటమిలోషిండే శివసేన 53, అజిత్ ఎన్సీపి 37 చోట్ల గెలిచాయి. విపక్ష ఎమ్వీఎ 44 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. అటు అసెంబ్లీ, ఇటు స్థానిక ఎన్నికల్లో అడకత్తెరలో పోక చెక్కలా నలిగింది కాంగ్రెస్ ఒక్కటే. ఒకప్పుడు రాష్ట్రంలో చక్రం తిప్పిన కాంగ్రెస్ కు ఇప్పుడు వేళ్లమీద లెక్కించే స్థానాలు మాత్రమే రావడం 'ఇండియా' కూటమి లో ఆ పార్టీ స్థానమేమిటో తెలియజేస్తోంది. 2017లో జరిగిన స్థానిక ఎన్నికల కంటే బిజెపి పరిస్థితి రాష్ట్రంలో అనేక రెట్లు మెరుగుపడినట్లు అర్థమవుతుంది. అయితే జనవరి 15న జరగనున్న మునిసిపల్ కార్పొరేషన్ల ఎన్నికలే ఇప్పుడు మహాయుతికి కూడా సవాల్‌గా మారాయి. స్థానిక ఎన్నికల్లో తమ పరిస్థితి మెరుగుపడడంతో బృహన్ముంబయి కార్పొరేషన్ లోని 227 సీట్లలో బిజెపి స్వయంగా పోటీ చేయాలని నిర్ణయించడం కూటమిలోని మిత్ర పక్షాలలో కుంపట్లు రగిల్చింది. ముంబయి కార్పొరేషన్‌లో 50 సీట్లు మాత్రమే షిండే శివసేనకు ఇవ్వాలని బిజెపి నిర్ణయించడంతో షిండే సీట్ల పోరుబాటపట్టారు. ఒకదశలో తాము విడిగా అన్ని సీట్లకు పోటీ చేస్తామనే దశకు వచ్చారు. వివాదం ఊసర వెల్లి కాకముందే బిజెపి అధిష్ఠానం కలుగజేసు కొని షిండేకు ఇవ్వదలచిన సీట్లను 50 నుంచి 78కి పెంచింది. మరో శివసేన పక్షానికి నాయ కత్వం వహిస్తున్న ఉద్ధవ్ థాకరే సోదరుడైన రాజ్ థాకరేతో చేతులు కలపడంతో మహాయుతిలో కూడా అది 'కదలిక' తెచ్చింది. షిండే వెళ్లి ఉద్ధవ్‌తో చేతులు కలిపితే పరిస్థితి మళ్లీ తారుమారవుతుంది. రాష్ట్రప్రభుత్వంలో మార్పు లేకపోయి నా ముంబయి, పుణే వంటి పెద్ద కార్పొరేషన్‌లలో మహాయుతి జాతకం మారిపోతుంది. అలా జరగకూడదని భావించారేమో! చివరికి 78 సీట్లు షిండే శివసేనకు ఇవ్వడానికి బిజెపి అంగీకరించింది. ఒప్పందంలో భాగంగా మైనారిటీలు ఎక్కువగా ఉన్న సీట్లలో పోటీ చేయడానికి అజిత్ ఎన్సీపి అంగీకరించడంతో ఫడ్నవీస్ ప్రస్తుతానికి గట్టెక్కనట్లే కనిపిస్తున్నారు. అయితే షిండే, అజిత్ నుంచి మహాయుతికి ముందు ముందు ముప్పు తప్పకపోవచ్చు. ముంబయి సహా రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లకు జనవరి 15న జరిగే ఎన్నికలు అన్ని పార్టీలకు కూడా చాలా కీలకం. తన నాయకత్వంలోని శివసేన కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంతో ఉద్ధవ్ థాకరే కూడా ముందుకు కదులుతున్నారు. గతవారం రాజ్ థాకరేతో చేతులు కలపడం దానిలో భాగమే. దాదాపు 20 సంవత్సరాల తరువాత ఈ 'అపూర్వ సహోదరులు' ఇద్దరూ చేతులు కలపడంతో మహాయుతిలో కూడా వ్యూహాలు పదునెక్కాయి. స్థానిక ఎన్నికలను కూడా అసెంబ్లీ స్థాయిలో పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించడంతో ఊహించలేనంత ప్రాధాన్యం ఏర్పడుతోంది. ప్రచారం కూడా అసెంబ్లీ ఎన్నికలను మించి జరుగుతోంది. కొన్ని పార్టీలు ఓటర్లకు విదేశీయానం హామీని కూడా ఇస్తున్నాయి. అయితే చివరికి ఏం జరుగుతుందన్నది చూడాలి. తీవ్రమైన పోటీ ఉన్న ముంబయిలో అసలు 'బాహుబలి ' ఎవరో సంక్రాంతి తర్వాత తెలుతుంది. ●



ఫడ్నవీస్

బంగ్లాదేశ్

# బంగ్లాదేశ్ భవిష్యత్తు 'ఆశాకిరణం'

**గన్ని మోహన్**

హింసతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో కేర్‌టేకర్ ప్రభుత్వం ఎట్టకేలకు ఎన్నికలను ప్రకటించడంతో ఇప్పుడు ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయా అన్న ప్రశ్న పక్కనపెడితే బంగ్లాదేశ్ ప్రజలకు ఆశాకిరణంగా ఒకే ఒక్క నాయకుడు కనిపిస్తున్నాడు. అదే మాజీ ప్రధాని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత్రి మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రహమాన్. 17 ఏళ్లపాటు లండన్‌లోనే ఆశ్రయం పొందిన రెహమాన్ ఎట్టకేలకు స్వదేశానికి తిరిగి వచ్చాడు. అందరూ ఊహించినట్లుగానే అపూర్వస్వాగతం లభించింది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుకు తన వద్దప్రణాళికలున్నాయని, బంగ్లాదేశ్ ఎవరికీ మోకరిల్లదని, బంగ్లా బంగ్లాదేశ్‌గానే వర్ధిల్లుతుందని చెపుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలకు క్రౌన్ ప్రిన్స్‌గా పిలువబడే తారిక్ రహమాన్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ పెద్దకుమారుడు. బిఎన్పీలో సీనియర్ వైస్‌ఛైర్మన్ సీనియర్ జాయింట్ సెక్రటరీ వంటి పదవులు నిర్వహించిన తారిఖ్ ఇప్పుడు తల్లి ఖలీదా తీవ్ర అనారోగ్యంతో సతమతం అవుతుండటంతో పార్టీ బాధ్యతలు అన్నీ ఆయనే చూసుకుంటున్నారు. బంగ్లా విముక్తి యుద్ధంలో తారిక్‌ను ఆయన తల్లి ఖలీదా, ఇతర మొత్తం కుటుంబ సభ్యులందరితోను అరెస్టుచేసారు. యుద్ధఖైదీల్లో అతిపిన్న వయస్కుడిగా ఆనాడు తారిక్ పేరు పొందారు. బిఎన్‌పి జనరల్ సభ్యుడుగా కింది స్థాయిక కార్మి కులు, మద్దతుదారులను సమీకరించి హెచ్ఎం ఎర్షాద్ ప్రభుత్వాన్ని కూల్చడంలో కీలకంగా కొన సాగారు. 1991లో ఖలీదా బంగ్లాదేశ్‌కు మొదటి మహిళా ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు తారిక్ దేశవ్యాప్త ప్రచారం నిర్వహించి పార్టీని మరింత చైతన్యపరిచాడు. అవామీలీగ్ ర్యాలీలో గ్రనేడ్ దాడి జరిగిన సంఘటనలో తారిఖ్ పేరు తెరపైకి వచ్చింది. తదనంతర పరిణామాల్లో సైనిక మద్దతుతో ఏర్పడిన ప్రభుత్వంలో అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగంగా తారిఖ్ రెహమాన్ అరెస్టు అయి హింసకు కూడా గురయ్యారు. గ్రనేడ్ దాడి సంఘటనలో తారిక్‌తోపాటు 18 మందికి జీవిత ఖైదు పడింది. రెహమాన్ భారీ అవినీతిలో వందల మిలియన్ల డాలర్లు సంపాదించడాన్ని అమెరికా రాయబార కార్యాలయ కేబుల్స్ ప్రస్తావిస్తూ ఆరోపించింది. అక్రమ సంపద కూడబెట్టాడని 2023లో రెహమాన్‌కు తొమ్మిదేళ్ల జైలుశిక్ష పడింది. ఇక గత ఏడాది విద్యార్థి ఉద్యమంతో హసీనా ప్రభుత్వం పదవీచ్యుతి పొందడం తారిక్ రహమాన్ అదృష్టం మారిపోయింది. మొత్తం 84 కేసుల నుంచి ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు. వీటిలో రాజద్రోహానికి సంబంధించిన కేసులు కూడా ఉన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జాతీయ ఎన్నికలు జరగనున్నాయి. దేశంలో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సాధించేందుకు ఆయన అహరహం శ్రమిస్తున్నారు. బిఎన్‌పి వద్ద స్పష్టమైన ప్రణాళికలున్నాయని, దేశం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగడమే తన లక్ష్యమని తారిక్ తన తొలిప్రసంగంలో చెప్పుకొచ్చారు. అయితే పొరుగునసే ఉన్న భారత్‌తో ఉన్న సంబంధాలపై ఆయన ఎలాంటి విధాన ప్రకటన చేయలేదు. అయితే ప్రస్తుతం ఉన్న సమస్యలను చక్కదిద్దడం అంత సులువేమీ కాదు. రెండుదశాబ్దాలు పార్టీకి, దేశానికి దూరంగా ఉన్నా బిఎన్పీ మద్దతుదారులు ఆయనకు రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. హసీనా హయాంలో బిఎన్పీ కేడర్ మొత్తం అణిచివేతకు గురవడంతో కేడర్‌లో నిరాశానిస్పృహలు ఎక్కువ అలుముకున్నాయి. బిఎన్‌పి మిత్రపక్షంగా కొనసాగిన ఇస్లామిస్ట్ పార్టీ జమాత్ ఎ ఇస్లామి ప్రభావం కూడా పెరిగింది. ఢాకా వర్సిటీ ఎన్నికల్లో ఆపార్టీ విజయం సాధించడంతో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయి హసీనా ప్రభుత్వానికి గడ్డుసమస్యలు ఎదురయ్యాయి. అవామీలీగ్‌పై ప్రస్తుత యూనస్ ప్రభుత్వం నిషేధం ప్రకటించడం, ఇస్లామిస్టు పార్టీ ఒకటి రావడం వల్ల ముస్లిమేతరులు ఇప్పుడు బిఎన్‌పి వైపు మొగ్గు చూపుతారన్నవిశ్వాసం పెరుగుతోంది. అందువల్లనే పార్టీ ఓటు బ్యాంకుతోపాటు మైనార్టీ ఓటుబ్యాంకుతో బీఎన్పీ ఖచ్చితంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుందన్న ధీమాతో ఉన్నారు. గడచిన రెండు దశాబ్దాలుగా లండన్ నుంచే ప్రకటనలు ఇవ్వడం, ప్రభుత్వ వ్యతిరేక విమర్శలు చేయడం వంటివి చేస్తూ వచ్చిన తారిక్ ఇప్పుడు ప్రజల మధ్యకు వచ్చారు. వీధుల్లో సాధారణ ప్రజలతో మాట్లాడటం, మసీదుల్లో ప్రార్థనలు చేయడం, హిందూ దేవాలయాలను సందర్శించడం బహిరంగసభల్లో ప్రసంగించడం ఇవన్నీ ఒకఎత్తు. అయితే ఇవన్నీ ప్రజల్లో ఆశలను మాత్రం రేకెత్తిస్తున్నాయి. భవిష్యత్తు ఎన్నికల్లో బిఎన్పీనే గెలిపించాలన్న ధృఢ సంకల్పం మెజార్టీ ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ఎందుకంటే ప్రస్తుత యూనస్ కేర్‌టేకర్ ప్రభుత్వంపై సర్వత్రా అసంతృప్తి పేరుకునిపోయింది. ప్రజల్లో విశ్వాసం పొందలేకపోయిందనే చెప్పాలి. యూనస్ ప్రభుత్వంపై అలుముకుంటున్న నిరసనను ఇప్పుడు తారిక్ తనకు సానుకూలంగా మలుచుకోవడంతోనే అసలు విజయం ఉంది. పైగా ఇప్పుడున్న ప్రభుత్వానికి చైనా, పాకిస్థాన్‌లతోపాటు అమెరికా మద్దతు కూడా ఉన్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. దీనికితోడు తరచూ పాకిస్థాన్‌తోనే సంప్రదింపులు జరుపుతున్నారని, ఒకరకంగా యూనస్ ప్రభుత్వాన్ని పాకిస్థాన్ తెరవెనుక నడుపుతోందన్న ప్రచారం కూడా ఉంది. వీటన్నింటికంటే భయాందోళనల్లో మగ్గుతున్న అవామిలీగ్ కేడర్ బిఎన్పీకి మద్దతిస్తుందా లేక స్వంతంత్ర అభ్యర్థులుగా వస్తారా అన్నది తెలియాల్సి ఉంది. హింసతో ముస్లింమేతరులపై దాడులు పెచ్చుమీరిన బంగ్లాదేశ్‌లో ఇప్పుడు సజీవదహనాలే అస్త్రంగా మలుచుకుని ఆందోళనకారులు పేట్రేగిపోతున్నారు. ఈక్రమంలో ఇప్పుడు బంగ్లా ప్రజలకు ఏకైక ఆశాకిరణం తారిక్ రహమాన్ ఒక్కరే కనిస్తున్నారు. బంగ్లా భవిష్యత్తు కిరణం తారిక్ రహమానే అవుతారేమో చూడాలి. ●



తారిక్‌రహమాన్

# ధ్వన్యనుకరణ సమ్రాట్ పద్మశ్రీ డా. నేరెళ్ళ



డా.ఎ.రాజు

శ్రీ వివేకానందుడు చికాగోలో ఇచ్చిన ఉపన్యాసంతో ప్రపంచం ఆశ్చర్య పోయి భారతదేశపు సంస్కృతిని మెచ్చుకుంది. శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిభను మెచ్చుకుని ప్రపంచంలోని గొప్ప బహుమతి నోబుల్ ప్రైజ్‌ని ఆ మహానుభావుడికిచ్చింది ప్రపంచం. అదే కోవలో ఐక్యరాజ్య సమితిలో భారత దేశం తరపున మిమిక్రీ ప్రోగ్రామ్ ఇచ్చిన ఏకైక ప్రతిభామూర్తి ధ్వన్యనుకరణ సామ్రాట్ కీ॥శే పద్మశ్రీ డా.నేరెళ్ళ వేణుమాధవ్‌గారు. పురాణకాలం నుంచి భారతదేశంలో మిమిక్రీ 'ధ్వన్యనుకరణ కళ ఉంది. సాక్ష్యం కావాలా? రామాయణం చదవండి. సీతమ్మ కోరిక తీర్చడం కోసం మాయలేడి వెంటబడి శ్రీరామచంద్రుడు తరుముతున్నప్పుడు మాయలేడి రూపంలో ఉన్న మారీచుడు బాణంతగిలి హా లక్ష్మణా! హా సీతా! అంటూ శ్రీరామచంద్రుడు ఆర్తనాదం చేసినట్లుగా రామాయణంలో వాల్మీకి మహర్షి వ్రాసారు. అంటే ఆ (త్రేతా యుగం) కాలంలో కూడా మిమిక్రీ ధ్వన్యనుకరణ కళ ఉంది. అంతటి ప్రాచీనమైన కళకు సొగసులందించి భారతీయ కళకు విశ్వవ్యాప్తమైన కీర్తిని కల్పించింది పద్మశ్రీ డా.నేరెళ్ళ వేణుమాధవ్. పాతాళభైరవి సినిమాలో మాంత్రికుడు ఎస్.వి.రంగా రావు చేతితో ఇలా అనగానే అలా అనేక వస్తువులు పుడతాయి మనం అందరం చూసాం. అది అబద్ధం, నిజంగా జరగదు. కానీ మనిషి గొంతులోంచి వచ్చే శబ్దంతో రకరకాల ధ్వనులు పలికించవచ్చు. కనిపించని శబ్దం నుంచి వినిపించే అద్భుత నాదాలు కోకిల రాగం, సింహగర్జన, కారు హారన్, రైలు కూత, గాలివాన, పిడుగు పడుట, గుఱ్ఱపు డెక్కల శబ్దాలు ఇంకా ఎన్నో ఎన్నెనో పుట్టించొచ్చు. పుట్టుకతోనే ప్రతి శిశువుకు మిమిక్రీ కళవచ్చు. ఆశ్చర్యపోకండి! తెలుగు రాష్ట్రాల్లో పుట్టిన పిల్లలు తెలుగు భాషని, తమిళనాడు పిల్లలు తమిళం, కర్ణాటక పిల్లలు కన్నడ, ఉత్తర భారతం పిల్లలు హిందీ ఎలా నేర్చుకుంటున్నారు? ఎందుకు నేర్చుకుంటున్నారు? తల్లిదండ్రులను అనుకరించడం వల్లనే. మళ్ళీ తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ, రాయల సీమ, కోస్తాంధ్ర ప్రాంతాల యాసలు వేరు. అసలు భాష నేర్వక ముందు ఆదిమానవులు వేటకు వెళ్ళినప్పుడు జంతు వులను పట్టుకోవడం కోసం వాటి కూతలను, అరుపులను అనుకరించేవారని చరిత్ర పరిశోధకులు సిద్ధాంతికరించారు. ఈ అనుకరణ మిమిక్రీ కళకు మూల సూత్రం. ఇతిహాసాలు అనుకరణ రామాయణ మహాభారతాల్లో అనుకరణకు సంబంధించిన ఘట్టలు ఉన్నాయి. ధ్వన్యనుకరణ కళను మిమిక్రీ అనే పక్రియతో బహుళ ప్రాచుర్యం పొందింది. మిమిక్రీ అనే పదానికి ఆయా నిఘంటువుల ప్రకారం అనుకరించు, వెక్కిరించు, హాస్యము అని అర్థం. ఎగతాళి, పరి హాసము, గేలి, అపహాస్యము, ఒకటి చూచి ఆ ప్రకారం చేయు, పోలినట్లు చేయు, అనుకరించి నవ్వించు అనేవి పర్యాయ పదాలు. కాలానుగుణంగా ప్రజల అభిరుచులు మారుతుంటాయి. ఆ అభిరుచులకు అనుగుణంగా కళలో కొత్తకొత్త మార్పులు చోటుచేసుకుంటాయి. మిమిక్రీ కళ కూడా ఇందుకు భిన్నమయింది కాదు. ప్రతి కళ ముఖ్యోద్దేశం ఆనందం కలిగించడం. ధ్వన్యనుకరణ (మిమిక్రీ) కళలో అది మరింత అధికంగా కన్పిస్తుంది. ఈ కళను గ్రామస్థాయి వేదికల నుంచి అంతర్జాతీయ వేదికల స్థాయికి చేర్చింది మాత్రం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మిమిక్రీ సామ్రాట్, ఆధునిక మిమిక్రీ కళ పితామహుడు పద్మశ్రీ డా.నేరెళ్ళ వేణుమాధవ్. ఈ కళను రంగస్థల కళగా తీర్చిదిద్ది గ్రామాల్లో పట్టణాల్లో విరివిగా ప్రదర్శన ఇవ్వడమేగాక ఈ కళకు గ్లామర్ కల్పించినది కూడా ఆయనే. డా॥ నేరెళ్ల వేణుమాధవ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వరంగల్ జిల్లా, మట్టేవాడలో 28 డిసెంబరు 1932లో శ్రీ నేరెళ్ళ శ్రీహరి, శ్రీమతి నేరెళ్ళ శ్రీలక్ష్మి దంపతులకు జన్మించారు. తండ్రి ప్రముఖ వ్యాపారవేత్త. వారి ఇంటికి ఈ రోజుల్లో ఎందరో ప్రముఖులు, సాహితీవేత్తలు వచ్చేవారు. వారి ప్రభావంనేరెళ్ళ వేణుమాధవ్‌పై పడింది. వేణుమాధవ్ ఎనిమిదవ యేట లక్ష్మయ్య పంతులు వద్ద అక్షరాభ్యాసం చేశారు. నాన్నగారి వద్ద ఇంగ్లీషు, ఉర్దూ నేర్చు కున్నారు. కొంతకాలం ప్రైవేటుగా చదివి గవర్నమెంటు స్కూల్లో చేరారు. ఆ కాలంలో వచ్చిన చిత్తూరు నాగయ్యగారి గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి నాగయ్యగారి మీద అభిమానం పెంచుకున్నారు. ఇవేకాకుండా వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంక ట్రామయ్యగార్లు నటించిన సినిమాలు చూసి, ఇంటికిరాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. ఏవీవీ (ఆంధ్ర విద్యాభివర్ధిని) హై స్కూల్లో చదువుతున్నప్పుడు హరి రాధాకృష్ణ మూర్తిగారి శిష్యరికంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం ప్రహసనాల్లో నటించడం ద్వారా రంగస్థల జీవితానికి శ్రీకారం చుట్టారు. 1951లో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజిలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సుగారు వేణుమాధవ్‌కి ఆ రోజుల్లో అరవై రూపాయలు స్కాలర్‌షిప్ (బర్సరీ) మంజూరు చేశారు. దానితో వీరు ముప్ఫయి ఇంగ్లీషు సినిమాల్ని తనవితీరా చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్ని వేశాలు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్‌తో సహావినిపిస్తే, రామనర్సు పరమానందభరితులై యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్ అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే వీరిని విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్‌గా ఎదిగేలా చేసాయి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తునే ప్రైవేట్‌గా బి.ఏ., బీ.కాం., బి.హెడ్. పాసయ్యారు. తర్వాత ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగరీత్యా ఎదిగినప్పటికినీ మిమిక్రీ కళ పట్ల ఉన్న మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా కళాజీవితానికే అంకితమయ్యారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో డా॥ నేరెళ్ళ వేణు మాధవ్ ఎం.ఎల్.సీ.గా 1972 నుంచి 1978 వరకు పదవీబాధ్యతులు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో అనేక పదవులను నిర్వహించారు. వీరికి ఆంధ్ర విశ్వవిద్యాలయం 1977లో కళాప్రపూర్ణ, జె.ఎన్.టి.విశ్వవిద్యాలయం 1987లో, కాకతీయ విశ్వవిద్యాలయం 1992లో గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసాయి. దేశవ్యాప్తంగా అనేక సంస్థలలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. అలాగే లెక్కలేనన్ని బిరుదులు, సన్మానాలతో డా॥నేరెళ్ళ వేణుమాధవ్ జాతీయ, అంతర్జాతీయంగా ప్రేక్షకులు నీరాజనాలు పట్టారు. మిమిక్రీ కళకు డా. వేణు మాధవ్ ఎనలేని సేవచేశారు. 1971వ సంవత్సరంలో ఐక్య రాజ్యసమితిలో ప్రప్రథమంగా మిమిక్రీ ప్రదర్శన ఇచ్చినఏకైక భారతీయ కళాకారులు డా॥ నేరెళ్ళ వేణు మాదవ్. ఆయన విశిష్టతను గుర్తించిన భారత ప్రభుత్వం 2001 సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారంతో సన్మానించింది. మిమిక్రీ కళకు పితామహులు, ఆద్యుడు కళాప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్. ఎందుకంటే ఆనాడు అంటే 20వ శతాబ్దం తొలిదశకం నుంచి ఆరు ఏడు దశాబ్దాల వరకూ ప్రచాం˘సాధనాల ఉధృతి అంతగాలేదు. టివి ఛానళ్లు, అంతర్జాలం (ఇంటర్నెట్) ప్రభావం ఇంకా విస్తరించలేదు. అందువల్ల ఆ కాలం ప్రజలకు సినిమాలు, నాటికలు, నాటకాలు, జాన పదకళలు, ఇతర రంగస్థల కళలే ముఖ్య వినోద సాధనాలుగా ఉండేవి. దాంతోబాటు కొత్తగా విక సించిన మిమిక్రీ కళ పట్ల వారికి విపరీతమైన మక్కువ ఏర్పడింది. దానికితోడు మిమిక్రీ కళాకారుల సంఖ్య పరిమితంగా ఉండడం, ఉన్న కళాకారుల అంశాల్లో ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా వైవిధ్య భరితంగా ఉండడంకూడా మిమిక్రీ కళ బహుళ ప్రజాదరణ పొందడానికి కారణమైంది. తాను రాణించిన మిమిక్రీ రంగంలో ఇతర ఔత్సాహిక మిమిక్రీ కళాకారులకు ఉపయోగపడే విధంగా అలాగే ఈ కళలో రాణించాలంటే ఇది పుట్టుకతోనే మిమిక్రీ కళ అబ్బుతుందనే అపోహ పోగొట్టడానికి డా.నేరెళ్ళ వేణుమాధవ్ కృషితో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో(ప్రస్తుతం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం) డా.కె.వి.రమణాచారి (ప్రస్తుతం రిటైర్డ్ ఐఏఎస్) ప్రోత్సాహంతో మిమిక్రీలో డిప్లొమా ఇన్ మిమిక్రీ కోర్సుకు సిలబస్‌ను రూపొందించి 1999వ (25సంవత్సరాల క్రితం) సంవత్సరంలో ప్రవేశపెట్టారు. నేడు పద్మశ్రీ డా. కీ॥శే నేరెళ్ళ వేణుమాధవ్ గారి జయంతి సందర్భంగా వారు కలలుగన్న మిమిక్రీ కోర్సు మరో 25సంవత్సరాలు వారి ఆశీస్సులతో నిరాటంగా సాగుతుందని తెలియజేస్తూవారిచే ప్రారంభించిన డిప్లొమా ఇన్ మిమిక్రీ కోర్సు సిల్వర్‌జూబ్లీని డా.నేరెళ్ళవేణుమాధవ్‌గారికి అంకితం ఇవ్వడమే నిజమైన ఘన నివాళి. ●



నేడు డా॥ నేరెళ్ల వేణుమాధవ్ జయంతి

# పాక్‌లో భారీగా మేధో వలసలు

## ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ముప్పు తప్పదంటున్న నిపుణులు



**ఇస్లామాబాద్, డిసెంబరు 27:** దాయాది దేశం పాకిస్తాన్ అతిపెద్ద మేధో వలసను ఎదుర్కొంటోంది. దేశంలో కుదేలవుతున్న ఆర్థిక పరిస్థితులు,రాజకీయ అస్థిరత, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోవడం వల్ల చదువుకున్న యువత భారీ సంఖ్యలో దేశాన్ని విడిచిపెడుతోంది. రెండేళ్లలోనే వేల సంఖ్యలో డాక్టర్లు, ఇంజినీర్లు, అకౌంటెంట్లు పాకిస్తాన్‌ను వదిలి విదేశాలకు వెళ్లిపోయారు. గత 24 నెలల్లో పాకిస్తాన్ నుంచి సుమారు 5వేల మంది డాక్టర్లు, 11 వేల మంది ఇంజినీర్లు, 13 వేల మంది అకౌంటెంట్లు ఇతర దేశాలకు వలస వెళ్లారు. ఇది కేవలం గణాంకాల పరమైన నష్టం మాత్రమే కాదు దేశ భవిష్యత్తును నడిపించాల్సిన మేధస్సు బయటకు వెళ్లిపోతున్న దారుణ స్థితికి ప్రతీక. ఈ వలసతో ముఖ్యంగా ఆరోగ్య, ఇంజినీరింగ్, ఫైనాన్స్ వంటి కీలక రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిపై పాకిస్తాన్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై విమర్శల వర్షం కురుస్తోంది. ఇటీవల ఆయన ఈ భారీ వలసలను బ్రెయిన్ డ్రెయిన్ కాదు, బ్రెయిన్ గైన్ అంటూ సమర్థించేందుకు ప్రయత్నించారు. చదువుకున్న యువత దేశంలో అవకాశాలు లేక బయటకు వెళ్లిపోతుంటే, దాన్ని లాభంగా చెప్పడం ప్రజలను మరింత ఆగ్రహానికి గురి చేసింది. మాజీ సెనేటర్ ముస్తఫా నవాజ్ ఖోఖర్ మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థను సరిచేయకపోతే ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోదని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఫ్రీలాన్సింగ్ హబ్‌గా గుర్తింపు పొందిన పాకిస్థాన్ తరచూ జరిగే ఇంటర్నెట్ షట్‌డౌన్‌ల వల్ల ఏకంగా 1.62 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసిందని తెలిపారు. దీనివల్ల దాదాపు 23.7 లక్షల ఫ్రీలాన్సింగ్ ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ అండ్ ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ విడుదల చేసిన తాజా డేటా ఈ పరిస్థితిని మరింత ఆందోళనకరంగా చూపిస్తోంది. 2024లో 7,27,381 మంది విదేశీ ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా ఈ ఏడాది నవంబర్ నాటికే 6,87,246 మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒకప్పుడు గల్ఫ్ దేశాలకు కూలీ పనుల కోసం వెళ్లే వారు ఎక్కువగా ఉండేవారు. డిగ్రీలు, వృత్తి నైపుణ్యాలు ఉన్న వైట్ కాలర్ ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో దేశాన్ని వదిలి వెళ్లిపోతున్నారు. డాక్టర్లతో పాటు నర్సుల వలస కూడా ప్రమాదకర స్థాయికి చేరింది. 2011 నుంచి 2024 మధ్య కాలంలో నర్సుల వలస ఏకంగా 2,144 శాతం పెరిగినట్లు నివేదికలు వెలువడుతున్నాయి. ఈ ఏడాది కూడా అదే ధోరణి కొనసాగుతోంది. చదువుకున్న వర్గం దేశం విడిచిపెడుతుండటంతో మెహజబ్ షరీఫ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ఏడాది ఇప్పటివరకు 66,154 మంది ప్రయాణికులను వివిధ కారణాలతో విమానాశ్రయాల్లోనే నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ వలసలు దేశ ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యసేవలు, సాంకేతిక పురోగతిపై దీర్ఘకాల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. పరిస్థితిని సరిచేయాలంటే రాజకీయ స్థిరత్వం, ఆర్థిక సంస్కరణలు, యువతకు అవకాశాలు కల్పించడం అత్యవసరం. లేదంటే దేశం తన అత్యంత విలువైన సంపద అయిన మానవ వనరులను పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఉపాధి హామీ రద్దుచేసి పేదల కడుపుకొట్టిన మోడీ

### మల్లిఖార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ,డిసెంబరు 27:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఆరోపించారు. దీనిపై దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో శనివారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత శశిథరూర్ సహా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉందని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)ను రద్దు చేసి పేదల కడుపు కొట్టారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి పేదల కంటే కార్పొరేట్ సంస్థలకే ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏను ఆయన వ్యవసాయ చట్టాలతో పోల్చారు. నాడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నట్లుగా, ఉపాధి హామీ చట్టం రద్దుకు వ్యతిరేకంగా కూడా ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కులకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడానికి నాటి యూపీఏ ప్రభుత్వం ముందుచూపుతో గ్రామీణ ఉపాధి పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు.



## ఉపాధి హామీ పథకం పేదల పని హక్కు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడంపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. దీనిని పేద ప్రజలపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఎంజి నరేగా కేవలం ఒక పథకం మాత్రమే కాదు పేద ప్రజల పని హక్కు అని పేర్కొన్నారు. సంబంధిత మంత్రులను సంప్రదించకుండా, ప్రధాని నరేంద్రమోడీ సొంతంగా ఈ నిర్ణయం తీసుకున్నారని దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని ఆరోపించారు. మోడీ ఏది కోరుకుంటే దేశంలో అదే అమలవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు రావాలని ప్రతిపక్ష నేతలకు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన ఈ పథకాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్‌ను నాశనంచేసిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు గ్రామీణప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు ఆర్థిక భరోసాని ఇస్తూ అన్నం పెట్టిన పథకాన్ని ఆపితే వారు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. దేశంలోని వ్యవస్థలపై కేంద్రం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై ప్రజల తరఫున కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ పథకం రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి 'ఎంజినరేగా బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని రాహుల్ ప్రకటించారు.

## మ్యాచ్ ప్రారంభంలోనే అసిస్టెంట్ కోచ్ ఆకస్మిక మృతి




**ఢాకా, డిసెంబరు 27:** బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ (59) హఠాన్మరణం చెందాడు. ఇవాళ సిల్హెట్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాజ్‌షాహీ వారియర్స్‌తో మ్యాచ్ ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు ఈ దురదృష్టకర ఘటన జరిగింది. మ్యాచ్‌కు ముందు జట్టు ప్రాక్టీస్ చేస్తుండగా, జకీ మైదానంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన జట్టు సిబ్బంది, వైద్యులు అతడికి సీపీఆర్ చేసి, అంబులెన్స్‌లో సమీపంలోని అల్ హరమైన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మహబూబ్ అలీ జకీ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనతో మైదానంలో ఉన్నవారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. జకీకి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, అతడి ఆకస్మిక మరణం తమను తీవ్రంగా కలచివేసిందని జట్టు అధికారులు తెలిపారు. జకీ మృతికి సంతాపంగా మ్యాచ్‌కు ముందు ఆటగాళ్లు, అధికారులు ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం మ్యాచ్ యథావిధిగా కొనసాగింది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. దేశ క్రికెట్‌కు, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ల అభివృద్ధికి జకీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడింది. ఒకప్పుడు ఫాస్ట్ బౌలర్‌గా రాణించిన జకీ, కొమిల్లా జిల్లాకు, దేశంలో ప్రముఖ క్లబ్ అయిన అబాహనీ లిమిటెడ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

## థాయిలాండ్ కాంబోడియాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

**చాంతబురి(థాయ్‌లాండ్), డిసెంబరు 27:** థాయిలాండ్, కంబోడియా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. రెండు దేశాలకు చెందిన రక్షణ మంత్రులు శనివారం ఈ ఒప్పందంపై సంయుక్త ప్రకటన చేశారు. కంబోడియా రక్షణ మంత్రి టీ సేహ, థాయిలాండ్ మంత్రి నట్టఫోన్ నర్కఫనిట్ కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశారు. థాయ్‌లోని చాంతబురి ప్రావిన్సులో ఇద్దరు మంత్రుల మీటింగ్ జరిగింది. సైనిక బలగాల కదలికలపై రెండుదేశాలు తక్షణ ఆంక్షలు విధించాయి. బోర్డర్ వద్ద ఉన్న సాధారణ పౌరులు స్వంత ఇండ్లకు చేరుకునే అవకాశం కల్పించారు. గత కొన్నాళ్ల నుంచి థాయ్, కంబోడియా బోర్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. బోర్డర్ కాల్పుల్లో సుమారు 41 మంది మరణించారు.

## 20 సూత్రాల శాంతిప్రణాళికపై రిఫరెండమ్‌కు జెలెన్‌స్కీ పిలుపు



**క్యీవ్, డిసెంబరు 27:** ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ ఒక సాహసోపేతమైన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. తన 20సూత్రాల శాంతి ప్రణాళిక పై దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) నిర్వహించడానికి తాను సిద్ధమని, అయితే దీనికి రష్యా కనీసం 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాలని షరతు విధించారు. అమెరికా మీడియా సంస్థ యాక్సియోస్‌కి ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ ఈ విషయాలను వెల్లడించారు. శాంతి ఒప్పందంలో భాగంగా ప్రాంతీయ సరిహద్దులు లేదా భూభాగాలకు సంబంధించిన నిర్ణయాలు సంక్లిష్టంగా మారితే, దానిపై తుది నిర్ణయాన్ని ఉక్రెయిన్ ప్రజలకే వదిలేస్తానని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఇది చాలా కష్టమైన నిర్ణయం. అందుకే మొత్తం 20 పాయింట్ల ప్రణాళికను ప్రజల ముందు ఉంచడం సరైన మార్గమని నేను భావిస్తున్నాను. కానీ, బాంబు దాడులు జరుగుతున్నప్పుడు ప్రజలు ఓటు వేయలేరు. అందుకే ఎన్నికల నిర్వహణ, భద్రత, ఇతర సాంకేతిక కారణాల దృష్ట్యా 60 రోజుల విరామం అత్యవసరమని ఆయన వివరించారు. ఆదివారం ఫ్లోరిడాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరగనున్న భేటీపై జెలెన్‌స్కీ భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ భేటీలో యుద్ధం ముగింపునకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ వస్తుందని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా ఉక్రెయిన్ మధ్య ఐదు కీలక పత్రాలపై ఒప్పందం కుదిరిందని, భద్రతా హామీల కాల పరిమితిని 15 ఏళ్ల నుంచి మరింత పెంచాలని తాను కోరుతున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. మరోవైపు రష్యా కూడా ప్రజాభిప్రాయ సేకరణ కోసంకాల్పులవిరమణ అవసరమని గుర్తిస్తున్నప్పటికీ, 60రోజుల గడువు చాలాఎక్కువని భావిస్తున్నట్లు సమాచారం. గడువును తగ్గించాలని రష్యా కోరుతుండగా, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లకు రెండు నెలలు చాలా తక్కువ సమయమని ఉక్రెయిన్ వాదిస్తోంది. ఈ ప్రతిపా దనలపై నేడు ట్రంప్, జెలెన్‌స్కీ, యూరోపియన్ నేతల మధ్య కాన్ఫరెన్స్ కాల్ జరిగే అవకాశం ఉంది.

## బంగ్లా పేసర్‌ను ఐపిఎల్‌లో ఆడిస్తే పిచ్‌లు తవ్వేస్తాం..

### ఉజ్జయినిలో హిందూ మతపెద్దల హెచ్చరికలు

**ఉజ్జయిని, డిసెంబరు 27:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల ప్రభావం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)పై పడింది. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్‌లో ఆడనిస్తే, మ్యాచ్‌లు జరిగే స్టేడియంలోకి దూసుకెళ్లి పిచ్‌లను ధ్వంసం చేస్తామని ఉజ్జయినికి చెందిన పలువురు మత పెద్దలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందువులను దైవదూషణ ఆరోపణలతో దారుణంగా హత్య చేసిన ఘటనలపై భారత్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈక్రమంలోనే ఉజ్జయినిలోని రిన్‌ముక్తేశ్వర్ మహాదేవ్ ఆలయ ప్రధాన పూజారి మహావీర్ నాథ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులను వేధిస్తున్నా, అక్కడి ఆటగాళ్లను భారత్‌లో ఆడనివ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అవసరమైతే తమ నాగ సాధువులు స్టేడియంలపై దాడి చేసి మ్యాచ్‌లను అడ్డుకుంటారని స్పష్టం చేశారు. ఇతర పీఠాధిపతులు కూడా ఇదే విధమైన హెచ్చరికలు చేశారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. బంగ్లాదేశ్ నుంచి వేలంలో అమ్ముడైన ఏకైక ఆటగాడు అతడే కావడం గమనార్హం. ఈ పరిణామంపై సోషల్ మీడియాలో కేకేఆర్‌ను బాయ్‌కాట్ చేయాలంటూ ప్రచారం ఊపందుకుంది.



ఈ నెల18న బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలో దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని, 24న రాజ్‌బరీ జిల్లాలో అమృత్ మోండల్ అనే మరో హిందూ వ్యక్తిని మూకదాడుల్లో హత్య చేశారు. ఈ దాడులను ఖండించిన బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి ధీరేంద్ర శా తదితరులు ఉన్నారు.

## బంగ్లాలో ఉద్రికత్తలు..రాక్‌స్టార్ కాన్సర్ట్‌పై మూక దాడి



**ఢాకా, డిసెంబరు 26:** బంగ్లాదేశ్‌లో ప్రముఖ రాకస్టార్ కాన్సర్ట్‌పై మూక దాడి జరిగింది. షో ప్రారంభానికి ముందే కొంతమది ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకువచ్చారు. ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్వాహకులు షోను రద్దు చేశారు. ఈ దాడిలో 20 మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఫరీదాపూర్‌లో ఓ పాఠశాల 185వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ గాయకుడు జేమ్స్ కాన్సర్ట్‌ను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతో సహా వేలాది మంది ఇందులో పాల్గొనేందుకు వచ్చారు. అయితే ఈ కాన్సర్ట్ ప్రారంభానికి ముందు ఉన్నట్టుండి ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకొచ్చారు. భద్రతా సిబ్బంది వారిని ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. కాన్సర్ట్‌కు వచ్చిన వారిపై ఆందోళనకారులు రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. దీంతో పలువురు పాఠశాల విద్యార్థులు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. భద్రతా కారణాల రీత్యా కాన్సర్ట్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆందోళనకారుల దాడి నుంచి గాయకుడు జేమ్స్ త్రుటిలో తప్పించుకున్నారు. ఉద్రిక్తతలు మొదలవగానే భద్రతా సిబ్బంది ఆయనను అక్కడి నంచి తరలించారు. జేమ్స్, ఆయన సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

## అత్యధికంగా భారతీయులను బహిష్కరించిన సౌదీ అరేబియా

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** ఇటీవల అమెరికా నుంచి పెద్దఎత్తున భారతీయుల బహిష్కరణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ యేడాది అత్యధికంగా భారతీయులను స్వదేశానికి డిపోర్ట్ చేసింది సౌదీ అరేబియా! ఈ మేంకు కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ రాజ్యసభకు సమర్పించిన నివేదికతో ఈ విషయం వెల్లడైంది. ఈ డేటాను ఇటీవల అందించగా ఈ సమాచారం తాజాగా బయటకొచ్చింది. 2025లో దాదాపు 24,600 మంది భారతీయులను 81 దేశాలు స్వదేశానికి పంపించాయి. **నివేదికలో కీలక వివరాలు ఇవే:** ఈ యేడాది సౌదీఅరేబియాన 11వేల మందికిపైగా భారతీ యులను వెనక్కి పంపించింది. అమెరికా 3, 800 మందిని భారత్‌కు డిపోర్టుచేసింది. వీరిలో ప్రైవేటు ఉద్యోగులు,విద్యార్థులు కూడా ఉన్నారు. మయన్మార్ 1,591, మలేసియా 1,483, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 1,469 మంది భారతీయులను స్వదేశానికి పంపించాయి. సైబర్ ముఠాల్లో చిక్కుకున్న కేసులకు సంబంధించి మయన్మార్ అనేక మందిని భారత్‌కు పంపించింది. వీరిలో ఎక్కువమంది తెలుగువారు ఉన్నట్లు సమాచారం. వీసా కాలపరిమితి తీరడం లేదా అనుమతుల్లేకుండా ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో గల్ఫ్ దేశాలు ఎక్కువమంది భారతీయులను డిపోర్టు చేశాయి. ఈ బహిష్క రణల్లో విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. ఈ యేడాది యుకె 170మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45మంది భారతీయ విద్యార్థులను స్వదేశానికి పంపించాయి. అమెరికా గత ఐదేళ్లలో ఈసారే అత్యధిక బహిష్కరణలు చోటుచేసుకున్నాయి. ఎక్కువగా వాషింగ్టన్ డిసి నుంచి 3,414 మంది భారతీ యులను డిపోర్టు చేసింది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వలసలపై కఠిన చర్యల నేపథ్యంలో భారతీయులను అగ్రరాజ్యం స్వదేశానికి పంపించిన సంగతి తెలిసిందే. ప్రత్యేక సైనిక విమానాల్లో డిపోర్ట్ చేసింది. ఆ సమయంలో వలసదారుల చేతులు, కాళ్లను బం ధించి తరలించడంపై తీవ్ర వివాదం రాజుకుంది.





కొత్తసంవత్సర వేడుకలవేళ ఢిల్లీలో ఆపరేషన్ అఘాత్..

## 285 మంది అరెస్టు, మరో 500 మంది అదుపులోకి

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** కొత్త సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ, దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు, నేరాలను అరికట్టేందుకు సౌత్‌ఈస్ట్ జిల్లా పోలీసులు 'ఆపరేషన్ ఆఘాత్ 3.0' పేరుతో శుక్రవారం రాత్రి మెరుపు దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా వందల మందిని అరెస్ట్ చేయడంతో పాటు, పలువురిని ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ వివరాలను సౌత్‌ఈస్ట్ డీసీపీ హేమంత్ తివారీ శనివారం మీడియాకు వెల్లడించారు. ఏఎన్ఐ కథనం ప్రకారం, డీసీపీ మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టం, ఎన్డీపీఎస్ చట్టం, గ్యాంబ్లింగ్ చట్టం కింద 285 మంది నిందితులను అరెస్ట్ చేశాం. ముందు జాగ్రత్త చర్యగా 504 మందిని అదుపులోకి తీసుకున్నాం. వీరితో పాటు, నేర చరిత్ర ఉన్న 116 మందిని కూడా పట్టుకున్నామని తెలిపారు. ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలను కూడా డీసీపీ తివారీ వివరించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 10 మంది ప్రాపర్టీ అఫెండర్లను, ఐదుగురు ఆటోలిఫ్టర్లను అరెస్టు చేశాం. వారి నుంచి 21 నాటు తుపాకులు, 20 బుల్లెట్లు, 27 కత్తులను స్వాధీనం చేసుకున్నాం. మొత్తం 12,258 క్వార్టర్ల అక్రమ మద్యం, 6.01 కిలోల గంజాయిని సీజ్ చేశాం. జూదగాళ్ల నుంచి రూ.2,30,990 నగదు, 310 మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నాం. 231 ద్విచక్ర వాహనాలు, ఒక ఫోర్‌వీలర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల సమయంలో ప్రజలకు భద్రత కల్పించేందుకు, నేర కార్యకలాపాలను ముందుగానే నిరోధించేందుకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసు అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలోని నేర ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక నిఘా వర్గాల సమాచారంతో రాత్రంతా ఏకకాలంలో దాడులు, వాహన తనిఖీలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని, ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని సీనియర్‌పోలీస్ అధికారులు తెలిపారు.

## పహాల్గావ్‌కు పోటెత్తిన సందర్శకులు



**పహల్గాంవ్(జమ్ముకశ్మీర్), డిసెంబరు27:** జమ్మూ కశ్మీర్‌లోని సుందరమైన పహల్గామ్‌కు పర్యాటకులు లెక్కకుమించి తరలివస్తున్నారు. కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి శనివారం నుంచే నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి చేరుకుంటున్నారు. ఉగ్రదాడి జరిగిన తర్వాత పర్యాటకులు పూర్తిగా నిలిచిపోయిన పనహల్గాంవ్ మళ్లీ కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా కళకళలాడుతోంది.గత ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించడంతో కశ్మీర్‌లో పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతింది. వేలాది మంది పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. అయితే, ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో నగర జీవితానికి దూరంగా ప్రశాంతంగా గడపాలనుకునే వారు పహల్గామ్‌ను ఎంచుకుంటున్నారు. భద్రతా ఏర్పాట్లపై పర్యాటకులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన ఓ పర్యాటకురాలు మాట్లాడుతూ, నేను నా భర్తతో కలిసి మొదటిసారి కశ్మీర్‌కు వచ్చాను. ఇది నిజంగా చాలా అందంగా ఉంది. ఇక్కడి భద్రతా ఏర్పాట్లు చాలా బాగున్నాయి. మరో పర్యాటకుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొత్తసంవత్సర వేడుకల కోసం కళాశాల విద్యార్థులబృందం కూడా పహల్గామ్‌కు చేరుకుంది. ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగుపడ్డాయి. ఇంతకుముందు శ్రీనగర్ వెళ్లాను, ఇప్పుడు పహల్గామ్‌లో ఉన్నాను. ఇంకా మంచు కురవనప్పటికీ రాబోయే రెండు మూడు రోజుల్లో కురుస్తుందని ఆశిస్తున్నాం. స్థానిక ప్రజలు చాలా సహాయంచేస్తున్నారు" అని ఓ విద్యార్థి చెప్పాడు.

# సంక్షిప్తంగా..

## పన్వేల్ ఫామ్‌హౌస్‌లో సల్మాన్ జన్మదిన వేడుకలు



**ముంబయి, డిసెంబరు 27:** బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ 60వ జన్మదినం ఈ సందర్భంగా తన పన్వేల్ ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్ని హితుల మధ్య పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు సినీ, క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. సల్మాన్ తల్లిదండ్రులు సలీం ఖాన్, సల్మాఖాన్ వేడుక ప్రాంగణం వద్ద కనిపించారు. సోదరులు అర్బాజ్ ఖాన్ తన భార్య షురాఖాన్,వారి నవజాత శిశువుతో కలిసి హాజరుకాగా, సోహైల్‌ఖాన్ కూడా పాల్గొన్నారు. సోదరీమణు లు అర్పితా ఖాన్‌శర్మ, అల్విరాఖాన్ అగ్నిహోత్రి తమ కుటుంబాలతో కలిసి ఈ వేడుకలో పాలుపం చుకున్నారు. ఈ పార్టీకి నటులు సంజయ్ దత్, ఆదిత్య రాయ్ కపూర్, క్రికెటర్ ఎంఎస్ ధోనీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## వెచ్చదనానికి మంటరాజేసి నిద్రించిన కుటుంబం..నలుగురు మృతి




**పాట్నా, డిసెంబరు 27:** చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విషవాయులు వెలువడడంతో ఒక వృద్ధురాలు,ముగ్గురు పిల్లలు మరణించారు.మరో నలుగురిపరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రాజిల్లాలో ఈ సంఘటన జరిగింది.చాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారంరాత్రి వేళ గదిలో వెచ్చదనంకోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలు పులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మండటంతో ఆగదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో ఎనిమిదిమంది స్పృహకోల్పోయారు. శుక్రవారం తెల్లవారు జామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకివెళ్లి చూశారు.ఆగదిలో ఉన్న వారిపరిస్థితి చూసి ఆందోళన చెందారు.



## ట్రయల్ రన్‌లోనే కుప్పకూలిన రోప్‌వే..

**పాట్నా, డిసెంబరు 27:** బీహార్‌లో కొత్తగా నిర్మించిన రోప్‌ఎ ట్రయల్ రన్‌లోనే కుప్పకూలిపోయింది. అక్కడున్న కార్మికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈప్రమాదంతో రోప్‌వే నిర్మాణం నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తాయి. బీహార్‌లోని రోహ్తాస్ జిల్లాలో కొత్తగా రోప్‌వే నిర్మించారు. రోహ్తాస్ బ్లాక్ నుంచి రోహ్తాస్ గఢ్‌కోట, రోహితేశ్వర్ ధామ్ వరకు రోప్‌వే ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో రోప్‌వే ప్రారంభించే ముందు ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే ఒక కేబుల్ చిక్కుకుపోవడంతో ఆరోప్‌వే కూలిపోయింది. ట్రయల్ రన్‌కోసం వినియోగించిన నాలుగు ట్రాలీలు చాలాఎత్తునుంచి కిందపడి ధ్వంసమయ్యాయి.అయితే అందులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు అక్కడ పని చేస్తున్న కార్మికులు కూడా ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు.

## సొంతకుటుంబాన్నే బెదరించిన భారత్ యువకుడి అరెస్టు



**టెక్సాస్, డిసెంబరు 27:** అమెరికాలో భారతసంతతికి చెందిన 22ఏళ్ల విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత కుటుంబ సభ్యులనే బెదిరించడంతో పాటు ఇంటికి నిప్పు పెట్టడానికి ప్రయత్నించాడన్న తీవ్ర ఆరోపణలపై అతడిని అదుపులోకి తీసుకున్నారు. టెక్సాస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో నగరంలో ఈఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుతున్న మనోజ్ సాయిలెల్ల సోమవారం అరెస్ట్ అయ్యాడు. కొన్ని రోజులుగా మనోజ్ మానసిక ఆందోళనతో ఉన్నాడని,తమను బెదిరిస్తున్నాడని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు అతను తాము నివసిస్తున్న ఇంటికి నిప్పు పెట్టేందుకు కూడా ప్రయత్నించాడని వారు ఆరోపించారు.

## కర్ణాటకలో 400కిపైగా ముస్లిం ఇళ్లు కూల్చివేత



**బెంగళూరు, డిసెంబరు 27:** కర్ణాటకలో 200కుపైగా ఇళ్లను అధికారులు కూల్చివేయడంతో సుమారు 400 ముస్లిం కుటుంబాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల బుల్డోజర్ చర్యను ఇక్కడ అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈనెల 22న తెల్లవారుజామున 4 గంటల సమయంలో బెంగళూరు శివారు కోగిలు గ్రామంలోని ఫకీర్ కాలనీ, వాసిం లేఅవుట్‌లోని సుమారు 200కు పైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో నాలుగు జేసీబీలు వినియోగించారు. 150 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఉర్దూ ప్రభుత్వ స్కూల్‌కు ఆనుకుని ఉన్న సరస్సు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరుపై దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం

## ఉద్యోగుల హాజరు, పని తీరుపై పర్యవేక్షణకు జిల్లాకో అధికారి నియామకం

**విజయవాడ.డిసెంబరు 27.ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరుపై దృష్టి కేంద్రీకరించింది. అందుకుగాను క్షేత్రస్థాయి నుంచి సిబ్బంది సమాచారాన్ని సేకరించింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇక తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది.అధికారులు చెప్పారని అనధికార డిప్యుటేషన్లపై ఇతర కార్యాలయాల్లో పని చేయడం క్షేత్రస్థాయి పరిశీలన, పనుల పర్యవేక్షణ పేరుతో బయటకు వెళ్లడం ఇకపై కుదరదు. నిర్దేశించిన సమయంలోగా యాప్‌లో రోజూ హాజరు వేయాల్సిందే. రీ సర్వేలో పాల్గొంటున్న కొందరు సర్వేయర్లకు తప్ప మిగిలిన వారెవరికీ మినహాయింపు లేదు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం తప్పనిసరి అనుకుంటే అధికారుల అనుమతి తప్పనిసరి చేస్తూ రాష్ట్ర సచివాలయాల శాఖ ఈ మేరకు చర్యలను చేపట్టింది. సచివాలయాలపై 3 దశల పర్యవేక్షణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్వరలో పూర్తిస్థాయి అధికారులు రానున్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు జిల్లాకో అధికారిని నియమిస్తున్నారు. ఉమ్మడి 13 జిల్లాల్లో ప్రస్తుతం అధికారులు ఉన్నారు. మరో 13 మంది త్వరలో రానున్నారు. పుర, నగరపాలక, నగర పంచాయతీలకు ఒక్కో అధికారి చొప్పున 123 మందిని కేటాయిస్తారు. మండలానికో అధికారి చొప్పున 660 మంది రానున్నారు. ప్రస్తుతం 600 మంది ఎంపిక పూర్తయింది. మిగిలిన మండలాలకు వచ్చే నెల మొదటి వారంలో అధికారులు రానున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పేరును స్వర్ణ గ్రామం, వార్డుగా మార్చనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు రానున్నాయి. పేరు మార్చాలని కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు . ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. ప్రభుత్వం ఆదేశాలతో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తప్పనిసరిగా విధులకు హాజరయ్యేలా సచివాలయాల శాఖ చర్యలు ప్రారంభించింది. ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో గ్రామ, వార్డు సచివాలయాల పని తీరుపై జరిగిన చర్చలో సిబ్బంది తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న సమాచారంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలన్న సీఎం ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యో గులు పెద్ద సంఖ్యలో అనధికార డిప్యుటేషన్లపై ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్నారు. వీటిని గుర్తించిన సచివాలయాల శాఖ రద్దు చేసింది.



## ఎన్టీఆర్‌రాజు కుటుంబానికి నందమూరి కుటుంబం ఓదార్పు

**తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి సీనియర్ నేత, తిరుమల ఎన్టీఆర్‌రాజు దూరం కావడం బాధాకరమని పలువురుటిడిపి నేతలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ అభిమాని ఎన్టీఆర్‌రాజు దివంగతులు కావడంతో శనివారం తిరుమల లోని ఆయన నివాసగృహంలో ఎన్టీఆర్‌రాజు చిత్రపటానికి నందమూరి రామకృష్ణ, పలువురు నేతలు నివాళులర్పించారు. రాష్ట్రపార్టీ మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మను ఆయన సోదరులను నేతలు ఓదార్చారు.

## రాయచోటిని మదనపల్లిలో విలీనం చేస్తారని ఇద్దరు యువకుల ఆత్మహత్యాయత్నం

**రాయచోటి డిసెంబర్ 27( ప్రభాతవార్త)** రాయచోటిని కొత్తగా ఏర్పాటు అయిన మదన పల్లి జిల్లాలో విలీనం చేస్తారని సమాచారం అందుకున్న ఇద్దరు యువకులు ఆత్మహత్యా యత్నం చేశారు. వివరాలలోకి వెళితే: అన్నమయ్య జిల్లా ప్రధాన కేంద్రమైన రాయచోటిని కొత్తగా ఏర్పడిన మదనపల్లి జిల్లాలో విలీనం చేస్తారని సమాచారం కొన్ని మాధ్యమాలలో వార్తలు రావడంతో రాయచోటికి చెందిన చిన్న ముక్క సురేష్ బాబు, బొట్టు మీదికి చెందిన హసన్ భాష ఆత్మహత్యాయత్నం ఈరోజు చేశారు. పరిస్థితిని గమనించిన వారి కుటుంబ సభ్యులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాయచోటి పట్టణ ప్రజలు వెంటనే ఆసుపత్రికి చేరుకుని ఇంత దారుణమైన నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారని స్థానికులు వారిని ప్రశ్నించగా! మేము అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి చిన్న చిన్న పనులు చేసుకుంటూ, ఆటో తోలుకొని జీవనం సాగిస్తున్నామని మాకు జీవనోపాధి లేకుండా చేసి మా పొట్ట కొట్టద్దని ఎంతోమంది ప్రజలు జీవనోపాధికి నిలయమైన రాయచోటిని విలీనం చేస్తారేమోనని మేము అందుకే ఆత్మ హత్య ప్రయత్నం చేశామని వారు తెలిపారు. ఈ పరిస్థితి తెలుసుకున్న ప్రజలంతా రాయచోటి ముద్దు మదనపల్లి వద్దు అనే నినాదాలతో హాస్పిటల్ ప్రాంగణమంతా మారు మ్రోగిపోయింది. ఈ విషయమై స్పందించిన రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పందిస్తూ ప్రజలు ఎలాంటి దుర్ఘటనలకు పాల్పడొద్దని కొంతమంది తెలిపారు.

# దుర్గమ్మ ఆలయం కరెంట్ బిల్లుపై ఇఓ చర్చలు

**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** శ్రీ దుర్గమ్మవారి ఆలయానికి విద్యుత్‌శాఖ కరెంట్ కట్ చేసిన సంఘటనపై ఇఓ వికె శీనా నాయక్ శనివారం విద్యుత్ శాఖాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ దేవస్థానం నుండి విద్యుత్‌శాఖకు సోలార్ విద్యుత్‌ను అందిస్తున్నామని, ఆ బిల్లులు విద్యుత్ శాఖ దేవస్థానానికి చెల్లించాల్సి వుందని, ఆ మేరకు తాము అధికారులతో చర్చించామన్నారు. - దుర్గమ్మవారి సేవలో హోంమంత్రి: దుర్గమ్మ వారిని శనివారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం దర్శించుకున్నారు. మంత్రికి కలెక్టర్, ఇఓ, ఛైర్మన్, పాలకమండలి, దుర్గమ్మవారి చిత్రపటం,ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. - నిత్యాన్న దాన పథకానికి విరాళం: దుర్గమ్మ వారి ఆలయంలో జరిగే ఉచిత ప్రసాదపంపిణీ పథకానికి హైదరాబాద్‌కు చెందిన పి కళ్యాణి రు.1లక్ష విరాళాన్ని శనివారం అందించారు. అలాగే గన్నవరంకు చెందిన చిట్టి ఉమామహేశ్వరి రు.1,23,456ల విరాళం నిత్యాన్న దాన పథకానికి విరాళంగ అందిం చారు. దాత లకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం,ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. - ఇఓను కలిసిన నూతన సిఐ : దుర్గమ్మ వారి ఆలయ ఇఓ వికె శీనా నాయక్‌ను విజయవాడ వన్‌టౌన్ సిఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన గుణరాము.



హోం మంత్రి అనితకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# ఆత్మ నిర్భర్ భారత్‌గా దేశం అభివృద్ధి పథంలో సాగుతోంది

## ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యురాలు డా. శామిక రవి

**తిరుపతి విద్య, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** సమగ్రవికాసానికి భారతీయ చింతన" అనే భావనతో డిసెంబర్ 26 నుండి 29 వరకు నాలుగు రోజుల పాటు దేశంలోని 32 రాష్ట్రాలనుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1250 మంది ప్రతినిధులతో జరుగుతున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం రెండవరోజు కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. వికసిత భారత్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్ అనే ప్రత్యేక చర్చా సదస్సుకు ఐఐటి తిరుపతి ఆచార్యులు ప్రొఫెసర్ ఏటూరు కాళిదాసు సమన్వయకర్తగా వ్యవహరించగా ఆచార్య విద్యాసాగర్ ఐఐటి తిరుపతి, ఆచార్య అర్ణబ్ భట్టాచార్య ఐఐటి కాన్పూర్, డాక్టర్ మోహన్ రాఘవన్ ఐఐటి హైదరాబాద్, ఆచార్య అలోక్ ఆర్. చతుర్వేది పర్డ్యూ యూనివర్సిటీ పానలిస్టులుగా పాల్గొన్నారు.డా. జయంత్ వసంత్ జోషీ నిర్వహించిన సైన్స్ మ్యాజిక్ షో విద్యార్థులలో కొత్త ఆలోచనల్ని రేకెత్తించింది. విజ్ఞానశాస్త్రంలోని విశేషాలను ప్రాయోగికంగా వివరిస్తూ జరిగిన ఈ మ్యాజిక్ షోలో పలు ప్రాంతాలలోని విద్యాసంస్థల నుండి విచ్చేసిన విద్యార్థులు ఆసక్తితో పాల్గొన్నారు.ఈ సమ్మేళనంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యురాలు డా. శామిక రవి విశిష్ట ప్రసంగంలో భారతదేశం యొక్క ఆర్థిక ప్రగతిని ప్రామాణికమైన గణాంకాలతో వివరించారు.30 కోట్ల మంది ప్రజలు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకొని పేదరికం నుండి బయటపడ్డారని, ప్రసవ మరణాలు, శిశుమరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. అలాగే స్వయం సమృద్ధి కలిగిన ఆత్మ నిర్భర్ భారత్ గా భారతదేశం అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందని అన్నారు. దిగుమతులు, ఎగుమతులు, నిరుద్యోగం, సంపద పంచడం వంటి పలు ఆర్థిక, సామాజిక అంశాలపై డా. శామిక రవి సాధికారికంగా వివరించారు.ఓపెన్ సైన్స్ పబ్లిషింగ్: ఓపెన్ సైన్స్ ఎకో సిస్టమ్ ఫర్ భారతీయ జర్నల్ పబ్లిషింగ్ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భారతీయ పరిశోధన పత్రాల ప్రచురణ, ప్రామాణికత గురించి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు మాట్లాడారు.సంప్రదాయ వైద్యపద్ధతుల పరిశోధన అనే ప్రత్యేక సదస్సుకి, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య, వైద్య విద్య కుటుంబ సంక్షేమ మంత్రి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వైద్య వారసత్వానికి ప్రామాణికత చేకూర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సుశ్రుతుడు, చరకుడు వంటి మహర్షు అందించిన వైద్యవిధానం చాలా గొప్పదని అన్నారు. మహర్షులు రంగరించి మేళవించి అందించిన వైద్య విధానంలో ఉన్న విశేషాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంప్రదాయ వైద్యవిధానంలో ప్రజలకు చికిత్స చేస్తున్న సంప్రదాయవైద్యులను అభినంగించారు. ఆంధ్రప్రదేశ్ ఆయుష్ కోసం 200 కోట్లు కేంద్రప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆయుష్ కు సంబంధించిన వైద్యుల నియామకాలను కూడా త్వరలో పూర్తి చేయనున్నామన్నారు. కూడా ఔషధమొక్కల పెంపకం , సంరక్షణ విషయంలో దృష్టి సారించనున్నాము అన్నారు. అలాగే సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ అండ్ నాచురోపతి ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మంత్రి సంప్రదాయవైద్యులు తెచ్చిన ఔషధ మొక్కల్ని , మూలికల్ని చాలా ఆసక్తితో వీక్షి ంచి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజ్ఞానభారతి అఖిల భారత సంఘటన మంత్రి డా. శివకుమార్ శర్మ మాట్లాడుతూ ప్రాచీన ఆధునిక విజ్ఞానాలు పరస్పర పరిపోషకాలు, పూరకాలు కావాలని ఆకాక్షి ంచారు. సంప్రదాయ వైద్యపద్ధతుల్ని గ్రంథస్థం చేసి వాటికి ప్రామాణ ికత చేకూరేలా చెయ్యాల్సిన



యర్రావారిపాలెం ( తిరుపతి జిల్లా), డిసెంబర్ 27,

## వాహనంతో సహా 6 గురు

# ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

**యర్రావారిపాలెం ( తిరుపతి జిల్లా), డిసెంబర్ 27, ప్రభాతవార్త:** వాహనంతో సహా 6 మంది ఎర్రచందన స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు భాకరాపేట రేంజ్ అటవీ క్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వి. సాయిబాబా ఆదేశాల మేరకు శనివారం రాత్రి దీన్నెల అటవీ పరిసర ప్రాంతాల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు రేంజ్ సిబ్బంది, బేస్ క్యాంపు, స్ట్రైక్ ఫోర్స్ ప్రొటెక్షన్ వాచర్స్, తలకోన నార్త్ బీట్ పరిధిలో వి.ఆర్.కాలనీ దగ్గర కాపు కాశారు. అయితే శనివారం తెల్లవారు జామున అనుమానిత కారు రావడం గమనించి కారును ఆపడానికి ప్రయత్నించగా, కోటకాడపల్లి దీన్నెల రోడ్డు మధ్యలో వి.ఆర్.కాలనీ దగ్గర కారును వదిలి కొందరు వ్యక్తులు పారిపోవడానికి గుర్తించడం జరిగిందన్నారు. కారు నుండి స్మగ్లర్లు పారిపోవడానికి ప్రయ్నతించగా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాధాకుమార్, శక్తీవేల్ ముత్తు, బాబు దొరైరాజ్, కె.శక్తీ, శివకుమార్ సెంజి, అనుమన్ లను సిబ్బంది చుట్టుముట్టి పట్టుకొని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారితో పాటు కారును, 6 ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. జరిగిందన్నారు. వీటి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందన్నారు. వారిలో ఒకరు పారిపోయారని, గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ బి.మునిస్వామి నాయక్, ఎఫ్ బి ఓలు వై.రాజేష్ కుమార్, జి.ప్రదీప్, జే.బి. నిఖిల్, ఎం. సదా శివయ్య, సి.రవి, డ్రైవర్ హెచ్.శంకర్, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

# అలిపిరిలో టిటిడి భూములపై కార్పొరేట్ దాడి

**- ఢిల్లీలో రిమోట్.. అలిపిరిలో లూటీ - ఒబెరాయ్ హోటల్ కేటాయింపును రద్దు చేయాలి - సిపిఐ జాతీయ నేత నారాయణ**



**తిరుపతి,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి అలిపిరి సమీపంలో టీటీడీ భూములను కార్పొరేట్ హోటల్‌కు కేటాయించడం ఘోర అపచారమని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె. నారాయణ తీవ్రంగా విమర్శించారు. ఒకప్పుడు దేవస్థానం భూములను కాపాడిన ఫలితంగానే ఇప్పుడు అవి విద్యాలయాలకు, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు. అలాంటి భూమిని ఇప్పుడు సాంకేతిక ముసుగులో కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. శనివారం ఉదయం తిరుపతి అలిపిరి సమీపంలోని దేవలోక్ వద్ద ఒబెరాయ్ హోటల్‌కు కేటాయించిన భూమిని సారాయణ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించి, తమ అభ్యంతరాలను స్పష్టంగా వెల్లడించారు. ఈ స్థలం పూర్తిగా టీటీడీ పరిధిలోదేనని, నేరుగా ఇవ్వలేక టూరిజం లేదా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఇచ్చినట్లు చూపించి, అక్కడి నుంచి ఒబెరాయ్ హోటల్ గ్రూప్‌కు సుమారు 25 ఎకరాలు కేటాయిస్తున్నారని ఆరోపించారు. దేవస్థానానికి చెందిన భూమిలో స్టార్ హోటల్ ఎలా కడతారని ప్రశ్నించారు. స్టార్ హోటల్ అంటే పబ్‌లు, బార్లు, మాంసాహారం ఉంటాయని, ఇలాంటి వాటిని దేవుడు ఒప్పుకుంటాడా అని వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం తీసుకునే హక్కు టీటీడీ బోర్డుకు ఉందా లేక రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఉందా? అని నారాయణ ప్రశ్నించారు. దీనికి అసలు రిమోట్ కంట్రోల్ ఢిల్లీలో ఉందని తమకు స్పష్టమవుతోందని, ఢిల్లీ కార్పొరేట్ కంపెనీల అధిపతులు, వారికి మద్దతుగా ఉన్న ప్రధాని, హోం మంత్రి సంబంధం లేకుండా ఇలాంటి నిర్ణయాలు జరగవని విమర్శించారు. చంద్రబాబు నాయుడు తిరుపతిలోనే చదువుకుని, ఈ ప్రాంతాన్ని బాగా తెలిసిన వ్యక్తి అని గుర్తు చేసిన నారాయణ, దేవుడిపై నిజమైన భక్తి ఉంటే ఇలాంటి పవిత్ర భూమిని కార్పొరేట్ హోటల్‌కు ఇచ్చే ఆలోచన రాదని అన్నారు. ఇంత విలువైన భూమి ఇక్కడే ఉండగా, పేదలకు మాత్రం 40-50 కిలోమీటర్ల దూరంలో సౌకర్యాలు లేని స్థలాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ హోటల్‌కు కేటాయించిన భూమిలో పేదలకు ఇళ్లు కట్టించి ఉంటే నిజంగా మానవ సేవే మాధవ సేవగా నిలిచేదని వ్యాఖ్యానించారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇలాంటి ప్రయత్నం జరిగితే, టీడీపీ, భక్తులు, ప్రజలు వ్యతిరేకించారని నారాయణ గుర్తు చేశారు. అప్పుడు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆ నిర్ణయాన్ని రద్దు చేయడంతో తాము స్వాగతించామని తెలిపారు. ఇప్పుడు పేరు మార్చి మళ్లీ అదే నిర్ణయం తీసుకోవడం విడ్డూరమన్నారు.

# సామాన్యుడికి 'వైకుంఠం' నిరాశే!

## - నేరుగా కొండకు వస్తే ఆలయంలోనికి నో 'వే'!

**తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలోపల పవిత్రమైన వైకుంఠవాకిలి ప్రవేశ దర్శనం సామాన్యభక్తులకు నిరాశే కలిగించనుంది. రోజువారీగా సాధారణ సర్వదర్శనం కల్పించే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పవిత్రమైన తొలిమూడురోజులు 30,31,జనవరి 1న సర్వదర్శనాలను పూర్తిగా రద్దుచేయడంతో టోకెన్ లేని భక్తులకు మోక్షమార్గం దర్శనం లేనట్లే. ఇప్పటికేతెలుగురాష్ట్రాలనుండేగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, కేరళరాష్ట్రాల నుండి భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు. ఈ భక్తులకు నేటి నుండి ఎటువంటి దర్శన టోకెన్లుగానీ, టిక్కెట్లు గానీ అందుబాటులో ఉండవు. వీరంతా ఆలయంలోపలకు వెళ్ళే అవకాశం లేకపోతుంది. మరీ 29,30,31రోజుల్లో తిరుమలకు తరలివచ్చే భక్తులు ఆలయం ముందు అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకుని వెళతారా లేక ,రకరకాల ఏర్పాట్లు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దిన వైకుంఠ అలంకరణలు తిలకించి తిరుగుప్రయాణమవుతారా అనేది చూడాల్సి ఉంది. గత రెండు రోజులుగా వారాంతం వరుససెలవులతో తిరుమలకు భారీగా భక్తులు చేరుకున్నారు. టోకెన్లు లేని భక్తులు సర్వదర్శనంలో వస్తున్నారు. మరీ ఇదీ నిలుపుదలచేస్తే పరిస్థితి ఊహించలేనిదే. మరీ ఆన్‌లైన్‌లో ఇ డిప్‌లో జారీచేసిన టైమ్‌స్లాట్ టోకెన్లు అందుకున్న భక్తులే 30,31,జనవరి 1న ఆలయంలోపలకు చేరుకుని మోక్షమార్గం వైకుంఠద్వారంలో స్వామివారిని దర్శించుకోగలరనేది ఇప్పటికే ప్రచారం. టోకెన్లులేని భక్తులు పరిస్థితి అర్థం చేసుకోవాలనేది టిటిడి వర్గాల విజ్ఞప్తి. వైకుంఠవాకిలి దర్శనాలకు తమిళనాడు నుండి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఆన్‌లైన్‌లో ఇ డిప్‌లో ఈ టోకెన్లు అందుకోలేని భక్తులు సాధారణరోజుల్లాగే తిరుమలకు చేరుకుంటే మాత్రం పరిస్థితి అర్థం చేసుకోలేనిది. వైకుంఠం-2క్యూకాంప్లెక్స్‌లో అనుమతించకపోతే పరిస్థితి తెలుస్తుంది.

# నూతన సంవత్సరాదిన భక్తులందరికి సంతృప్తికర దర్శనం

**- అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ సుమిత్‌కుమార్**

**కాణిపాకం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో 2026 నూతన సంవత్సరాదికి సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించే విధంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కాణిపాకం దేవస్థానంలో నూతన సంవత్సరాది ఏర్పాట్లపై స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ ఎస్పీ తుషార్ డూడి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లతో కలసి వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో నూతన సంవత్సరాది సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశమున్నట్లు తెలిపారు. ఆలయ దర్శనార్థం తరలివచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమ్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, కంట్రోల్ రూం ఏర్పాటు, పారిశుద్ధ్యం, మెడికల్ క్యాంప, విద్యుత్ సరఫరా, వంటి వాటి గురించి ఆయా శాఖలు సమర్ధవంతంగా పనిచేయాలన్నారు. అలాగే అత్యవసర పరిస్థితులను దృష్టిలో వుంచుకుని అంబులెన్స్‌లను, అగ్నిమాపక శకటాలను సిద్ధంగా వుంచుకోవాలని ఆదేశించారు. అలాగే కాణిపాకం పరిసరాల్లోని రోడ్లుకు మరమ్మత్తులు చేయించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ నూతన సంవత్సరాది రోజున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలాగే చిత్తూరు డీఎస్పీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ నూతన సంవత్సరాది సందర్భంగా సుమారు 60 నుండి 70 వేల మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నట్లు తెలిపారు.



బ్రహ్మోత్సవాలపై జరిగిన అధికారుల సమన్వయ కమిటి సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

# తిరుమల వెంకన్నకు వైసిపి ముఠా ద్రోహం

**- ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్**




**గుంటూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా.. పది రోజులు ఏకాదశి దర్శనాలు సవ్యంగా జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముగ్గురు వ్యక్తులతో కమిటీ వేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత ఏర్పాట్లు పరిశీలించారని తెలిపారు. భక్తుల చాటున వైసీపీ ముఠా తిరుమలకు వచ్చి తప్పుడు వదంతులు వ్యాప్తి చేస్తారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తిరుమలలో ప్రశాంత వాతావరణం ఉందని.. అలాంటిది ఏం జరగలేదని వివరించారు. ఫేక్ ప్రచారాలకు వైసీపీ కేరాఫ్ అడ్రాస్ గా మారిందని విమర్శించారు. తాడేపల్లి పెద్ద జగన్మోహన్ రెడ్డి ఇలాంటి ఫేక్ ఆర్టిస్టులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. గతంలో కాకినాడ వైసీపీ కార్యకర్త ఇలానే తప్పుడు వదంతులు సృష్టించారని పేర్కొన్నారు. టీటీడీ గురించి వైసీపీ చేస్తోన్న తప్పుడు ప్రచారాలను భక్తులు ఖండించాలని సూచించారు.

# ఆ మాటలు విత్‌డ్రా చేసుకొంటున్నా..

**నేనిచ్చిన సలహాలో తప్పేమీ లేదు..**

**మహిళా కమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా**

**నాకు బాగా కావాల్సిన వారే ఇంత కుట్ర చేస్తారనుకోలేదు**

**మహిళల పట్ల చులకనగా ఏమీ మాట్లాడబోను: నటుడు శివాజీ**

**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 27, ప్రభాతవార్త:** తనకు కావల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అను కోలేదని నటుడు శివాజీ అన్నారు. దండోరా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో ఆయన ఒక వీడియో లో క్షమాపణ కూడా చెప్పారు. ఈ క్రమంలో నటుడు శివాజీ కి మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసారంటూ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యారు.శివాజీ మహిళల వ్యాఖ్యల అంశంలో వివరణ ఇచ్చారు. మహిళల పట్ల జాగ్రతతగా మాట్లాడాలని కమీషన్ సూచించింది.దాదాపు 3గంటల పాటు విచారించిన మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద విచారణ అనంతరం ఆయన నుంచి వివరణ పత్రం తీసుకుని పంపిం చారు.కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద అడిగిన వాటికి సమాధానం చెప్పానని వెల్లడించారు.ఇకపై మహిళల పట్ల చులకనగా మాట్లాడబోనని శివాజీ తెలిపారు. విచారణ అనంతరం శివాజీ మాట్లాడుతూ నేను ఏం తప్పు చేసానని నా మీద ఇంత కోపం.మీ అమ్మా,నాన్న మీ ఇంట్లో మీకు జాగ్రత్తలు చెప్పారా. ఎవరు ఎలాంటి దుస్తులు వేసుకుంటే నాకేంటి.ఎవరి దుస్తు లు వారి ఇష్టం.ఇంతకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా.వారి మీద కూడా ఇలాగే మాట్లాడారా. సినిమా ప్రమోషన్ కోసం అని కూడా కొందరు ప్రచారం చేస్తున్నారు.దండోరా ఈవెంట్‌లో నేను చేసిన కామెంట్స్‌కు కమీషన్ నాకు నోటీసులు ఇచ్చింది.నా వ్యాఖ్యల వల్ల బాధపడ్డ వారి తరుపున కమీషన్ ప్రశ్నలు అడిగింది.వాటికి నేను సమాధానం చెప్పా. నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇట ీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడ ేటప్పు డు తప్పులు దొర్లాయి. నాపైన కుట్ర జరుగుతుందని, ఆరోపిం చారు. తనతో పాటు సినిమా కెరియర్ ప్రారంభిం చిన వారే ఇదంతా చేస్తున్నారని తెలి పారు. వ్యాఖ్యలు చేసిన తర్వాత ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకున్నా రని చెప్పారు.తనకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు.శివాజీ తప్పు చేసాడు అనుకుంటే రండి మాట్లాడుకుందాం. నేను అనవసరంగా సలహాలు ఇచ్చాను.భారతదేశంలో కుటుంబ వ్యవస్థ అత్యంత గోప్యంగా ముందుకు వెళ్తుంది.ఎవరి హక్కులకు భంగం కలిగినా రక్షించే వ్యవస్థలు ఉన్నాయి.సలహాలు ఇవ్వడం మాను కోవాలని నాకు అర్థమైంది. కమీషన్ అడిగిన వాటికి సమాధానం చెప్పాను.ఇంకా వివరణ ఇవ్వాల్సి వస్తే మళ్లీ కమీషన్ ముందుకు వస్తా. వాళ్లకు నచ్చని ఆ మాటలను వెనక్కి తీసుకుంటున్నా.ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేద్దాం. సినిమాలు రాకపోతే నేను రైతు బిడ్డను వ్యవసాయం చేసుకుని బతుకుతా. నాది రైతు కుటుంబం.నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు.ఎవరి బెదిరింపులకు నేను భయపడను. ఆత్మాభిమానం చంపుకొని అస్సలు బతుకను.అదే సమయంలో వ్యవస్థలను నేనుండే చిత్ర పరిశ్రమను గౌరవించకుండా విలువల్లేని బతుకు కూడా బతకడం లేదు.ప్రతి ఒక్క దానికి కాలమే సమాధానం చెబుతుంది. నాగబాబు గారు ఏమన్నారో చూడలేదు. అందరికీ నచ్చే విధంగా ఎవరూ మాట్లాడలేరు.ఈ భూమ్మీద ఎవరినీ ఎవరూ సంతృప్తి పరచలేరు. యథార్థ వాది లోక విరోధి అని శివాజీ అన్నారు.



మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు క్షమాపణ పత్రాన్ని అందజేస్తున్న నటుడు శివాజీ

# డ్రగ్స్ కేసులో రకుల్‌ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్‌సింగ్ పరార్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కేసు కలకలం రేపింది. ఇప్పటికే పలువురు సినీతారలు మాదకద్రవ్యాల కే సులో నిందితులుగా వుండి కోర్టుల చుట్టూ తిరుగుతుండగా మరికొందరు పరారీలో వుండడం లేదా ఆత్మహత్యలకు పాల్పడడం తెలిసిందే. తాజాగా హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్ డ్రగ్స్ కేసులో నిందితుడు.

# దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరూ నమ్మరు

### బిజెపి ఎంపి రఘునందన్‌రావు



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 27:** దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ పేరు లేకుంటే నకిలీ గాంధీలకు మనుగడ ఉండదని భయపడుతున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీపై సోనియాగాంధీ కుటుంబానికి చిత్తశుద్ధి ఉంటే వారి హయంలో గాంధీ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాల శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 150 పథకాల్లో రెండు, మూడు పథకాలు మాత్రమే కాంగ్రెస్ గాంధీ పేరు పెట్టిందని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే హింసపై కాంగ్రెస్ కనీసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. 'తండ్రి ఈవీఎంలు ప్రవేశపెడితే కొడుకు దాన్ని వ్యతిరేకిస్తాడు. మీరు గెలిస్తే ఈవీఎంలు పని చేస్తున్నట్లా.. మేము గెలిస్తే పని చేయనట్లా?. ఇదెక్కడి సంస్కృతి ? రాహుల్ గాంధీకి తండ్రి అంటే గౌరవం, విశ్వాసం లేదు అని రఘునందన్‌రావు పేర్కొన్నారు.. ముక్కలైన కాంగ్రెస్.. దేశాన్ని ముక్కలుగా చేయాలని చూస్తోందన్నారు. 'గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్‌లకు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇంకెవరికి పైసలు ఇవ్వదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రూపాయి అందడం లేదు. లోకల్ అడ్మినిస్ట్రేషన్ అనే పదానికి అర్థం లేకుండా కాంగ్రెస్ చేసింది' అని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. మల్లికార్జున ఖర్గే ముందు.. మీ సొంత రాష్ట్రంలో పంచాయతీ చూసుకోండి. అక్కడ రేపు ఎన్నికలు వస్తే ఏమవుతుందో అది చూసుకోండి అని రఘునందన్ రావు విమర్శించారు.

బావ, బామ్మర్దులతో అవ్వట్లేదని కేసీఆర్‌ను బయటకు తెచ్చారు. కేసీఆర్ బయటకు వచ్చిన తెలంగాణ రాజకీయంలో ఎలాంటి ప్రభావం ఉండదు. డబ్బులు ఉన్నాయి కాబట్టి సభలు పెడుతున్నారు. డబ్బులు పెట్టిన జూబ్లీహిల్స్, కంటోన్మెంట్‌లో ఏమి జరిగిందో అదే అవుతాది తప్ప ఒరిగేదేమీ లేదు. ఇంట్లో పంచాయితీతో బీఆర్ఎస్ ప్రమాదంలో పడింది. అందుకే కేసీఆర్‌ను బయటకు తెచ్చారు. 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాతో చెప్పిన మాటలు నిజం. మా నాయకుడు మాతో మాట్లాడితే దానికి బ్రేకింగ్‌లు, ట్రోలింగ్‌లు ఎందుకు..?. మోదీ తమను ఒక్కసారి మజ్లిస్‌తో కంపేర్ చేయడం అనేది వాస్తవం. మా లీడర్ల ఇంట్లో మేము భోజనానికి వెళ్తే తప్పు ?. ఎంపీ అరవింద్ కొత్త ఇల్లు కట్టారని.. భోజనానికి పిలిచారు. అలా ఏదైనా వేడుక ఉంటే అందరం కలుస్తాం' అని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## సుదూరంగా టెట్ పరీక్షా కేంద్రాల కేటాయింపు

### ఇబ్బంది పడుతున్న అభ్యర్థులు: టిఎస్‌యుటిఎఫ్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే జనవరి 3 నుండి 20 వరకు జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్) కేంద్రాలను సుదూరంగా కేటాయించారని టిఎస్ యుటిఎఫ్ మండిపడింది. టెట్ పరీక్షలు రాయాల నుకునే వారు సుమారు 2 నుండి 3 వందల కిలోమీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాల్సి వస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు నిర్మల్ నుండి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నుండి హైదరాబాద్, హైదరాబాద్ నుండి ఖమ్మం కేటాయించారని అన్నారు. టెట్ అధికారులు ఏ ప్రాతిపదికన పరీక్షా కేంద్రాలు కెటాయించారో తెలియటం లేదని, కానీ అభ్యర్థులు మాత్రం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్లు రెండేళ్ళలో టెట్ పాస్ కావలసి ఉన్నందున ఈ సారి పెద్ద సంఖ్యలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మౌలిక నిబంధనలు 9(6) సబ్ క్లాజ్ బి(3) ప్రకారం శాఖాపరమైన పరీక్షలకు హాజరయ్యే ఉద్యోగులకు పరీక్షతోపాటు ప్రయాణ కాలాన్ని ఆన్ డ్యూటీగా పరిగణిస్తారని.. కనుక టెట్ రాసే ఉపాధ్యాయులకు కూడా పరీక్ష, ప్రయాణ సమయాన్ని ఆన్ డ్యూటీగా మంజూరు చేయాలని, ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు.

## జిఒ 252ను సవరించాలి

### జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 252ను సవరించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 252 జీవో ద్వారా జర్నలిస్టులను వర్గీకరించాలని భావించిందని, రిపోర్టర్లకు అక్రెడిటేషన్, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. దీంతో సాధారణ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులతోపాటు చిన్న, మధ్యతరహా పత్రికలు అక్రెడిటేషన్లను కోల్పోతుండటంతో వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులు నష్టపోతున్నారని అన్నారు. వెంటనే జీవోను సవరించి, అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, చిన్న మధ్యతరహా పత్రికలను అదుకోవాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమం లేదని, ఆరోగ్య బీమా అమలు కావడంలేదన్నారు. హెల్త్ కార్డులపై కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందడంలేదన్నారు. మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు పరిహారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపులో, విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరి కట్టడంలో తీవ్ర జాప్యం చేస్తుందని.. ఈ నేపథ్యంలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో జర్నలిస్టుల సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని, తక్షణమే జర్నలిస్ట్ సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వైద్య, ఆరోగ్య శాఖలోని సుదీర్ఘ సమస్యలను పరిష్కరించాలి

### టివివిపిలో పనిచేస్తున్న వైద్యులకు రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలి

### ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం(టిజిజిడిఏ) డిమాండ్ చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న వైద్యులకు రెగ్యులర్‌గా వేతనాలు అందేలా చూడాలని, శాఖలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్) అమలు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టరన నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఎంకె రౌఫ్ డిమాండ్ చేశారు. టిజిజిడిఏ ప్రతినిధులు శనివారం కోఠిలోని డిహెచ్ కార్యాలయం దగ్గర మీడియాతో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలోని ప్రధాన డిమాండ్ల గురించి మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి)లో పనిచేస్తున్న వారిలో ఈ రోజు(శనివారం) వరకు కూడా కొంతమంది ఉద్యోగులకు జీతాలు అందలేదన్నారు. ఇందుకు టివివిపి కమిషనర్, ఫైనాన్స్ విభాగం వ్యవహరిస్తున్న తీరే కారణమన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం టివివిపిని డిఎస్‌హెచ్‌గా మార్పు చేయడమేనన్నారు. అందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఎస్‌సిఐ కమిటీ ఇప్పటికే ఆర్థిక, న్యాయపరమైన అడ్డంకులు ఏవీ లేవని స్పష్టంగా పేర్కొంటూ సానుకూల నివేదికను సమర్పించిందని...అయినప్పటికి ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. సోమవారం నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో టివివిపి-డిఎస్‌హెచ్ బిల్లును తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని టిజిజిడిఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎస్‌హెచ్ సంబంధిత రీడిప్లాయ్‌మెంట్, టివివిపి ప్రమోషన్లు పూర్తిగా నిలిచిపోయాయని.. వాటన్నింటినీ తక్షణమే పరిష్కరించాలన్నారు. టివివిపి కమిషనర్ చురుకుగా స్పందించి సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలన్నారు. పెరిఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్ కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని మెడికల్ కాలేజీల్లో పెరిఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. తద్వారా అధ్యాపకులు చేరేందుకు ప్రోత్సాహం లభిస్తుంది. వైద్య, ఆరోగ్య శాఖలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఏఎస్)ను కఠినంగా అమలు చేయాలని, .ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ సీఏఎస్ ప్రమోషన్ ఆర్డర్లు వెంటనే జారీ చేయాలన్నారు. నిమ్స్ పే స్కేల్స్‌ను అమలు చేయాలన్నారు. జీవో 142ను సవరించాలన్నారు.

డిపిహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ విభాగంలో జీవో 142 సవరణను వెంటనే అమలు చేయాలని ఇది చాలా కాలం క్రితమే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి అంగీకరించారని గుర్తు చేశారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు (ఏవో)లకు అత్యధిక అధికారాలు అప్పగించడం నిలిపివేయాలని, ఇది వైద్య వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని టిజిజిడిఏ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వం దృష్టికి తీసు కొచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే.. భవిష్యత్ కార్యాచరణను ప్రకటించక తప్పదని టిజిజిడిఏ అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ హెచ్చరించారు.

## నిమ్స్‌లో యూరాలజీ విభాగంలో సబ్‌స్పెషాలిటీ క్లినిక్‌లు



నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 27, ప్రభాతవార్త:** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో మూడు సబ్ స్పెషాలిటీ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొ.నగరి బీరప్ప తెలిపారు. యూరాలజీ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగంలో యూరోఆంకాలజీ, రీనల్ ట్రాన్స్ ప్లాంటేషన్, పీడియాట్రిక్ యూరాలజీ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ క్లినిక్‌లు యూరాలజీ విభాగాధిపతి డా. రాహుల్ దేవర్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుండి ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పెషాలిటీ బ్లాక్ 6వ అంతస్తులోని యూరాలజీ విభాగంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవల ద్వారా మూత్ర సంబంధిత క్యాన్సర్ వ్యాధులు, కిడ్నీమార్పిడి చికిత్సలు, పిల్లల యూరాలజీ సమస్యలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని, ప్రజలకు నాణ్యమైన, వైద్యసేవలు మరింత సులభంగా అందుతాయని డాక్టర్ బీరప్ప తెలిపారు.

## రైతులకు రూ.100 కోట్ల మైక్రో సబ్సిడీ పెండింగ్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పథకానికి సంబంధించి రైతులకు సబ్సిడీ పెండింగ్‌లో పడింది. దాదాపు 100 కోట్ల రూపాయల మేర బకాయిలు ఉన్నట్లు సమాచారం. మైక్రో ఇరిగేషన్ పథకం కింద ఎకరం డ్రిప్ ఏర్పాటుకు 60 వేల రూపాయలు, స్ప్రింక్లర్‌లకు రూ. 50 వేల రూపాయల చొప్పున సబ్సిడీ కింద రైతులకు అందాల్సి ఉంటుంది. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు నాలుగేళ్లుగా 20వేల ఎకరాలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలియవచ్చింది. కాగా 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ప్రతి జిల్లా నుంచి వేలాది మంది రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్నారు. వీటి సబ్సిడీ కోసం ఉద్యాన శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇక 2025-26 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 45వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పాత బిల్లులు రాకపోవడంతో కొత్త యూనిట్ల మంజూరు ఇవ్వడానికి ఉద్యాన శాఖ అధికారులు వెనుకాడుతున్నారు.

## ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి యువకుడు ఆత్మహత్య



రవీందర్ (ఫైల్)

**హైదరాబాద్ (జీడిమెట్ల), డిసెంబరు 27, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ (24) తాను ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడి పెట్టి మోస పోయానని వీడియో రికార్డ్ ద్వారా తెలియజేశారు. తన చావుకు ఎవరు బాధ్యులు కాదని, సూరారం లోని తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబ్లీలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గుజ్జ కృష్ణ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఆర్.కృష్ణయ్య, మండలి ప్రతిపక్ష నాయకుడు ఎస్.మధుసూదనాచారి, చిరంజీవులు తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త :** స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో పూర్తి నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అసెంబ్లీలో ఆవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అఖిల పక్షపార్టీలు, బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పా ర్టీల బిసి నాయకులు బిసి రిజర్వేషన్ల కోసం పోరాటానికి కలిసి రావాలని పిలుపునిచ్చింది. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నగ రంలో అఖిల పక్ష బీసీ సంఘాలు, కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, శాసన మండలి ప్రతిపక్ష ఎస్.మధుసూదనాచారి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రిటైర్డు ఐఎఎస్ అధికారి, బీసీ నేతలు చిరంజీవులు, గుజ్జ కృష్ణ, అనంతుల రామూర్తిగౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై ఆసెంబ్లీ సమావేశాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీ నేతలు బీసీ రిజర్వేషన్ల సాధనకై ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చి సర్పంచ్ ఎన్నికల్లో పూర్తిగా తగ్గించి బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణం పాఠం చెప్పాలని అన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన లెక్కలు బయటపెట్టాలని అన్నారు. జడ్పిటీసీ, ఎంపిటీసీ ఎన్నికలు 42 శాతం బీసీ రిజర్వేన్లతోనే జరపాలని అన్నారు. బీసీ రిజ ర్వేషన్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ విజిఆర్ నారగోని, బిసి విద్యార్థి విభాగం అధ్యక్షుడు అనంతుల రామూర్తిగౌడ్, విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, అయిలి వెంకన్న, కోలా జనార్ధన్, నాగుల శ్రీనివాస్, దప్పు స్వామి, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టెట్ హాల్‌టికెట్లు విడుదల

### 2,37,754 దరఖాస్తులు

### జనవరి 3 నుంచి 20 వరకు పరీక్షలు

### ఫిబ్రవరి రెండో వారంలో ఫలితాలు

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేశారు. అభ్యర్థులు శనివారం నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మొదటి రోజు 15 శాతానికిపైగా అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. టెట్-2026 కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షలను జనవరి 3 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. అందులో భాగంగా జనవరి 3, 4, 5, 6, 8, 9, 11 తేదిల్లో మేజర్ పరీక్షలు జరగనుండగా జనవరి 19, 20 తేదిల్లో మైనర్ పరీక్షలు జరగనున్నాయి.

పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్షలను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం పరీక్షలకి 8.45 గంటలకు గేట్లను మూసేయనుండగా.. మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు క్లోజ్ చేయనున్నారు. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరి రెండో వారంలో విడుదల చేయనున్నారు. టెట్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి.

## గ్రామాలు, పట్టణాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు

### రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** గ్రామాలు, పట్టణాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రామచందర్‌నాయక్, ఎమ్మెల్యే మురళినాయక్, ఎంపి పోరిక బలరాంనాయక్, ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి, కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పి సుధీర్ రాంనాథ్‌కేకన్ లతో కలసి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నూకల రాంచంద్రారెడ్డి స్మారక కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం అన్నారు. నూకల రామచంద్రారెడ్డి విద్యార్థి దశ నుండి అనేక పోరాటాలు చేసి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. వారి రాజకీయ ప్రస్తానంలో రాజకీయాలంటే ఇలా కూడా చేయెచ్చనేది ఈ రోజు వేదిక మీద ఉన్న ప్రముఖులందరూ గుర్తుచేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. చట్టం భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలని రెవెన్యూ చట్టంలో అనేక సంస్కరణలు తీసుకరావడమే కాకుండా గిరిజన ప్రాంతమైన ఈప్రాంతలో లంబాడి సోదరులకు ఉపయోగపడే చట్టాలతో పాటు లంబాడిలను ఎస్టీజాబితాలో కావాలని ఆనాటి కెబినెట్‌లో కొట్లాడి ఒప్పించాడని కొనియాడారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో సంప్రదించి నూకల రాంచంద్రారెడ్డి పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేస్తానని అన్నారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి,

ఎమ్మెల్యే మురళినాయక్, దివంగత నూకల రాంచంద్రారెడ్డి మనువరాలు రాధికరెడ్డి, మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ ఎంపి సీతారాంనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, భరత్ చందర్‌రెడ్డి,

మాజీ ఎంపి సురేందర్‌రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్యలు రాంచంద్రారెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, మున్సిపల్ కమిషనర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంస్థ అభివృద్ధికి రూ.100 కోట్లు

### గిరిజన సహకార సంస్థ చైర్మన్ తిరుపతి

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జీసీఎఫడీసీ) చైర్మన్ కోట్నాక్ తిరుపతి తెలిపారు. ఇందుకు గాను రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థకు చెందిన కొందరు అధికారులు, ఉద్యోగుల అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతోందని, అవి రుజువైతే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గిరిజనుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం, గిరి బ్రాండ్ ఉత్పత్తుల మార్కెటింగ్‌తో పాటు, శిథిలావస్థలో ఉన్న డీఆర్ డిపోలకు కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. ఇప్పటికే ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అప్‌గ్రేడ్ చేసి వ్యాపారాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గిరిజన సహకార సంస్థ ప్రస్తుత ప్రభుత్వ హాయంలో ఆర్థికావృద్ధిలో పురోగతి సాధించినట్లు వివరించారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రూప్ 4 నియామకాల ద్వారా 65 మందిని సంస్థకు కేటాయించి సిబ్బంది కొరతను తీర్చినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, ఐఆర్‌లను మంజూరు చేయడమే కాకుండా, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించి, సిబ్బందికి నూరు శాతం వేతనాలు అందించినట్లు తెలిపారు.

## ఖనిజేతరాల ద్వారా ఎనర్జీ 500 గిగావాట్ల లక్ష్యం

### కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు అందలం

### 18 యేళ్లపాటు ట్రాన్స్‌మిషన్ చార్జీల మాఫీ

### రుణాల మాఫీ, రాయితీలపై మార్గదర్శకాలు

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** దేశంలో ఖనిజేతర ఎనర్జీ ఆధారిత వనరుల ద్వారా 500 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్రం ప్రణాళికను రూపొందించింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం కొత్త జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 18 ఏళ్ల పాటు వీలింగ్ విద్యుత్‌పై అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలను మాఫీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు రుణాల మాఫీ అందుబాటులో ఉంది. ఈ ప్రణాళికలో భాగంగా వచ్చే 2030 సంవత్సరం నాటికి ఖనిజేతర ఎనర్జీ ఆధారిత వనరుల నుండి 500 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలని అందులో స్పష్టం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరుల నుండి విద్యుత్ అవసరాన్ని సాధించేందుకు కొత్త జల విద్యుత్ ప్రాజెక్టుల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రసారంపై ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం (ఐఎస్‌టిఎస్) చార్జీలను రద్దు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు సైతం జారీ చేసింది. అంతంత మాత్రంగా ఉండే సౌర, పవన విద్యుత్‌ను ఏకీకృతం చేయడానికి జల విద్యుత్‌ప్రాజెక్టులు అవసరమని తెలిపింది. అయిత సౌర, పవన్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు అందించిన అంతరాష్ట్ర ప్రసార చార్జీల మినహాయింపును జల విద్యుత్ ప్రాజక్టులకు విస్తరించ లేదు. ఈ వ్యత్యాసాన్ని తొలగించడానికి, హైడ్రో ప్రాజెక్టులకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్‌ను అందించడానికి ఇక నుండి కొత్త జల విద్యుత్ ప్రాజెక్టులకు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం (ఐఎస్‌టిఎస్) చార్జీల మినహాయింపును సైతం పొడిగించాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చేపట్టే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్మాణం పనులు మంజూరు చేయడంతోపాటు, వాటికి సంబంధించి 2025 జూన్ 30వ తేదీ నాటికి లేదా అంతకు ముందు వరకూ విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) కుదుర్చుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. అయితే 2025 జూన్ 30వ తేదీ తర్వాత నిర్మాణ పనులు మంజూరు చేయబడిన విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు పిపిఎ విషయంలో సంబంధిత ప్లాంట్ల నుండి విద్యుత్ ప్రసారం కోసం ఐఎస్‌టిఎస్ చార్జీలు వివిధ దశలలో ఉన్న వాటికి నిర్ణీత విధంగా వసూలు చేయబడతాయని స్పష్టంగా పేర్కొంది. కాగా పనులు మంజూరు చేయబడిన, పిపిఎలు 2025 జూన్ 30కు జూలై 1వ తేదీకి మధ్య సంతకం చేయబడిన జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 25 శాతం వరకూ ఐఎస్‌టిఎస్ చార్జీలు వసూ లు చేయబడ తాయి. అదే విధంగా 2026 జూలై 1 నుండి 2027 జూలై 1వ తేదీ మధ్య కాలంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్మాణ పనులు మంజూరు చేయబడి, విద్యుత్ సరఫరాకై పిపిఎ సంతకాలు చేయబడిన ప్రాజెక్టులకు 50 శాతం, 2028 జూన్ 30వ తేదీ వరకూ అయితే 75 శాతం చొప్పున ఐఎస్‌టిఎస్ చార్జీలు అమ లు చేయనున్నట్లు వెల్ల డించింది. ఇక 2028 జూలై 1వ తేదీ నుండి హైడ్రో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు 100 శాతం ఐఎస్‌టిఎస్ చార్జీలు వర్తిస్తాయని ప్రణాళికలో పేర్కొన్నట్లు విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారులు తెలియచేశారు.

ఆట

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# సూరజ్‌కు డబుల్ స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో సూరజ్ శర్మ సీనియర్, జూనియర్ పురుషుల జాతీయ టైటిళ్లను కైవసం చేసుకుని డబుల్ స్వర్ణాలను సాధించాడు. జూనియర్ ఫైనల్‌లో సూరజ్ మొదట తన అధిక్యాన్ని చాటుకుని 30 హిట్‌లతో బంగారు పతకాన్ని సాధించాడు. తర్వాత సీనియర్ ఫైనల్స్‌లో 31 హిట్‌లతో రెండవ టైటిల్‌ను సాధించాడు. సీనియర్ ఫైనల్‌ను సూరజ్ ఆధిపత్య రీతిలో ప్రారంభించి తన మొదటి 20 లక్ష్యాలలో 19 లక్ష్యాలను చేధించి 31 హిట్‌లతో పోటీని ముగించాడు. డిఫెండింగ్ ఛాంపియన్ పంజాబ్‌కు చెందిన విజయ్‌వీర్ సిద్ధూ కంటే మూడు స్థానాల్లో నిలిచాడు. అతను 28 హిట్‌లతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. రాజస్థాన్‌కు చెందిన భవేష్ షెఖావత్ మొత్తం 24 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నెలవల్లి ముఖేష్‌పై వరుసగా మూడు షూట్‌ఆఫ్‌లలో పాల్గొన్న తర్వాత అంకుర్ గోయెల్ 14 హిట్‌లతో నాల్గవ స్థానంలో నిలిచాడు. చివరికి ముఖేష్ 12 హిట్‌లతో ఐదవ స్థానంలో నిలిచాడు. హర్యానాకు చెందిన ఆదర్శ్ సింగ్ ఐదు హిట్‌లతో ఆరో స్థానంలో నిలిచాడు.

## వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్:
# గౌతమ్ చేతిలో ముగ్గురు గ్రాండ్ మాస్టర్ల ఓటమి




**న్యూఢిల్లీ:** పపంచ రాపిడ్ ఛాంపియన్‌షిప్-2025ను భారత్ అద్భుతంగా ప్రారంభించింది. ఇందులో గౌతమ్ కృష్ణ ముగ్గురు గ్రాండ్‌మాస్టర్‌లపై ఆధిక్యం సంపాదించాడు. ఖతార్‌లో మొదటి రోజు తర్వాత దొమ్మరాజు గుకేష్, ఎరిగియసి అర్జున్ ఉమ్మడి ఆధిక్యాన్ని పంచుకున్నారు. అర్జున్ వరుసగా నాలుగు విజయాలతో ప్రారంభించగా, ఐదవ మ్యాచ్‌లో నార్వేకు చెందిన అనుభవజ్ఞుడు మాగ్నస్ కార్ల్‌సెన్‌తో డ్రాగా ఆడి 4.5 పాయింట్లతో ఈ రోజును ముగించాడు. అలాగే గుకేష్ తన మొదటి గేమ్‌ను డ్రాగా ఆడాడు. కానీ తర్వాత వరుసగా నాలుగు విజయాల తదుపరి అర్జున్‌తో కలిసి మాగ్నస్, మాక్సిమ్ వాచియర్-లాగ్రేవ్, వ్లాడిస్లావ్-ఆర్టెమివ్ లతో కలిసి ఉమ్మడి ఆధిక్యంలో నిలిచాడు. ఇక తొలి రోజు స్టార్‌గా నిలిచిన భారత ఐఎం గౌతమ్ కృష్ణ, తన మొదటి మూడు గేమ్‌లలో ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు అలెగ్జాండర్ ఇండ్జిక్, అరవింద్ చిదంబరం, టెయిమోర్ రాడ్జాబోవ్‌ను ఓడించాడు. ఆ తర్వాత అతను చివరి రెండు ఆటలలో రెండు డ్రాలు ఆడాడు. వాటిలో ఒకటి నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరితో జరిగిన మ్యాచ్‌తో సహా అజేయంగా నిలిచాడు. దీంతో కృష్ణ ఒక రోజులోనే 60 రేటింగ్ పాయింట్లు పొందాడు. కాగా మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక మొదటి రోజు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన భారతీయురాలిగా నిలిచింది. 4 ఆటలలో 3.5 పాయింట్లు సాధించింది. మరో ఆరుగురు భారత్ క్రీడాకారిణులు ఆర్ వైశాలి, కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్, రక్షిత, సవిత శ్రీ, పద్మిని రౌత్ ప్రస్తుతం నాటికి 3/4 పాయింట్లతో టాప్ 30లో ఉన్నారు.

## టాటా ఓపెన్ టూర్..
# అగ్రస్థానానికి సంధు

**న్యూఢిల్లీ:** టాటా ఓపెన్ 2025లో భారత్‌కు చెందిన యువరాజ్ సంధు టాప్ ప్లేస్‌కు చేరుకున్నాడు. గోల్ముర్‌లో జరిగిన ఈవెంట్ పిజిటిఐ సీజన్ ఫైనల్ యొక్క రౌండ్ టూలో ఎనిమిది అండర్ 64లో అద్భుతమైన ప్రదర్శనతో సంధు లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు.



బెల్డిహ్‌లో ఆడిన యువరాజ్ (67-64), హాఫ్‌వే దశలో మొత్తం 11అండర్ 131తో మూడు షాట్‌లతో ఆధిక్యంలో ఉండటంతో ఓవర్‌నైట్ టై ఎనిమిదో స్థానం నుండి ఏడు స్థానాలు పైకి ఎగబాకాడు. రౌండ్ వన్ తర్వాత 4 ఆధిక్యంలో ఉన్న సంధు, ముందు 9 స్థానాల్లో వరుసగా మూడు బర్డీలను సేకరించాడు. తదుపరి వరుసగా చిన్న బ్లిప్, తర్వాత వరుసగా ఆరు బర్డీలతో బర్డీ స్ప్రీ చేశాడు. సంధు చేసిన తొమ్మిది బర్డీలలో రెండు టాప్‌క్లాస్ అప్ అండ్ డౌన్స్, 12 నుండి 15 అడుగుల పరిధి నుండి రెండు లాంగ్ మార్పిడులు, రెండు నాలుగు అడుగుల మార్పిడులు ఉన్నాయి. ఈ ఏడాదిలో 6 సార్లు విజేతగా నిలిచిన యువరాజ్, ఇప్పటికే 2025 ఆర్డర్ ఆఫ్ మెరిట్ కిరీటాన్ని గెలుచుకున్నాడు. సంధు ఇప్పుడు రికార్డు స్థాయిలో ఏడవ టైటిల్ కోసం చూస్తున్నాడు. అలాగే మూడవ ఈవెంట్ ఆడుతున్న 21 ఏళ్ల శుభమ్ జగ్లాన్ (68-66), గోల్ముర్‌లో రౌండ్ టూలో ఫోర్ అండర్ 66 సాధించి నాలుగు స్థానాలు ఎగబాకి మొత్తం ఎనిమిది అండర్ 134తో రెండవ స్థానానికి చేరుకున్నాడు.

# ఆటకు దిగ్గజాల వీడ్కోలు
## 2025 క్రీడల్లో ముగిసిన ఒక శకం
### క్రికెట్ నుంచి మల్లయోధులు వరకు షాక్








**న్యూఢిల్లీ:** ఈ ఏడాది 2025 ప్రపంచ క్రీడల్లో ఒక శకం ముగిసింది. క్రికెట్ పిచ్ నుండి కుస్తీ పోటీల వరకూ విభిన్న క్రీడల్లో మైదానంలో తమ అసాధారణ ప్రతిభతో అభిమానులను మంత్రముగ్ధులను చేసిన ఎందరో సూపర్ స్టార్‌లు ఈ ఏడాది తమ కెరీర్‌కు వీడ్కోలు పలికారు. టీమిండియా స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దగ్గర నుండి వివిధ క్రీడలకు సంబంధించి సెరిజియో బుస్కెట్స్, జోర్డీ అల్బా, మార్సెలో, హెమల్స్ లాంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్ల వరకూ పలువురు తమ సుదర్ఘీ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చారు. భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా ఉన్న సమయంలోనే రోహిత్ శర్మ సుదీర్ఘ టెస్టు క్రికెట్ కెరీర్‌కు మే 07న గుడ్ బై చెప్పేశాడు. 2013లో టెస్టు అరంగేట్రం చేసిన రోహిత్ 67 మ్యాచ్‌లలో 4,301 పరుగులు సాధించాడు. టెస్టు కెరీర్‌లో 12 శతకాలు, 18 అర్ధశతకాలు ఉన్నాయి. 2019లో దక్షిణాఫ్రికాపై చేసిన 212 పరుగులు అతని టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా నిలిచింది. కెప్టెన్‌గా 24 టెస్టుల్లో భారత్‌ను నడిపిన రోహిత్, 12 విజయాలు అందించి తనదైన ముద్ర వేశాడు. అలాగే, 2024లో టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత రోహిత్ సైతం ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇక భారత క్రికెట్ చరిత్రలో లెజెండ్ అయిన విరాట్ కోహ్లీ మే 12న టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 14 ఏళ్ల టెస్టు కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి, 9,230 పరుగులు (సగటు 46.85) సాధించాడు. అతడి నాయకత్వంలో భారత్ జట్టు అద్భుతమైన విజయాలను అందుకుంది. విదేశీ గడ్డపై చిరస్మరణీయ టెస్టు విజయాలు కోహ్లీ సేన సాధించింది. 2024లో టీ20 వరల్డ్ కప్ విజయం అనంతరమే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ రెజ్లింగ్ దిగ్గజం గ్రేట్ జాన్ సీనా ఈ ఏడాది డిసెంబర్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఈవెంట్స్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. 2001లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూలో చేరిన సీనా రికార్డు స్థాయిలో 16 సార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచాడు. రెండుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత అయిన రొమేనియాకు చెందిన సిమోనా హాలెప్ 33 ఏళ్ల వయసులో టెన్నిస్ నుంచి రిటైర్ ప్రకటించింది. 2017లో వరల్డ్ నంబర్ 1 ర్యాంక్‌ను చేరుకున్న హాలెప్ 2018 ఫ్రెంచ్ ఓపెన్, 2019 వింబుల్డన్ టైటిళ్లు గెలిచింది. మొత్తంగా 24 సింగిల్స్ టైటిళ్లు, 40 మిలియన్ డాలర్లకు పైగా ప్రైజ్ మనీతో ఆమె కెరీర్ ముగిసింది. బార్సిలోనా, స్పెయిన్ జట్లకు వెన్నెముకగా దిగ్గజ మిడ్‌ఫీల్డర్ బుస్కెట్స్ (37) ఫుట్‌బాల్‌కు ఈ ఏడాదే వీడ్కోలు పలికాడు. 2010 ప్రపంచకప్ విజేత అయిన ఆయన, తన కెరీర్ ముగింపులో మెస్సీతో కలిసి మయామీ తరపున ఆడాడు. స్పెయిన్ తరపున 143 మ్యాచ్‌లు ఆడిన అతడు 2010 వరల్డ్ కప్, 2012 యూరో కప్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అలాగే, తన కెరీర్‌లో మొత్తం 700కుపైగా మ్యాచ్‌లు అడి 9 లా లిగా టైటిళ్లు, 3 ఛాంపియన్స్ లీగ్‌లు గెలిచాడు.

# 14 యేళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ గెలుపు
## నాలుగో టెస్టులో 4 వికెట్ల తేడాతో విక్టరీ





**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై ఆ దేశాన్నే ఓడించింది. ఇంగ్లండ్. సుమారు 14 ఏళ్ల విరామం తర్వాత ఆసీస్ పిచ్‌పై టెస్టుల్లో ఇంగ్లండ్ జట్టు విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో శనివారం జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో అసాధారణ విక్టరీ నమోదు చేసింది. ఆసీస్, ఇంగ్లండ్ మధ్య జరిగిన పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా విక్టరీ కొట్టగా, ఇవాళ మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ స్వీట్ విక్టరీ నమోదు చేసింది. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 175 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకున్నది. ఆస్ట్రేలియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. టార్గెట్ చిన్నదే అయినా ఇంగ్లండ్ క్రికెటర్లు ఇబ్బందిపడాల్సి వచ్చింది. పేస్ అటాక్‌తో ఆస్ట్రేలియా బౌలర్లు చమటలు పట్టించింది. ఇవాళ రెండో రోజు ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 132 రన్స్ కే ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రౌడన్ కార్స్ 4, స్టోక్స్ 3, టాంగే రెండు వికెట్లు తీసుకున్నారు. వాస్తవానికి యాషెస్ సిరీస్‌ను ఇప్పటికే ఆస్ట్రేలియా సొంతం చేసుకున్నది. కానీ ప్రస్తుతం ఆధిపత్యాన్ని 3-1కి తగ్గించింది ఇంగ్లండ్. ఆస్ట్రేలియా తన స్వంత గడ్డపై ఓడించేందుకు ఇంగ్లండ్‌కు 15 ఏళ్లు పట్టింది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్ 16 టెస్టుల్లో ఓడగా, రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్నది. రెండు రోజుల్లోనే ముగిసిన పెర్త్ టెస్టులో మొత్తం 847 బంతులు వేయగా, ఇక మెల్‌బోర్న్ టెస్టులో 852 బాల్స్ పడ్డాయి. 2011లో సిడ్నీలో జరిగిన టెస్టులో చివరిసారి ఇంగ్లండ్ విజయం సాధించింది.

## తులం బంగారం
# రూ.1.43 లక్షలు
## కిలో వెండి రూ.2.50 లక్షలు




వాణిజ్యం

**ముంబయి, డిసెంబరు 27:** బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43 లక్షలు పలికి గరిష్ఠ స్థాయికి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,31లక్షలుగా ఉంది. వెండి కిలో ధర రూ.2.50 లక్షలకు చేరుకుంది. నెల రోజుల్లోనే వెండి ధర రూ.80వేలకు పైగా పెరగడం గమనార్హం. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరం2025లో పసిడి ధర 70 శాతం పెరిగింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో బంగారం ఇంత భారీగా పెరగడం సుమారు 45 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అని బులియన్ రంగ నిపుణులుచెపుతున్నారు. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో 2026 ప్రారంభంలోనూ పసిడి ధరలు మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా ఉండటంతో, ఫెడరల్ రిజర్వ్ తదుపరి సమీక్షలో వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతుండటంతో, సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు.


## టెక్ సిఇఒల్లో టాప్ బిలియనీర్
# జయశ్రీ ఉల్లాల్



**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** ప్రపంచ టెక్ రంగంలో భారత సంతతికి చెందిన అత్యంత సంపన్న ఎగ్జిక్యూటివ్‌లుగా ఉన్న సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌లను వెనక్కి నెట్టి అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ జయశ్రీ ఉల్లాల్ నిలిచారు. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం జయశ్రీ ఉల్లాల్ నికర సంపద రూ. 50,170 కోట్లుగా ఉంది. భారత సంతతికి చెందిన అత్యంత సంపన్న ప్రొఫెషనల్ మేనేజర్‌గా ఆమె నిలిచారు. ఇదే జాబితాలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల రూ. 9,770 కోట్ల సంపదతో రెండో స్థానంలో ఉండగా, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ రూ. 5,810 కోట్లతో ఏడో స్థానంతో సరిపెట్టుకున్నారు. జయశ్రీ ఉల్లాల్ 2008 నుంచి కంప్యూటర్ నెట్‌వర్కింగ్ సంస్థ అయిన అరిస్టా నెట్‌వర్క్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆమె నేతృత్వంలో ఈ కంపెనీ అద్భుతమైన వృద్ధిని సాధించింది. ఫోర్బ్స్ కథనం ప్రకారం 2024లో కంపెనీ ఆదాయం 7 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం అధికం. కంపెనీ స్టాక్‌లో జయశ్రీకి దాదాపు 3 శాతం వాటా ఉంది. 1961లో లండన్‌లో జన్మించిన జయశ్రీ, తన ఐదో ఏట కుటుంబంతో కలిసి భారత్‌కు వచ్చారు. ఆమె తండ్రి ఒక భౌతిక శాస్త్రవేత్త. ఆయన ఐఐటీల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. జయశ్రీ న్యూఢిల్లీలోని కాన్వెంట్ ఆఫ్ జీసెస్ అండ్ మేరీలో పాఠశాల విద్యను అభ్యసించారు. అనంతరం తండ్రి ఉద్యోగరీత్యా శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్లారు. అక్కడ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెరీర్ తొలినాళ్లలో ఏఎండీ, ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్ వంటి సంస్థల్లో పనిచేసిన జయశ్రీ, సిస్కోలో చేరాక ఉన్నత స్థాయికి ఎదిగారు. 2008లో కేవలం 30 మంది ఉద్యోగులతో ఉన్న అరిస్టా నెట్‌వర్క్స్‌లో చేరి, దానిని క్లౌడ్ నెట్‌వర్కింగ్ రంగంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఆమె శాన్‌ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్నారు.

## ఈ యేడాది రూ.1.58 లక్షలకోట్ల
# పెట్టుబడులు విత్‌డ్రా!

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఊపందుకోవడం కార్పొరేట్ సుపరిపాలనతోపాటు కార్పొరేట్ ఫలితాలతో వచ్చే ఏడాది మరింతగా విదేశీ పెట్టుబడులు పెరుగుతాయని మార్కెట్ నిపుణులు అంచనావేస్తున్నారు. డిసెంబరులో ఇప్పటివరకూ 22,100 కోట్లు విక్రయించినప్పటికీ వచ్చే ఏడాది ఎఫ్‌ఐఐలు మరింతగా రావచ్చని అంచనా. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ కేలండర్ సంవత్సరంలో రూ.1,58,407 కోట్ల రూపాయలు విలువైన షేర్లు విక్రయించారు. స్థూల ఆర్థికవృద్ధి పటిష్టత వల్ల వచ్చేఏడాది ఈ ఎఫ్‌ఐఐలు మళ్లీ రివర్స్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని అందువల్ల మరింతగా పెరుగుతాయని జియోజిత్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త డా.వికెవిజయ్‌కుమార్ అన్నారు. ఎఫ్‌ఐలల విత్‌డ్రాలో భారత్‌లో ఎఫ్‌ఐఐలు కొత్తరికార్డు నమోదు చేసాయన్నారు. 2024లో ఎఫ్‌ఐఐలు ఎక్స్ఛేంజిలద్వారా రూ.1,21,210 కోట్ల షేర్లను ఈక్విటీల్లో విక్రయించారు. నికరంగా పెట్టుబడులు మాత్రం సానుకూలంగా ఉన్నాయి. రూ.1,21,637 కోట్లు పెట్టుబడులుపెట్టారు. అయితే 2025 గణాంకాలు అందుకు విరుద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. 2026 ప్రారంభంనుంచే కూడా ఎఫ్‌ఐఐలు మళ్లీ పెటుబడులకు ఉపక్రమించే అవకాశం ఉందన్నారు. డాలరుతో రూపాయి మారకం విలువలు వార్షికద్దతిలోచూస్తే ఐదుశాతం క్షీణించింది. వారాంతంలో ముడిచమురుదరలు రికవరీ అవుతున్నాయి. నిరక ఎఫ్‌డిఐలు సుమారు 6.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏడాదిక్రితం 3.3 బిలియన్ డాలర్లుమాత్రమే ఉన్న ఈ పెట్టుబడులు ఏప్రిల్ అక్టోబరుమధ్యకాలంలో 6.2బిలియన్ డాలర్లకు చేరాయి.






## మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో
# భారత్ నం-2

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రకటించారు. గత 11 ఏళ్లలో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, ఎగుమతులు ఏకంగా ఎనిమిది రెట్లు వృద్ధి చెందాయని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుత ప్రగతికి చోదకశక్తిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. భారీస్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కోసం ప్రవేశపెట్టిన పీఎల్ఐ పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 13,475 కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలో సుమారు రూ. 9.8 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సాధ్యమైందని, ఇది తయారీ, ఉద్యోగ కల్పన, ఎగుమతులను గణనీయంగా పెంచిందని వివరించారు. కేవలం గత ఐదేళ్లలోనే ఈ రంగంలో 1.3 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగిందని ఆయన అన్నారు. ఒకప్పుడు ఏడో స్థానంలో ఉన్న ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు, ఇప్పుడు దేశంలో మూడో అతిపెద్ద ఎగుమతి కేటగిరీగా ఎదగడం మేక్ ఇన్ ఇండియా విజయానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం తొలుత పూర్తయిన ఉత్పత్తులపై దృష్టి సారించినప్పటికీ, క్రమంగా విడిభాగాలు, ముడి పదార్థాలు, వాటిని తయారుచేసే యంత్రాల తయారీ సామర్థ్యాన్ని పెంచడంపై కూడా దృష్టి పెట్టిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్‌కు అద్భుత స్పందన లభించిందని చెప్పారు. ఈ పథకం కింద 249 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా రూ. 1.15 లక్షల కోట్ల పెట్టుబడులు, రూ. 10.34 లక్షల కోట్ల ఉత్పత్తి, 1.42 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇదే అత్యధిక పెట్టుబడి నిబద్ధత అని, ఇది పరిశ్రమకు ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తోందని ఆయన అన్నారు. సెమీకండక్టర్ రంగంలోనూ భారత్ వేగంగా పురోగమిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పది యూనిట్లకు ఆమోదం లభించగా, వాటిలో మూడు పైలట్ లేదా ప్రాథమిక ఉత్పత్తి దశలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే భారత్‌లో తయారైన ఫ్యాబ్‌లు, ఏటీఎంపీలు ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ తయారీదారులకు చిప్స్‌ను సరఫరా చేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం దేశవ్యాప్తంగా 25 లక్షల ఉద్యోగాలను సృష్టించిందని, ఇదే క్షేత్రస్థాయిలో నిజమైన ఆర్థిక వృద్ధి అని మంత్రి అభివర్ణించారు. పూర్తయిన ఉత్పత్తుల నుంచి విడిభాగాల వరకు ఉత్పత్తి పెరుగుతోంది. ఎగుమతులు దూసుకుపోతున్నాయి. ప్రపంచ కంపెనీలు నమ్మకంతో ఉన్నాయి. భారత కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. ఇదే మేక్ ఇన్ ఇండియా విజయగాథ అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# వచ్చే యేడాది ఆర్థికవృద్ధి 7.4% అంచనా!




**న్యూఢిల్లీ,డిసెంబరు 27:** భారత జిడిపి వృద్ధిరేటు 2026 సంవత్సరంలో 7.4శాతం నమోదవుతుందని ఆర్థికనిపుణుల అంచనాలు వెలువడ్డాయి. జిఎస్టీ రేట్‌కట్‌లు, దేశీయంగా పెరుగుతున్న డిమాండ్, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగ సామర్థ్యం పెరుగుతుండటంతో ఆర్బీఐ వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించే అవకాశం ఉందని, ఫిబ్రవరిలో జరిపే ఎంపిసి సమావేశంలోకూడా ఇదే నమోదవుతుందని చెపుతున్నారు. అలాగే రిటైల్‌ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, విదేశీ రిస్కులు అంటే వాణిజ్య డీల్స్ జాప్యం జరిగినా ఆర్థికవృద్ధి పెరుగుతుందని చెపుతున్నారు. 2026 రెండో అర్ధభాగంలోనే ఈ వృద్ధి మరింత ఉంటుందని చెపుతున్నారు. అయితే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం, ప్రపంచదేశాల పాలసీ నిర్ణయాలు, కేంద్ర బ్యాంకుల వడ్డీరేట్ల నిర్ణయాలు, కమోడిటీ ధరవరలు, ద్రవ్యోల్బణం వంటివే కీలకం అవుతాయని చెపుతున్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరులో 0.7శాతానికి పెరిగింది. అక్టోబరులో 0.3శాతం మాత్రమే ఉంటే ఈసారి ఆహార, శీతలపానీయాల ధరలు పెరగడంతోస్వల్పంగా పెరిగినట్లు అంచనా. ఇక నిర్మాణరంగ కార్యకలాపాలు, మైనింగ్, విద్యుత్ రంగాలు ఊపందుకున్నాయి. సిమెంట్ ఉతనపత్తి 7.5శాతంగా ఉంటుందని అంచనా. ఉక్కు ఉత్పత్తి డిమాండ్ 7-8శాతాంగా ఉంటుంది. విద్యుత్ డిమాండ్‌కూడా 2026 ఆర్థిక సంవత్సరంలో 1.5-2శాతంమధ్యలో ఉంటుందని వెల్లడి అయింది. ఇక్రా, ఫిట్జ్‌రేటింగ్ వంటిసంస్థలు 2026లో భారత్‌కు ఆర్థిక వృద్ధి అవకాశాలు మరింత ఎక్కువ ఉండవచ్చని అంచనావేసాయి. 2026లో రెండోత్రైమాసికఫలితాలు కూడా ఇందుకు దోహదంచేస్తాయని అంచనా. ఆర్థిక సేవలు, బ్యాంకులు, ఉత్పత్తి, సేవలరంగాల్లో వృద్ధి జిడిపిని మరింత వృద్ధి బాటలోకి తీసుకువెళుతుందని ఈ సంస్థలు అంచనావేసాయి.

# ఫండ్స్ మార్కెట్లలో 'సిప్'లే ఎక్కువ!
## ఇప్పటివరకూ రూ.3.04 లక్షలకోట్లు ఫండ్స్ పెట్టుబడులు




**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** భారత్‌లో ఫండ్స్ మార్కెట్‌లలో సిప్ పెట్టుబడులు ఊపందుకున్నాయి. సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్‌ప్లాన్ కింద నవంబరు నాటికి మొత్తం రూ.3 లక్షలకోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తోంది. ఆంఫీ డేటా ప్రకారంచూస్తే ఈక్విటీల్లో సిప్‌లు గత ఏడాది 27శాతంనుంచి 37శాతానికి పెరిగాయి. 2025లో ఇప్పటివరకూ రూ.3.04 లక్షలకోట్లు పెట్టుబడులు కుమ్మరించారు. అదే 2024 నవంబరునాటికి 2.69 లక్షలకోట్లుమాత్రమే పెట్టుబడులు వచ్చాయని ఆంఫీ డేటా చెపుతోంది. ఇన్వెస్టర్లు గణనీయంగా సిప్‌లనే ఎంచుకుంటున్నారని, భారీ పెట్టుబడులకు సుస్థిర వ్యవస్థగా సిప్‌లు పేర్కొంటున్నారు. ఎక్కువగా రిటైల్ ఇన్వెస్టర్లు భాగస్వామ్యం ఉందని, మూచువల్‌ఫండ్ పరిశ్రమలో మొత్తం నిర్వహణ ఆస్తులు ప్రస్తుతం 80.80 లక్షలకోట్లకు చేరడం రిటైల్ భాగస్వామ్యం పెరగడం వల్లనేనని తెలుస్తోంది. అదే అంతకుముందునెలలో రూ.79.87 లక్షలకోట్లుమాత్రమే ఉన్నాయి. 2025 మొదటి పదినెలల్లో సిప్‌ల వాటా 37శాతంగా ఉంది. ఈక్విటీ స్కీమ్‌లలో సిప్ పెట్టుబడులు మొత్తం సిప్‌లలో 80శాతంగా ఉన్నట్లు అంచనా. నవంబరునెలలోనే రూ.29,445 కోట్లుపెట్టుబడులు వచ్చాయి. అయితే అక్టోబరులో వచ్చిన రూ.29,529 కోట్లకంటే తక్కువే. దేశీయంగా నగదు లభ్యత పెరగడం, రిటైల్ సిప్ భాగస్వామ్యం పెరగడం, భారత్ మధ్యంతర ఆర్థిక, కార్పొరేట్ రాబడులు మరింతగా ఊపందుకోవడం వంటి వాటివల్లనే సిప్ పెట్టుబడులు పెరిగినట్లు తెలుస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# ఘోర రోడ్డు ప్రమాదం...

## ముగ్గురు యువకులు మృతి





ఏలూరు జిల్లా ప్రతినిధిడిసెంబర్ 27ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడెం ఫ్లైఓవర్ వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, అతివేగంతో ప్రయాణిస్తున్న బైక్ నియంత్రణ కోల్పోయి ఫ్లైఓవర్‌పై ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మృతి చెందిన యువకులు ద్వారకా తిరుమల మరియు తిమ్మాపురం గ్రామాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే భీమడోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపల్ మంత్రి దృష్టికి డంపింగ్ యార్డ్ సమస్య

ప్రభాతవార్త నరసాపురంలి9: : నరసాపురం పట్టణంలోని డంపింగ్ యార్డ్ సమస్యపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ , రాష్ట్ర మైనారిటీ ప్రభుత్వ సలహాదారు షరీఫ్ మరియు టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసాపురం పట్టణంలో సరైన డంపింగ్ యార్డ్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించి, ఈ సమస్యకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపవలసిందిగా కోరారు. ఈ అంశానికి సంబంధించి అవసరమైన పత్రాలను మంత్రికి అందజేయగా, మంత్రి పొంగూరు నారాయణ గారు సానుకూలంగా స్పందిస్తూ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# జిల్లాలో కోడి కత్తులకు అడ్వాన్స్ బుకింగ్.

## -.ఇప్పటికే పలు గ్రామాల్లో బరులకు గ్రీన్ సిగ్నల్.
## -ఈసారి భారీగా చేతులు మారనున్న నగదు.



ముదినేపల్లి. డిసెంబర్ 27( ప్రభాతవార్త). సంక్రాంతి పండుగ అంటేనే గుర్తుకొచ్చేది పచ్చటి పల్లెటూరు అందులో ప్రాముఖ్యం పొందిన కోడిపందాలు, పేకాట ఆంధ్రప్రదేశ్లో అత్యంత వైభవంగా పెద్ద పండుగగా పేరుగాంచిన సంక్రాంతి పండుగ పురస్కరించుకొని వేలాది రూపాయలు చేతులు మారుతాయి. ఇప్పటికే కోడిపందాలు పేకాట బరుల నివహులు కోడి కత్తులను చేయించడానికి అడ్వాన్స్ ఇచ్చి తయారు చేయిస్తున్నట్టు సమాచారం. మండలంలో సంక్రాంతి బరులలో కోడి కత్తులు కట్టే వ్యక్తులు ఏ ఏ బరికి ఎన్నెన్ని కత్తులు కావాలని అంచనా వేసి ఇతర జిల్లాల నుంచి కత్తులను సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఇకపోతే మండలంలో ఏఏ గ్రామాలలో కోడి పందాలు నిర్వహించాలని పందెం రాయుళ్లు నాయకులు చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాలకు బరులు నిర్వహించడానికి నాయకులు వద్ద నుంచి గ్రీన్ సిగ్నల్ అందినట్టు సమాచారం. కోడిపందాల రాయుళ్లు సంక్రాంతి పండుగకు తమ కోళ్లను సిద్ధం ఇస్తున్నారు ఈసారి మండలంలో ఎక్కువ స్థాయిలో బరులు పెరుగుతాయని నిర్వాహకులు గుసగుసలాడుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సారం కోడి పందాలు పేకాటలు నిర్వహించకూడదని ఆంక్షలు ఉన్నప్పటికీ పండగ నాలుగు రోజులు పోలీసులు సైతం నిద్ర వస్తకు వెళ్లవలసిందా, లేదా అనేది వేచి చూడవలసింది ఉంది.



# పశ్చిమగోదావరి జిల్లాలో

## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన ఇలా



ప్రభాతవార్త నరసాపురం రూరల్ :కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రేపు డిసెంబర్ 28 ఆదివారం ఉదయం 8.00 గంటలకు విజయవాడ నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి ఉదయం 11:00 గంటలకు పెదమైన వానిలంక చేరుకుంటారు. ఉ 11. 00 గంటల నుండి 12.00 గంటల వరకు మనకి బాత్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల నుండి మ.1.30 గంటల వరకు సియోన్ట్ ఏఐ స్కిల్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం1.30 గంటల నుండి మధ్యాహ్నం1.45 గంటల వరకు సముద్రపు కోత అడ్డుకట్ట పనులను పరిశీలిస్తారు. మ 1.45 గంటలకు పెదమైనవానిలంక నుండి బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు నరసాపురం చేరుకుంటారు. మ.2.15 నుండి 3.15 గంటల వరకు (రిజర్వుడు), మ 3:15 గంటలకు నరసాపురం నుండి బయలుదేరి మ 3: 45 గంటలకు కవిటం చేరుకొని పార్వతీ సోమేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు కవిటం నుండి విజయవాడ బయలుదేరి వెళ్లనున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## రాష్ట్ర మంత్రి పయ్యావుల పర్యటన నేడు

ప్రభాతవార్త నరసాపురం రూరల్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ నరసాపురం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ 27వ తేదీ శనివారం రాత్రి 8.45 గంటలకు విజయవాడ హోటల్ నోవాటెల్ నుండి బయలుదేరి రాత్రి 11.00 గంటలకు అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం డిండి రిసార్ట్స్ కు చేరుకుని రాత్రి బస చేస్తారు. 28వ తేదీ ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో కలిసి నరసాపురంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు దిండి రిసార్ట్స్ నుండి బయలుదేరి 10:45 గంటలకు పెదమైన వానిలంక డిజిటల్ భవన్ కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.15 గంటల వరకు పీఎం లంకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.00 గంటలకు నరసాపురం చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3.00 గంటలకు కవిటం దేవాలయం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి విజయవాడ వెళ్తారు.

## నేడు దత్తత గ్రామం పీఎం లంకలో నిర్మలా సీతారామన్ పర్యటన

పశ్చిమగోదావరి జిల్లా(భీమవరం) డిసెంబర్ 27,ప్రభాతవార్త పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామం సమగ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలువనున్నదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పీఎం లంక గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరే కేంద్ర మంత్రి ఉదయం 11 గంటలకు పీఎం లంకలోని డిజిటల్ బిల్డింగ్‌కు చేరుకుని 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సియెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డ్రోన్లు, కృత్రిమ మేధస్సు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, 'వికసిత్ భారత్ డిజిటల్ ఇండియా' థీమ్‌పై రూపొందించిన చిత్రాలను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా గేమ్ హబ్ / గేమ్ ఫౌండేషన్, ఎగ్జిమ్ బ్యాంక్‌లతో ఎంఓయూల సంతక కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటనలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా జీవనోపాధి చెక్కుల పంపిణీ జరగనున్నది. అలాగే "వికసిత్ భారత్ %-% డిజిటల్ ఇండియా" అంశంపై విద్యార్థుల చిత్రలేఖన పోటీలు, "వందే మాతరం" అంశంపై గాన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం , అనంతరం డెలాయిట్ ఆధ్వర్యంలో నిర్మించిన గేబియన్ వాల్ నిర్మాణాన్ని కేంద్ర మంత్రి పరిశీలిస్తారు. నరసాపురంలో భోజన విరామం అనంతరం కవిటం దేవాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవాడకు తిరిగి వెళ్తారని కలెక్టర్ వివరించారు. పీఎం లంక గ్రామాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దత్తత



తీసుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత .. సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన కార్యక్రమాలు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

## వాహనాల తనిఖీలు



కామవరపుకోట,డిసెంబర్ 27 ప్రభాత వార్త: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని అని తడికలపూడి పోలీస్ స్టేషన్ ఎస్సై పి.చెన్నారావు అన్నారు.శనివారం సాయంత్రం కామవరపుకోటలోని చౌతన సెంటర్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులందరు తప్పక ట్రాఫిక్ నియమాలు పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సరి అయిన ధృవ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

## "మీ ఇంటికి మీ డాక్టర్" ప్రాజెక్టు అమలు

భీమవరం డిసెంబర్ 27ప్రభాతవార్త: "మీ ఇంటికి మీ డాక్టర్" ప్రాజెక్టును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ రూరల్ ఎలెక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఫౌండేషన్, న్యూఢిల్లీ ఆర్థిక సహకారంతో రూ.8.41 కోట్ల వ్యయంతో 1 ఫిబ్రవరి 2026 నుండి మూడు సంవత్సరాల కాలానికి రాష్ట్రములో 7 జిల్లాలలో అమలు చేయనుంది. దీనిలో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటి.పశ్చిమ గోదావరి జిల్లాల తీరప్రాంతాల్లో నివసించే పేద మత్స్యకార మహిళలకు ఈ ప్రాజెక్టు వర్తిస్తుంది అని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ సి నాగ రాణి తెలిపారు.ఈ ప్రాజెక్టు 2026 ఫిబ్రవరి మొదటి వారంలో ఐ ఆర్ సి ఎస్ ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులైన గవర్నర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం బలహీన వర్గాల సేవలు అందని ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మొబైల్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థతో కలిసి మొబైల్ హెల్త్ క్లినిక్స్ నిర్వహణ ద్వారా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, శిశు మరణాల రేటు (ఐ ఎం ఆర్), మాతృ మరణాల రేటు (ఎం ఎం ఆర్) తగ్గించడం, మొత్తం మరణాల రేటును తగ్గించడం, సంక్రమణ వ్యాధులను నియంత్రించడం మరియు ప్రాజెక్ట్ ప్రాంతంలో 100% టీకాకరణ సాధించడం అని కలెక్టర్ పేర్కొన్నారు.

## జిల్లాలో గుంతల రోడ్లకు మోక్షం.. ఫలించిన ఎంపీ కృషి

# రోడ్ల మరమ్మతులకు అనుమతులు



ఏలూరు, డిసెంబర్ 27. ప్రభాతవార్త: రాష్ట్రంలో రహదారులను గుంతలు లేకుండా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పలు రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 500 కోట్లు మంజూరు చేసింది. ఇందులో దాదాపు 300 కోట్లు గతంలో మంజూరు చేసి, పనులు ప్రారంభించకపోవడంతో రద్దైనవి కాగా, 205.12 కోట్లకు తాజాగా పరిపాలనా అనుమతులు ఇచ్చారు. కొత్తగా పరిపాలనా అనుమతులు ఇచ్చిన 205.12 కోట్లలో 117.89 కోట్లు జిల్లా ప్రధాన రహదారులకు, 87.23 కోట్లు రాష్ట్ర రహదారులకు కేటాయించారు. దీనిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందనీ, గ్రామీణ ప్రాంత రోడ్లకు ఒక్క రూపాయి కేటాయించలేదనీ ఎంపీ విమర్శించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులకు అనుసంధానంగా ఉన్న రోడ్లన్నింటినీ నిర్లక్ష్యం చేసిందన్న ఎంపీ, ఎక్కడికక్కడ గుంతలు పడి అడుగుకో గొయ్యి ఏర్పడడంతో గత ఐదేళ్ళు వాహన దారులు నరకయాతన పడ్డారన్నారు. ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ఆసుపత్రి పాలైన ఘటనలు ఎన్నో. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. బాగా పాడైన రోడ్లను తొలుత మార్చాలని భావించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తూ వస్తోంది. ఏలూరు పార్లమెంట్ పరిధిలో రోడ్ల పరిస్థితిపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకురావటం జరిగిందన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్, తాజాగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు మంజూరు చేసిన నిధుల్లో 10శాతం ఏలూరు జిల్లాకే కేటాయించిన ముఖ్యమంత్రికి, రోడ్లు భవనాల శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారుల మరమ్మతుల పనులు ఈ వేసవికాలంలోపు పూర్తిచేసే విధంగా రోడ్లు భవనాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## భోగేశ్వర స్వామి దేవస్థానానికి ఎమ్మెల్యే రూ 3 లక్షలు విరాళం

కైకలూరు డిసెంబర్ 27 (ప్రభాతవార్త) :మండల కేంద్రమైన కలిదిండి శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాకార మండపం నిర్మాణం పనులకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ రూ 3 లక్షలు విరాళం అందించారు.శనివారం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారం కొరకు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం ఎమ్మెల్యే తన వంతు మూడు లక్షల ప్రకటించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ పార్వతి సమేత పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ ప్రాకార మండపం నిర్మాణం పనులకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ఆలయ కార్య నిర్వహణ అధికారి సింగనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలకు పండుగ తెచ్చిన కూటమి ప్రభుత్వం -ఎమ్మెల్యే ఆరిమిల్లి వెల్లడి

తణుకు, డిసెంబర్ 27 ( ప్రభాతవార్త) :కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ 2.0లో విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈరోజు తణుకు మండలం, వేల్పూరు గ్రామంలో రూ.40 లక్షలతో, అదే విధంగా నియోజకవర్గంలో మొత్తం రూ.3 కోట్లు ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా చేపడుతూ పల్లెల్లో పండగ ఉత్సాహాన్ని నింపిందని తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు గత రెండు రోజుల నుంచి ఆయన వివిధ పథకాల ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాధాకృష్ణ. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడమైంది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో కుదేలైన గ్రామీణ వ్యవస్థకు తిరిగి పునరుజ్జీవం కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు గారు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి సారథ్యంలో కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ మేరకు గ్రామాల్లో రోడ్లు, తాగు, సాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ఈ పల్లె పండుగను నిర్వహించడం మంచి విషయమని పలువురు ఎమ్మెల్యే ఆర్మీలోని కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## కొప్పర్రు లలో 70 మంది మహిళలకు చేయూత

ప్రభాతవార్త నరసాపురం డెవలప్మెంట్ కమిషనర్ (హస్తకళలు), టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి సహకారంతో అపిటికో లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో లేసు హస్తకళా మహిళలకు ఇంప్రూవ్డ్ టూల్కిట్స్ మరియు కుట్టు మెషీన్లు పంపిణీ చేసే కార్యక్రమం నరసాపూర్ మండలం కొప్పర్రు గ్రామంలో మరియు నరసాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, టీడీపీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, లేసు అల్లే మహిళలు ఈ ఆధునిక మెషీన్లు మరియు టూల్కిట్స్‌ను సద్వినియోగం చేసుకొని తమ ఉత్పత్తుల నాణ్యతను మరింత పెంచుకోవాలని సూచించారు. నాణ్యమైన లేసు ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర లభించి, తద్వారా మహిళలు ఆర్థికంగా



స్వావలంబన సాధిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 70 మంది లేసు హస్తకళా మహిళలకు ఇంప్రూవ్డ్ టూల్కిట్స్ మరియు కుట్టు మెషీన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి శ్రీనివాస్, సిరిగినీడి రాజలక్ష్మి, పత్తి లక్ష్మీ సంపూర్ణ, నల్లి వరలక్ష్మి జేమ్స్, వలవల నాని, రావూరి సురేష్, పోలిశెట్టి నళిని, పోలిశెట్టి గణేశ్వరరావు, ముక్కు బాబురావు, పిప్పల సత్య శ్రీ, పోలిశెట్టి సుబ్బలక్ష్మి, నేదునూరి సావిత్రి పాల్గొన్నారు. అపిటికో లిమిటెడ్ తరఫున శ్రీ పీడీ సుధీర్ కుమార్ మరియు జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన క్రిస్మస్ వేడుకలు

మొగల్తూరుడిసెంబర్ 27 (ప్రభాతవార్త ) మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధి కొండావారిపాలెంలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్. మరియు శాసనసభ్యుడు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. పాస్టర్ వాసంశెట్టి ముత్యాలరావు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కు సాలువ కప్పి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. సంఘ పెద్దలు సమక్షంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకరు కేకును కట్ చేసి అక్కడ ఉన్న అందరికీ పంపిణీ చేసి క్రిస్టమస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోల్లం ప్రభు, కైలా శ్రీను బాబు, బెజవాడ ప్రసాదు, నరసాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇంజేటి దానం, మాదిరెడ్డి బాలాజీ,మొగల్తూరు సొసైటీ అధ్యక్షుడు నిప్పులేటి తారక రామారావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాల నిషేదం,

## పర్యవరణ పరిరక్షణపై అవగాహనా సదస్సు



కాళ్ళ డిసెంబర్ 27 ప్రభాతవార్త :"నిర్ణీత వయస్సు రాకుండా వివాహం చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని, బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరం, చేసుకున్న వారు, చేయించినవారు, సాక్ష్యులు, అందరూ శిక్షార్హులేనని, ఈ చట్టంపై అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని" భీమవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు బాల్య వివాహ నిషేధ చట్టం మరియు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించేందుకు శనివారం కాళ్ళ గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహనా సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తే మన భావి తరాలు సురక్షితంగా ఉంటాయని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని" అన్నారు. ఈ కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు ఎం. బి.భవాని, కె.విజయలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బందా విజయ, ఉప సర్పంచ్ పి.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటా ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరుడిసెంబర్ 27 ( ప్రభాతవార్త) మొగల్తూరు మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన సీలం అభిరామ్ (19) శుక్రవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై దురదృష్టవశాత్తు మృతి చెందడం అత్యంత విషాదకరమని , ప్రభుత్వ విప్, మరియు శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఉదయం టీడీపీ పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆయన అభిరామ్ భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కఠిన సమయంలో కుటుంబానికి తాము అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని వారు భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై తీవ్ర సంతాపం తెలియజేస్తూ, బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అభిరామ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తి ప్రసాదించాలని ప్రార్థించారు.



# మావుళ్ళమ్మ అమ్మవారికి
# వెండి డమరుకం హస్తం అందజేత

భీమవరం డిసెంబర్ 27 ప్రభాతవార్త : బలుసుమూడిలోని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి దాతలు కేజీ వెండితో తయారు చేసిన వెండి డమరుకం హస్తాన్ని శనివారం అందించారు. మూడేళ్లకు ఒకసారి మావుళ్ళమ్మ అమ్మవారి జాతర సంబరాలు జరుగుతాయని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా పట్టణానికి చెందిన వెంకట్రామయ్య కుటుంబ సభ్యులు కేజీ వెండితో తయారు చేసిన డమరుకం హస్తాన్ని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి చేతుల మీదుగా అందించారు. ఈ దేవాలయానికి భక్తులు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని, ఇటీవలే 2 కేజీల వెండి కిరీటాన్ని కూడా దాతలు అందించారని సీతారామలక్ష్మి అన్నారు. ఈ మావుళ్ళమ్మ జాతర మహోత్సవంలో పాలుపంచుకోవడం అందంగా ఉందని, సంప్రదాయబద్ధంగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తారని అన్నారు. ముందుగా అమ్మవారి పూరి గుడి వద్ద నుంచి గ్రామోత్సవం, జాతర సంబరం, ఆదివారం నైవేద్య సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయనున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి డమరుకం హస్తాన్ని అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీలక్ష్మి,వీరమల్లు వెంకటరమణ, బొక్క శ్రీనివాస్ వార్డు పెద్దలు పాల్గొన్నారు.





నర్సాపురం మండలం పెదమైనవాని లంక గ్రామంలో ఆదివారం కేంద్ర మంత్రి సీతారామన్ పర్యటన సందర్భనీ గా పలు యూనిట్స్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ ప్రభాతవార్త నర్సాపురం రూరల్

## మరొకసారి మానవత్వం చాటుకున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



ద్వారకాతిరుమల డిసెంబర్ 27 ప్రభాతవార్త :ద్వారకాతిరుమల మండలం, గుణ్ణం పల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి శ్రీనివాస రెడ్డి తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ స్టార్ హాస్పిటల్.లో. చికిత్స పొందుతున్నారు,లివర్ మార్పిడిచెయ్యాలని దానికి గాను 8లక్షల.రూపాయలు అవసరం అని హాస్పిటల్ వారు తెలిపారు అని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు ,అంత డబ్బులు పెట్టుకునే ఆర్థిక స్థోమతతమదగ్గర లేదు అని వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు మండల పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ ద్వారా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కలిశారు ,వెంటనే శాసన సభ్యులు వారు ఒక్క రోజులోనే వారి వైద్యానికి అవసరమైన 8లక్షల రూపాయలు ఎల్ఓసి నీ ముఖ్య మంత్రి సహాయ నిధి కార్యాలయం నుంచి వారి కుమారుడికి అందజేశారు ,ఇంతటి సహాయం.అందించిన శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజు ,మండల పార్టీ అధ్యక్షులు లంకా సత్య నారాయణ వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకములో శిక్షణ



ఆగిరిపల్లి డిసెంబర్ 27 ప్రభాతవార్త :ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామము లో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం క్రింద రైతులకు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమము లో జిల్లా వనరుల కేంద్రంఏలూరు వారి అద్వర్యం లో ఈ కార్యక్రమం జరిగినది. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఉషా కుమారి మాట్లాడుతూ మొక్కజొన్న లో కత్తెర పురుగు తో అప్రమత్తముగా ఉండాలని తెలియచేసారు. కత్తెర పురుగు ఆశించిన పంట ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుంది. ఇటువంటి రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి. మొక్కజొన్న కంకి మరియు లేత కండె భాగాన్ని కూడా తిని నష్టపరుస్తుంది. ఈ పురుగు నివారణకు ఎకరానికి 500 మి. లీ . క్లోరిఫైరిఫాస్ లేదా 400 మి. లీ. క్వినాల్ ఫాస్ మందులను పిచికారీ చేయాలి. కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 %ాణ% 80 గ్రాములను ఎకరానికి మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి 2 నుండి 3 సార్లు మందును పిచికారీ చేయాలి. ఈ పురుగు ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన యాజమాన్య పద్ధతులను సరైన సమయములో పాటించి ఈ పురుగు యొక్క ఉధృతి మరియు పురుగు వలన కలిగే అపారమైన నష్టాన్ని నివారించవచ్చును. ఈ కార్యక్రమములో జిల్లా వనరుల కేంద్రం మండలవ్యవసాయాధికారి భవాని గ్రామ వ్యవసాయ సహాయకులు శివాజీ ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీ దినోత్సవం

అత్తిలి డిసెంబర్ 27 (ప్రభాత వార్త): ఆటపాటల ద్వారానే అంగన్వాడి విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్లు అత్తిలి మండలం ఆరవల్లి అంగన్వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలకు విద్యార్థులను పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గర్భవతులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని అన్నారు.



చిన్నారులు, తల్లిదండ్రులు ఏ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 10 తరగతి విద్యార్థులకు అల్పాహారం



చాట్రాయి, డిసెంబర్ 27,ప్రభాతవార్త : పదవతరగతి విద్యార్థులకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి అల్పాహారం అందించటం గొప్ప కార్యక్రమం అని చనుబండ సహకార సంఘ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. నారా లోకేష్ విద్యామృతం పేరుతో తమ స్వంత నిధులతో నియోజక వర్గంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10 వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు 100 రోజుల పాటు సాయంత్రం పౌష్టికరమైన అల్పాహారాన్ని అందించడం విద్యార్థులకు గొప్ప వరమని కొనియాడారు. శనివారం చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొలుసు పెద్ద రెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి పంపించిన అల్పాహారాన్ని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో 10 వ తరగతి విద్యార్థులకు కూటమి నాయకుల ద్వారా అందించారు. వారంలో రోజుకి ఒక పదార్థాలు అందిస్తారని దీని వల్ల స్టూడెంట్స్ అలసిపోకుండా చక్కగా చదువుకొని మంచి మార్కులు సంపాదించుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నక్కా రాముమాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి 5వేలు,రెండో స్థానం వచ్చిన విద్యార్థి కి 4వేలు మూడో స్థానం వచ్చిన స్టూడెంట్ కు 3వేలు నగదు బహుమతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బన్నే వీరయ్య, చీదిరాల మారేశ్వర రావు, బీజేపీ నాయకులు నెక్కళపు వెంకటేశ్వరావు, బుర్రి శ్రీకర్, విస్సంపల్లి రాజా, దార్ల సురేష్ కుమార్, రమేష్, మారాజు వెంకటేశ్వర రావు, బుజ్జోడు, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తపస్య స్కూల్ లో ఘనంగా సంప్రదాయ ఆహారోత్సవం

కామవరపుకోట ప్రభాతవార్త,డిసెంబర్ 27 :విద్యార్థి దశ నుండి పిల్లలకు భారత దేశం సంస్కృతి మరియు సంప్రదాయాలు పట్ల అవగాహన కల్పించడానికి సంప్రదాయ ఆహారోత్సవం వంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. శనివారం కామవరపుకోటలోని తపస్య విద్యా సంస్థ నిర్వహించిన సంప్రదాయ ఆహారోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని స్టాల్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎపి,అస్సాం ,సిక్కం వంటి దేశంలోని ఇరవై ఒక్క రాష్ట్రాల ఆహారం ఇతర సంప్రదాయాలను పరిచయం చేయడం ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి పట్ల అవగాహన పెంచడం అభినందనీయం అన్నారు.కామవరపుకోట మండలంలో ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసి ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయం అని విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ ఛైర్మన్ తోకల రాజేష్,అకడమిక్ డైరెక్టర్ జగన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు



కిలారు. సత్యనారాయణ, ఆడమిల్లి సర్పంచ్ ,గూడపాటి కేశవరావు,తాడిచర్ల సర్పంచ్ పార్థసారధి,తడికలపూడి సొసైటీ అధ్యక్షుడు తూతా. బాలాజీకుమార్, కామవరపుకోట మాజీ సొసైటీ చైర్మన్ ఘంటా సత్యం బాబు,జనసేన నాయకులు వీరబాబు,సిరిగినేటి.వెంకన్న బాబు,ఎం.శ్రీను ,బిజెపి మండల అధ్యక్షులు ఎస్.ఆర్.ఆర్.ఎల్.ఎస్.ఎన్. రాజు కాకి సురేష్ కుమార్, నందూరి భాను,విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరాల వెంకన్నను దర్శించుకున్న భక్తులు.



అత్తిలి - డిసెంబర్ 27( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఈడూరు గ్రామం లోని వరాల వేంకటేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పాశురాల ప్రవచనం , తోమాల సేవ , విశేష అర్చనలు జరిపారు. భక్తుల సహకారంతో గోవింద నామాలను పఠించారు భక్తులకు దేవాలయ కమిటీ సహకారం తో అన్నదానం జరిపారు.అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు , వల్లి వెంకటేష్ , సూర్య తేజ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు.స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

## భోజనాలు రుచికరంగా ఉండాలి



చాట్రాయి, డిసెంబర్27,ప్రభాతవార్త :మధ్యాహ్న భోజనం విద్యార్థులకు రుచిగా పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మర్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన భోజన పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడుతూ విద్యార్థుల భోజనం విషయంలో రాజీ పడవద్దని చెప్పారు. ఆ తర్వాత విద్యార్థుల భోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయురాలు అనూష, వంట ఏజెన్సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై ప్రభుత్వం ఇస్తున్న సోలార్ ను సద్వినియోగం చేసుకోండి




చాట్రాయి, డిసెంబర్ 27,ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ విద్యుత్తును అందిస్తోందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ సంజయ్ చెప్పారు. శనివారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. సోలార్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ఒక కె.వి సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం 30వేల రూపాయలు సబ్సిడీ అందజేస్తుందని ఆ విధంగా ఎన్ని కె.విలు దరఖాస్తు చేసుకుంటే దానికి సబ్సిడీ వస్తుందని చెప్పారు. గృహ వినియోగం బిల్లులో లోడు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఉండే విధంగా ఉండాలని ఆయన సూచించారు. మూడు కె.విల వరకు సబ్సిడీ వస్తుందని గరిష్టంగా 78,000 రూపాయలు సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. దీనివల్ల విద్యుత్ బిల్లును ఆదా చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అయన చెప్పారు. గ్రామాలలో సోలార్ విధానం పై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని ఆయన చెప్పారు. ఇంకా ఏమైనా సమాచారం అవసరం అయితే తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కామవరపుకోట,ప్రభాత వార్త: రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెలే బడేటి రాధాకృష్ణ అన్నారు. శనివారం ఆయనను ఏలూరు లోని క్యాంపు కార్యాలయంలో కామవరపుకోట మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్.పి.టీ.సి ఘంటా సుధీర్ బాబు, ఏలూరి.హరిబాబు, తడికలపూడి గ్రామం పార్టీ ప్రెసిడెంట్ బొంతు వెంకటేశ్వరరావు, నెక్కలపు సూర్యనారాయణ, గంగాధర రావు, క్లస్టర్ ఇంచార్జీ డాన్ బొబ్బిలి,మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గోరిక సతీశ్, కామవరపుకోట పట్టణ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రాజేష్,పలువురు టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీకి పదును : డ్వామా ఏపిడీ



పోడూరు, డిసెంబర్ 27, ప్రభాత వార్త: గ్రామ అభివృద్ధికి రైతులకు మేలు చేసేలా ఉపాధి హామీ పనులను గుర్తించి సక్రమంగా అమలు చేయాలని డ్వామా ఏపిడీ జీవీకే మల్లికార్జునరావు అన్నారు. పోడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై సామాజిక తనిఖీ సందర్భంగా ఎంపీడీవో బి.ఎస్.ఎల్. మంగాకుమారి అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024?25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులు, పింఛన్లు, పంచాయతీరాజ్ పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించాలని తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలపై రూ. 51,423 రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే రూ. 14,415 రెక్టిఫికేషన్‌కు, రూ. 10,44,274 ఎంక్వయిరీకి ఆదేశించినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ పనులకు సంబంధించి రూ. 44,418 రెక్టిఫికేషన్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి చేపట్టే ఉపాధి హామీ పనులు ప్రభుత్వానికి, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపయోగపడేలా గ్రామసభ తీర్మానం అనంతరం చేపట్టాలని సూచించారు.

# ప్రపంచానికి వెలుగు క్రీస్తు జననం....
## ప్రేమ, దయ, త్యాగమే నిజమైన మార్గదర్శకం: మంత్రి రామానాయుడు
## ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు.

పాలకొల్లు, డిసెంబర్ 27( ప్రభాత వార్త ): ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి ఒక వెలుగు వంటిదని, ఆయనలోని ప్రేమ, దయ, త్యాగ గుణాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో శనివారం సాయంత్రం తన నివాసం వద్ద ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ ఆరాధన మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని అన్ని వార్డుల నుంచి వేలాదిగా క్రైస్తవ సోదరసోదరీమణులు హాజరయ్యారు. ముందుగా మంత్రి రామానాయుడు క్రిస్మస్ కేకును కట్ చేసి అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా వందమందికి పైగా పాస్టర్లను కుటుంబ సమేతంగా సత్కరించి నూతన వస్త్రాలు బహుకరించారు. భారీ సెట్టింగ్, డిజిటల్ లైటింగ్ ఎఫెక్ట్స్‌తో గంటన్నర పాటు 70 మంది కళాకారులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక మంచి సందేశం తో అందరినీ ఆకట్టుకుంది. కళాకారులు తమ పాత్రలో లీనమయ్యారు.ప్రముఖ సినీ గాయకురాలు ఎం.ఎం. శ్రీలేఖ ఆలపించిన క్రైస్తవ గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్టర్ల సందేశాలు, భక్తిగీతాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. మంత్రి రామానాయుడు తన ప్రసంగంలో పవిత్ర బైబిల్ గ్రంథంలోని "నీ మంచిని, ప్రేమని మాటల్లోనే కాదు, నీ చేతల ద్వారా కూడా చూపించుబీ అప్పుడే నీవు నిజంగా క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తున్నట్టు" అనే వాక్యాన్ని గుర్తు చేశారు. ఏసుక్రీస్తు చూపిన త్యాగ గుణాలు, అనురాగాలు ప్రజల జీవనశైలిని శాంతియుత సమాజంగా మార్చాయని తెలిపారు. క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఆచరణీయమని అన్నారు. ప్రజల కొరకు ఏసుప్రభు ప్రాణత్యాగం చేశారని, అందుకే ప్రపంచ దేశాలన్నీ ఆయనను ఆరాధించి ప్రేమిస్తున్నాయని పేర్కొన్నారు. ఏసుప్రభును స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పనిచేయాలన్నారు. క్రీస్తు మార్గంలో క్రైస్తవ సంస్థలు, మిషనరీ సంస్థలు ఉచితంగా విద్య, వైద్యం, సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు. . క్రిస్మస్ వేడుకలను ప్రపంచమంతా ఘనంగా జరుపుకుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు బోణం చినబాబు, ఉన్నమట్ల కబర్ది, ఎర్రంశెట్టి పద్మారావు, పెచ్చెట్టి వెంకట నరసింహారావు, తులా రామలింగేశ్వరరావు, పాస్టర్లు గోబేరు యేసు కృపా శాంసన్, బత్తుల దేవదానం, జీఎస్ కుమార్, విప్పర్తి విజయరత్నం, ఎస్ ఎబినైజర్, రాపాక రత్నం రాజు, దానియేల్ , కార్యక్రమసంధానకర్తలుగా పాముల రజిని కుమార్, ఫౌండేషన్ కన్వీనర్ ఆర్ వి అప్పారావు లు వ్యవహరించారు. ఫౌండేషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరసోదరీమణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు. అందరికీ ప్రేమ విందును ఏర్పాటు చేశారు.

# భక్తులతో కిటకిట లాడిన మద్ది క్షేత్రం



ప్రభాత వార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలము, గురవాయిగూడెం గ్రామము నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానము నందు ఉదయం గం.08.00ల నుండి ఆలయ ముఖ మండపం నందు పంచామృతఅభిషేకం ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆధ్వర్యములో జరుపబడినది. ఈ కార్యక్రమం నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనినారు. ఈ రోజు మధ్యాహ్నం గం.02.00 లవరకు శ్రీ స్వామి వారి ఆలయమునకు వివిధ సేవల రూపేణా రూ. 1,54,235/-లు సమకూరినది. శ్రీ స్వామి వారికి స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు సుమారు 1150 మంది భక్తులకు అన్నదానము జరుపబడినది. శ్రీ స్వామి వారి దర్శనమునకు విచ్చేసిన ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెల్పినారు.

# జిల్లాలోని పలు రోడ్లకు మహర్దశ



భీమవరం డిసెంబర్ 27 ప్రభాతవార్త : జిల్లాలో రూ. 4,133 లక్షల రూపాయలు మంజూరు నాగరాణి తెలిపారు. వీటిలో రెండు రాష్ట్ర రూ. 900 లక్షలు, జిల్లాలోని 16 ప్రధాన రూ. 3,233 లక్షలు రోడ్ల అభివృద్ధికి ఖర్చు పురం వయా కొమరాడ, అనా కోడేరు రోడ్డు కిలోమీటర్ల పరిధిలో రోడ్డు అభివృద్ధికి రూ. 448 20.750, గొల్లలకోడేరు టు నౌడూరు కి.మీ 9/ 83.690కిలో మీటర్ల మేర రహదారుల అభివృద్ధికి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ రహదారులు 12.580 కిలోమీటర్లు పరిధిలో రహదారులు 71.110 కిలోమీటర్ల పరిధిలో చేయనున్నట్లు తెలిపారు. భీమవరం - ఎల్.వి.ఎన్ 5/2 - 550, 5/8 - 8/6, 10/0 - 12/120 లక్షలు, కొల్లేరు టు భీమవరం కి.మీ 15.800 - 173 టు 11/4 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 485 లక్షలు, మొగల్తూరు టు బేతపూడి వయా వెంప రూ. 5.200 టు 600, 6/6 టు 9/12 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 280 లక్షలు, యలమంచిలి టు సరిగాలపల్లి కి.మీ 1.0400 టు 4.260, పాలకొల్లు టు కాజా కి.మీ 1.580 టు 3.583, పిడి రోడ్డు టు గణపవరం 0.0 టు 3.000 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 370 లక్షలు, మచిలీ టు కోరుకొల్లు కి.మీ 0.000 టు 3/460, 4/200 టు 5/135, 5/556 టు 6/380, 6/7 టు 7/4 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 380 లక్షలు, కోలమూరు టు కొండేపాడు కి.మీ 0.000 టు 1/6, 3/1 టు 5/2, 7/4 టు 10/0, కవిటంపాకల టు మలవానితిప్ప కి.మీ 0.000 టు 9.100 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 270 లక్షలు, కొమ్ముచిక్కాల టు మాదుగుపోలవరం, కాజా టు కలగంపూడి రోడ్డు 5.33 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ. 300 లక్షలు, మార్టేరు టు వడలి రోడ్డు కి. 1.700 టు 3.200 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 20 లక్షలు, సి జి రోడ్డు టు కోనాల రోడ్డు వయా కాగుపాడు, జలపాలెం, దర్భిపర్రు మీదుగా 19/6 టు కి.మీ 24/6 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 30 లక్షలు, మాధవరం టు కంసాలిపాలెం 0/150 టు 0/500 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 70 లక్షలు, ఎన్ ఏ రోడ్డు టు బోడపాడు 1/0 టు 5/0 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు అభివృద్ధికి రూ. 150 లక్షలు, అత్తిలి అలంపురం రోడ్డు కి.మీ 6/3 టు 11/8 వరకు రోడ్డు అభివృద్ధికి రూ. 40 లక్షలు, నవాబుపాలెం టు దండగర్రు నాలుగు కిలోమీటర్ల పరిధిలో రోడ్డు అభివృద్ధికి రూ. 30 లక్షలు, మాముదురు టు ముప్పర్తిపాడు 3.40 కిలోమీటర్ల పరిధిలో రూ. 80 లక్షలు, ఏనుగువానిలంక టు బాడవ వయా మధ్యపుంత రోడ్డు 0.19 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు అభివృద్ధికి రూ. 50 లక్షలు, అలాగే రాష్ట్ర రహదారులు చేబ్రోలు టు ఉండి రోడ్డు 6.250 కిలోమీటర్ల విస్తీర్ణంలో రోడ్ల అభివృద్ధికి రూ. 500 లక్షలు, భీమవరం టు గుడివాడ రోడ్డు 6.330 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు అభివృద్ధికి రూ. 400 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి రోడ్లు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

## తపస్ స్కూల్ విద్యార్థుల రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం సందర్శన



ప్రభాత వార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలోని తపస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు గత రెండు రోజులుగా రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన వివిధ శాస్త్రీయ ప్రయోగాలు, వర్కింగ్ మోడల్స్‌ను తిలకించి విశేషమైన జ్ఞానాన్ని సంపాదించారు. విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించిన సైన్స్‌కు సంబంధించిన ప్రయోగాలు పిల్లల్లో ఆసక్తిని పెంచడమే కాకుండా వారి మేధాశక్తి, తార్కిక ఆలోచనలకు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియంలో సైన్స్ పార్టీ (%ాఎఅవఅషెవ్రాఖతీఎ%) యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించగా, అక్కడ ఉన్న వర్కింగ్ మోడల్స్ ద్వారా వివిధ సైన్స్ కాన్సెప్ట్‌ను ఎంతో ఆహ్లాదకరంగా, సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై మరింత ఆసక్తిని పెంపొందించాయని పేర్కొన్నారు. తపస్ స్కూల్ యాజమాన్యం జంగారెడ్డిగూడెం నుండి రాజమహేంద్రవరం వరకు బస్సు సౌకర్యం కల్పించి, రెండు రోజులపాటు విద్యార్థులను తీసుకువచ్చి ఈ విద్యా అనుభూతిని అందించిందని తెలిపారు. ఇటువంటి శిక్షణాత్మక పర్యటనలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల నిర్వాహకులు అన్నారు.

## 10 వ తరగతి విద్యార్థులుకు స్టడీ మెటీరియల్ వితరణ



నూజివీడు, డిసెంబరు 27 ప్రభాతవార్త= నూజివీడు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బాలికల పాఠశాల లో 10 తరగతి చదువుతున్న 177 విద్యార్థులకు, నూజివీడు 15 వ అదనపు కోర్టు జిల్లా విభాగ న్యాయవాది పరిషత్ అధ్యక్షులు రామినేని రామకృష్ణ , తన తాత గారు రామినేని నారాయణ స్వామి జ్ఞాపకార్థం యు .టి .ఎఫ్ వారిచే రూపొందించబడిన అన్ని సబ్జెక్టుల స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు వై.హరిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతమైన స్థానాలు అధిరోహించాలని అన్నారు. దాత రామినేని రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి, దేశం గర్వించే స్థాయికి చేరుకోవాలని అన్నారు. అనంతరం రామినేని రామకృష్ణ గత ఎనిమిది సంవత్సరాలుగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్న తన ధాత్రుత్వాన్ని వక్తలు కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, లాయర్ రామకృష్ణని, లాయర్ హరిబాబు ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి. అనురాధ ,నూజివీడు ఎం.ఈ.వో -1 దేవ వరప్రసాద్ , యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ , యు టి ఎఫ్ మండల అధ్యక్షులు బొద్దుకోళ్ళ బాబురావు, సభ్యులు రఘుబాబు, బొల్లిగర్ల శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ గోకుల కృష్ణ యాదవ సేవా ట్రస్టు క్యాలెండరులు ఆవిష్కరణ



నూజివీడు డిసెంబరు, 27 ప్రభాతవార్త: ముసునూరు మండలం, చెక్కపల్లి గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ కృష్ణా ఆలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు చిర్రా. కోటేశ్వరరావు , ఆధ్యాత్మిక సలహాదారులు జువ్వనబోయిన. నర్సింహారావు (సిద్ధాంతి ) , ఉపాధ్యక్షులు మానికల గంగాధర్ గారు, ఫౌండర్ ,ట్రెజరర్ ఆర్ల. గోపాలకృష్ణ , ప్రధాన కార్యదర్శి కాట్రు. తారకేశ్వరరావు , కార్యనిర్వాహక కార్యదర్శి చింతా. నాగమణి , తట్టుకోల. నాగేశ్వరరావు , ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వేల్పురి. శివాజీ ,నాగేశ్వరరావు , ఆర్ల. వెంకటేశ్వరరావు , ట్రస్ట్ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు కందుల. పిచ్చయ్య , పాకనాటి. రాజారావు తలకొండ భాస్కరావు ,గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్ని ఈ కార్యక్రమాని విజయవంతం చేశారు.